

● **ప్రజాగళం సూపర్ సక్సెస్**

ఆత్మకూరు, బుచ్చి ప్రజాగళం సభలు సూపర్ సక్సెస్ అయ్యాయి. ఈ రెండు సభలకు జనం వేల సంఖ్యలో హాజరయ్యారు. ఆత్మకూరులో నాలుగు రోడ్ల కూడలిలో ఎటు చూసినా జనమే కనిపించారు. బుచ్చిలో కిలోమీటర్ల దూరం జనం నిలబడిపోయారు. చంద్రబాబు పర్యటన షెడ్యూల్ కన్నా రెండున్నర గంటలు ఆలస్యం అయినా బుచ్చిలో జనం చెక్కుచెదరకుండా నిరీక్షించారు. చంద్రబాబు ప్రసంగం పూర్తయ్యే వరకు నిలబడి ఉన్నారు. ఈ రెండు సభల్లో చంద్రబాబు ప్రసంగానికి ప్రజల నుంచి అనూహ్య స్పందన లభించడం విశేషం.

● **బావ, బావమరుదుల సందడి**

ఎన్నికల ప్రచారంలో భాగంగా నెల్లూరు జిల్లాలో ఒకే రోజు బావ, బావమరుదులు సందడి చేశారు. చంద్రబాబు నాయుడు, బాలకృష్ణలు శనివారం సాయంత్రం ఏక సమయంలో జిల్లా పరిధిలోని వేర్వేరు ప్రాంతాల్లో ప్రచారాలు చేశారు. సాయంత్రం ఐదు గంటల నుంచి రాత్రి 8 గంటలకు వరకు చంద్రబాబు ఆత్మకూరు, బుచ్చిరెడ్డిపాలెం ప్రజాగళం బహిరంగ సభల్లో పాల్గొన్నారు. అదే సమయంలో బాలకృష్ణ వెంకటగిరి నియోజకవర్గం రాపూరు మండలంలో ఎన్నికల ప్రచారంలో పాల్గొనడం విశేషం.

నేడు ముస్లింలతో ఆత్మీయ సమావేశం

నెల్లూరులో ఆదివారం జరిగే ముస్లింల ఆత్మీయ సమావేశంలో చంద్రబాబు పాల్గొంటారు. ఉదయం 11 గంటలకు బుచ్చి నుంచి నెల్లూరుకు చేరుకోనున్న బాబు కోటమిట్టలోని షాదిమంజిల్‌లో జరిగే ముస్లింల ఆత్మీయ సమావేశంలో పాల్గొంటారు. మధ్యాహ్నం కర్నూలు జిల్లాకు పయనమవుతారు.





ఆత్మకూరు శివార్లలోని నెల్లూరుపాళెం వద్ద జరిగిన ప్రజాగళం సభకు హాజరైన ప్రజానీకాన్ని ఉద్దేశించి ప్రసంగిస్తున్న చంద్రబాబు నాయుడు

మెట్టను సస్యశ్యామలం చేస్తా

మెట్ట ప్రాంతమైన ఆత్మకూరు నియోజకవర్గాన్ని సస్యశామలం చేసే బాధ్యత నేను తీసుకుంటా. సోమశిల ఉత్తర, దక్షిణ కాలువల లైనింగ్ పనులు పూర్తి చేయడంతోపాటు సోమశిల హైలెవల్ కెనాల్‌ను త్వరితగతిన పూర్తి చేసి శాశ్వత తాగు, సాగునీటి ఎద్దడి నివారణకు కృషి చేస్తా. ఆత్మకూరులో పరిశ్రమలను ఏర్పాటు చేయించి నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించే బాధ్యత నాదే. మెట్టప్రాంతాల ప్రజలకు మెరుగైన వైద్యం అందించే దిశగా ఆత్మకూరులోని జిల్లా ప్రభుత్వ వైద్యశాలను 250 పడకల ఆసుపత్రిగా తీర్చిదిద్దుతా. అంతే కాదు.. ఇక్కడ ట్రామాకేర్ సెంటర్‌నూ ఏర్పాటు చేస్తాం. ఆత్మకూరును అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి చూపిన రాజకీయ అనుభవంగల ఆనం రామనారాయణరెడ్డిని, ప్రజాసేవే పరమార్ధంగా రాజకీయాల్లోకి వచ్చి టీడీపీ ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని ఆదరించి అత్యధిక మెజార్టీతో గెలిపించండి. మీ కోసం నేనున్నా..

- ఆత్మకూరు సభలో చంద్రబాబు



టీడీపీలోకి మెట్టుకూరు

ఎన్డీసీసీబీ మాజీ చైర్మన్ మెట్టుకూరు ధనుంజయరెడ్డి వైసీపీని వీడి తెలుగుదేశంలో చేరారు. నెల్లూరుపాళెం సభలో ధనుంజయకు చంద్రబాబు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

అవకాశవాదులకు గుణపాఠం చెప్పండి



చంద్రబాబు తిరిగి ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని నెల్లూరు టీడీపీ ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. ప్రజాసేవే లక్ష్యంగా వచ్చిన తనను ఆదరించి ఎంపీ టిక్కెటు ఇచ్చి పోటీ చేయమని ఆదేశించారని తెలిపారు. ఆత్మకూరులో వచ్చే అత్యధిక మెజార్టీ తన గెలుపునకు కీలకమని పేర్కొన్నారు. వైసీపీ అభ్యర్థులది ఊసరవెల్లి రాజకీయమని ఎద్దేవా చేశారు. అలాంటి అవకాశవాదులకు ప్రజలు ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని కోరారు. ఆత్మకూరులో గత పదేళ్లల్లో మేకపాటి కుటుంబం చేసిన అభివృద్ధి శూన్యమని విమర్శించారు.

- నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి

అన్నివర్గాల అభ్యున్నతే ధ్యేయం



రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు గద్దెనెక్కడం చారిత్రాత్మక అవసరమని, వైసీపీ దుర్మార్గపు పాలనను అంతమొందించాలని టీడీపీ అభ్యర్థి ఆనం రామనారాయణరెడ్డి అన్నారు. విక్రమ సింహపురి యూనివర్సిటీకి అనుబంధంగా ఆత్మకూరులో ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. ఏఎస్‌పేటను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని స్పష్టం చేశారు. అన్ని వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా పనిచేస్తానని హామీ ఇచ్చారు. భారీ మెజార్టీతో టీడీపీకి విజయం చేకూర్చాలని కోరారు.

- ఆత్మకూరు అభ్యర్థి ఆనం రామనారాయణరెడ్డి

● బుచ్చిలో హైటెక్స్ టవర్

బుచ్చిలో జరిగిన సభలో కోవూరు నియోజకవర్గ సమస్యలను నేతలు చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారు. వీటిపై స్పందించిన ఆయన కోవూరుకు వరాలు ప్రకటించారు. బుచ్చిలో హైటెక్స్ టవర్‌ను నిర్మించి ఇక్కడ నుంచే ప్రపంచవ్యాప్తంగా ఉద్యోగాలు చేసే విధానానికి శ్రీకారం చుడతానని ప్రకటించారు. కనిగిరి రిజర్వాయర్‌లో పూడిక తీస్తామని, ముదివర్తిపాళెం కాజ్‌వేను నిర్మిస్తామని హామీ ఇచ్చారు. జొన్నవాడ ఆలయ అభివృద్ధి, డెల్టాను ఆధునీకరిస్తామని ప్రకటించారు. బుచ్చిలో డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. మత్స్యకారులను ఆదుకోవడంతోపాటు ఫిషింగ్ హార్బర్‌ను పూర్తి చేస్తామన్నారు. ఇక చేనేతలను ఆదుకునే బాధ్యత తాను తీసుకుంటానని భరోసా ఇచ్చారు. కాగ పోలంరెడ్డి దినేష్‌రెడ్డి పార్టీ కోసం ఎంతో కష్టడ్డారని, ఆయన్ను ఆదుకునే బాధ్యత తాను తీసుకుంటానని ప్రకటించారు.

కుక్కలు మొరిగితే
ఏనుగులు భయపడతాయా!?

- మహిళలంటే గౌరవం లేని వైసీపీ
- ఈ చిల్లర నేతలను ఇళ్లకు పంపించండి
- బుచ్చి, ఆత్మకూరు ప్రజాగళం సభల్లో టీడీపీ అధినేత చంద్రబాబు

ఆత్మకూరు/బుచ్చిరెడ్డిపాళెం, ఏప్రిల్ 27(ఆంధ్ర జ్యోతి): కోవూరు టీడీపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి ఓ ఆడపడుచు అనే కనీస గౌరవం లేకుండా ఆమెపై అభ్యంతరకరంగా పోస్టింగ్‌లు పెట్టిస్తారు. ఆత్మకూరు మున్సిపల్ చైర్‌పర్సన్ టీడీపీలో చేరిందని ఆమెను అవమానకరంగా మాట్లాడతారు. ఆమె నెత్తిమీద రూపాయి పెడితే పది పైసలు కూడా అమ్ముడుపోదంటారా..!? ఇష్టమొచ్చినట్లు పోస్టింగ్‌లు పెడితే ప్రశాంతిరెడ్డి భయపడి పారిపోతుందని అనుకొంటున్నారా!? పర్సంటేజీల ప్రసన్న గుర్తు పెట్టుకో.. ఆమె పారిపోయే రకం కాదు.. నిన్ను తరిమికొడుతుంది! జాగ్రత్త, వైసీపీ నాయకులు, పేటీఎం బ్యాచ్‌లు ఒళ్లు దగ్గరపెట్టుకొని మాటాడండి, ఇలాంటి చిల్లర నాయకులను ఇళ్లకు పంపించండి'. అని తెలుగు దేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు. శనివారం ఆత్మకూరు, బుచ్చిరెడ్డిపాళెంలలో జరిగిన ప్రజాగళం సభల్లో ఆయన మాట్లాడారు. మహిళలు అనే గౌరవం లేకుండా వైసీపీ నాయకులు కుక్కలు మొరిగినట్లు మొరుగుతున్నారని మండిపడ్డారు.

● **చిత్తుగా ఓడించండి!**

కోవూరు నుంచి ఎన్డీయే అభ్యర్థిగా వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి పోటీ చేస్తోంది. ఆమెపై వైసీపీ ఎమ్మెల్యే తన పేటీఎం బ్యాచ్‌తో ఇష్టమొచ్చినట్లు పోస్టింగ్‌లు పెట్టిస్తాడు. సోషల్ మీడియాలో ఇష్టం వచ్చినట్లు నోరు పారేసుకొంటున్నాడు. ఆడపడుచు అనే గౌరవం లేకుండా కుక్కలు మొరిగినట్లు మొరుగుతున్నారు. కుక్కలు మొరిగితే ఏనుగులు భయపడుతాయా..!? మా అభ్యర్థి ప్రశాంతిరెడ్డి ఏనుగుతో సమానం' అని చంద్రబాబు అన్నారు. రాజకీయాలంటే సేవ అనేది వేమిరెడ్డి దంపతుల ఆలోచన, కానీ రాజకీయం అంటే దోపిడీ అనేది ప్రసన్న సిద్ధాం



బుచ్చిలో ప్రసంగిస్తున్న చంద్రబాబు, పక్కన వేమిరెడ్డి దంపతులు

తం అనే విషయం ప్రజలందరికి తెలుసన్నారు అసలు జగన్ రెడ్డికి ఆడబిడ్డ లంటే గౌరవం లేదని, ఆయన బాటలోనే ఈ చిల్లర నాయకులు మహిళలను చులకనగా మాట్లా డుతున్నారని అన్నారు. తల్లికి అన్నం పెట్టకుండా తరిమేసిన జగన్, చెల్లెళ్లకు ఆస్తిలో వాటా ఇవ్వకుండా వీధిలోకి నెట్టేసిన జగన్, బాబాయి అనే కనికరం లేకుండా గొడ్డలి దించిన నాయకుని వెంట నడిచే వారికి సంస్కారం ఎక్కడుంటుందన్నారు. ఇలాంటి చిల్లర నాయకులను తరిమికొట్టే రోజులు దగ్గర్లోనే ఉన్నాయన్నారు. మహిళల పట్ల కనీస గౌరవ మర్యాదలు లేని వైసీపీని ఈ ఎన్నికల్లో చిత్తుచిత్తుగా ఓడించే బాధ్యత మహిళలే తీసుకోవాలన్నారు.

ప్రసన్నకు ఇవే ఆఖరి ఎన్నికలు



ఇసుక, గ్రావెల్, మాఫియాలు, అవినీతిని ప్రశ్నిస్తే దానికి సమాధానం చెప్పకలేక నన్ను, వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని ఎదుర్కోలేక పిచిపిచ్చిగా మాట్లాడుతున్న ప్రసన్నకు ఈ ఎన్నికలే ఆఖరి ఎన్నికలు కావాలి. తాగేందుకు గుక్కెడు నీళ్ల లేక, ఎవరైనా చనిపోతే పూడ్చేందుకు శ్మశానాలు కూడా లేవని ప్రజలు వాపోతుంటే 6 సార్లు ఎమ్మెల్యేగా గెలిచి ఏం చేశారు. నియోజకవర్గంలో యువతకు నిరుద్యోగ సమస్యతోపాటు అన్నివిధాలా సంక్షేమ పథకాలతో అభివృద్ధి చేస్తాము. కోవూరు ప్రజలు అవినీతి ప్రసన్నకు బాయ్ బాయ్ చెప్పి నెల్లూరు ఎంపీగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని, కోవూరు ఎమ్మెల్యేగా నన్ను గెలిపించాలి.

- కోవూరు అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి



రాపూరులో జరిగిన సభలో మాట్లాడుతున్న బాలకృష్ణ, పక్కన తిరుపతి ఎంపీ అభ్యర్థి వరప్రసాద్, వెంకటగిరి ఎమ్మెల్యే అభ్యర్థి కురుగొండ్ల రామకృష్ణ

జగన్ గురించి నాకంటే
పోలీసులకే బాగా తెలుసు!

● సినీ హీరో బాలకృష్ణ

రాపూరు (డక్కిలి), ఏప్రిల్ 27: నీచ, నికృష్ట, పాపిష్టి జగన్ పరిపాలన గురించి నాకంటే పోలీసులకే బాగా తెలుసు అని సినీ నటుడు నందమూరి బాలకృష్ణ అన్నారు. శనివారం వెంకటగిరి నియోజకవర్గ పరిధిలోని రాపూరులో జరిగిన ఎన్నికల ప్రచార సభలో ఆయన ప్రసంగించారు. అక్కడ బందోబస్తులో ఉన్న పోలీసుల వైపు చూసి ' ఏమ్మా... మీకు టీఏలూ, డీఏలూ, సెలవులు, అలవెన్సులు ఇస్తున్నారా?.. కనీసం జీతాలైనా సక్రమంగా ఇస్తున్నారా ..? అంటూ ప్రశ్నించారు. అందుకు వారు మౌనమే సమాధానంగా మిన్నకుండి పోయారు. 'ఎందుకమ్మా మీకు.. ఈ బానిస బతుకులు... ఉంటే రౌడీ ఇన్‌స్పెక్టర్‌లా ఉండండని హితవు పలికారు, ధన,మాన చివరకు వ్యవస్థలన్నింటిని నాశనం చేశాడు పిచ్చోడు... ఇంకా ఎందుకు ఊడిగం చేస్తారు.. ఒక్క రోజైనా నరసింహ నాయుడులా పనిచేయండి అని సూచించారు. జగన్ మాట్లాడితే నేను సిద్ధం అంటున్నారు. ఆయన దేనికి సిద్ధం... ? తల్లిని, చెల్లిని గెంటేసేందుకు సిద్ధమా? సొంత బాబాయిని హత్య చేసిన నిందితులను కాపాడేందుకు సిద్ధమా.. యువతకు ఉద్యోగాలు ఇస్తామని మోసం చేసేందుకా ? అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లో సీపీఎస్ రద్దు చేస్తానని ఉద్యోగులను మోసం చేసేందుకా.. ఎందుకు సిద్ధమో తేల్చాలన్నారు. అధికార దుర్వినియోగంతో మదం పట్టిన జగన్ రూ. 16 వందల కోట్ల ప్రజాధనాన్ని సిద్ధం సిద్ధం.. అంటూ బోర్డులకు ఖర్చు పెట్టారని బాలకృష్ణ ఆరోపించారు. రాష్ట్రంలో రాక్షస పాలనకు స్వస్తి పలికి రామరాజ్యం కావాలంటే ఎన్డీయే కూటమి విజయంతోనే సాధ్యమన్నారు. ప్రజలు తమ ఓటు అనే ఆయుధంతో జగన్‌ను తరలికొట్టాలన్నారు. రానున్న ఎన్నికల్లో వెంకటగిరి టీడీపీ అభ్యర్థి కురుగొండ్ల రామకృష్ణను, తిరుపతి ఎంపీగా బీజేపీ అభ్యర్థి వరప్రసాద్‌ను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అభ్యర్థులిద్దరితోపాటు టీడీపీ నాయకులు నరసింహయాదవ్, దందోలు వెంకటేశ్వరెడ్డి, రాఘవరెడ్డి, కోటేశ్వరరావు, కేఎంకే ప్రసాద్‌నాయుడు, అవ్వారు సత్యం, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.



సభలో పాల్గొన్న జనం

సీఎం గారూ..
మీరిచ్చిన జీవో మీకు వర్తించదా ?

- ఉల్లంఘిస్తూ ముఖ్యమంత్రి సభకు ఏర్పాట్లు
- జీవోకి కారణమైన ప్రదేశంలోనే సభాస్థలి
- ఇదెక్కడి చోద్యమంటున్న జనం

కందుకూరు, ఏప్రిల్ 27: సాక్షాత్తూ సీఎం జగన్మోహనరెడ్డి ప్రత్యేకంగా జారీచేసిన జీవో నెం.1861ను అధికారులు ఉల్లంఘిస్తు న్నారు. జాతీయ రహదారులు, రాష్ట్ర రహదారులు, పంచా యతీరాజ్, మున్సిపల్ రహదారులు రోడ్డు మార్జిన్లలో సభలు, సమావేశాలకు అనుమతులు ఇవ్వటాన్ని నిషేధిస్తూ గత ఏడాది జనవరి 2న ప్రభుత్వం జీవో జారీ చేసింది. ఈ ఆదేశాలను కఠినంగా అమలు చేయాలని అధికారులకు సీఎం జగన్ అప్పట్లో ప్రత్యేకంగా ఆదేశాలు జారీచేసింది. అధికారంలో ఉన్న వైసీపీకి కూడా ఎలాంటి మినహాయింపులు ఉండటానికి లేదని ఈ జీవోను కఠినంగా అమలుచేసి తీరుతామని రాష్ట్రప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి అప్పట్లో సెలవిచ్చారు. అయితే, సదరు జీవో జారీచేయటానికి కారణమైన ప్రదేశంలోనే సీఎం జగన్మోహనరెడ్డి ఆదివారం బహిరంగసభకు అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేస్తుండటం చోద్యంగా ఉందన్న విమర్శలు వినిపిస్తు న్నాయి. పట్టణంలోని ఏరియా హాస్పటల్ సెంటర్‌లో 2022 డిసెంబరు చివరివారంలో టీడీపీ అధినేత చంద్రబాబు ఇదేంఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో భాగంగా బహిరంగ సభ ఏర్పాటుచేశారు. పోలీసు ముందస్తు అనుమతులతోనే ఈ సభ ఏర్పాటుచేసినా తగిన భద్రతాచర్యలు చేపట్టకపోవటంతో బహిరంగసభ సమయంలో జరిగిన తొక్కిసలాట కారణంగా దురదృష్టవ శాత్తు 8మంది మృత్యువాత పడ్డారు. ఈ దుర్ఘటనను కారణంగా చూపించి ప్రభుత్వం రహదారులపై సభలు, సమావేశాలు, ర్యాలీల నిర్వహణను నిషేధిస్తూ 2023 జనవరి 2న జీవో జారీచేసింది. ప్రతిపక్ష పార్టీల నాయకులు ప్రజలవద్దకు వెళ్లేందుకు ఆటంకాలు సృష్టించేందుకే ప్రభుత్వం ఈ జీవో తెచ్చిందని అప్పట్లో ప్రతిపక్షాలు తీవ్రంగా వ్యతిరేకించినా ఈ జీవో అందరికీ వర్తిస్తుందని, ప్రజలకు అసౌకర్యం కలగకుండా చూసేందుకే జీవో తెచ్చామని ప్రభుత్వం సమర్థించు కుంది. అయితే ఈ జీవోను సీఎం జగన్ కోసమే అధికారులు ఉల్లంఘించటం ఒక ఎత్తైతే ఈ జీవోకు కారణమైన ప్రదేశంలోనే కచ్చితంగా సీఎం జగన్ సభను జరిపేందుకు ఏర్పాట్లు చేస్తుండటం మరింత చోద్యంగా ఉంది.



కందుకూరులోని ఎన్టీఆర్ సర్కిల్‌లో సీఎం జగన్ బహిరంగ సభ ఏర్పాట్లను పరిశీలించి, సూచనలిస్తున్న జిల్లా ఎస్పీ ఆరీఫ్ హఫీజ్, సబ్ కలెక్టరు విద్యాధరి తదితరులు

● **సభాస్థలి పరిశీలన**

జిల్లా ఎస్పీ ఆరీఫ్, కందుకూరు సబ్ కలెక్టరు విద్యాధరి తదితరులు శనివారం ఎన్టీఆర్ సర్కిల్‌లో స్థల పరిశీలన చేశారు. అక్కడే జగన్ బహిరంగ సభ నిర్వహించాలని నిర్ణయించి ఆదేశాలు జారీచేశారు. సభకు ఏర్పాటుచేస్తున్న రహదారిలో శనివారం మధ్యాహ్నం నుంచే వాహనాల రాకపోకలను నిషేధించాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీచేశారు. దీంతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. దానికితోడు మండువేసవిలో నడిరోడ్డుపై సభ ఏర్పాటు చేస్తే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడకతప్పదు.

● **వైసీపీ నేతల యాతనలు**

మరోపక్క సీఎం సభను విజయవంతం చేసుకునేందుకు వైసీపీ నేతలు నానా అవస్థలు పడుతున్నారు. ఇటీవల బస్సుయాత్రలో భాగంగా సీఎం జగన్ కందుకూరు మీదుగా వెళ్లినప్పటికీ పెద్దగా జనం లేక జగన్ పోస్టాఫీసు సెంటర్లో ఒకేఒక్క నిమిషంలో బస్సులోకి వెళ్లిపోయిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో జగన్ సభకు పెద్దఎత్తున జనసమీకరణ చేసేందుకు గ్రామాల్లోని నాయకులపై ఒత్తిడి పెంచారు. మద్యం ఇచ్చైనా జనాన్ని తరలించుకు రావాలని ఆ పార్టీ నేతలు ఆదేశాలు జారీ చేస్తున్నారు. మూడురోజుల క్రితమే నామినేషన్ కార్యక్రమానికి జనసమీకరణ చేశామని ఇంతలోనే మళ్లీ జనసమీకరణ అంటే కష్టమని నేతలు తలపట్టుకుంటున్నా అవేమీ మాకు పట్టవు మీకు ఏమి కావాలో, డబ్బు ఎంతకావాలో తీసుకెళ్లండి జనం మాత్రం భారీగా తరలిరావాలి జగన్ సభ విజయవంతం కావాలని వారిపై వత్తిడి పెంచుతున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో జగన్ సభకు ఏమేరకు ప్రజలు తరలివస్తారోనన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

ఆత్మకూరు ఉదయగిరి

దుర్గాన్ని సందర్శించిన వ్యయ పరిశీలకుడు




ఉదయగిరి రూరల్: చారిత్రాత్మక దుర్గాన్ని శనివారం ఎన్నికల వ్యయ పరిశీలకుడు రామ్‌కుమార్ గౌతమ్ అటవీశాఖ అధికారులతో కలిసి సందర్శించారు. చిన్న మసీదు, కొండపై ఉన్న రాజుల నాటి కట్టడాలు, కొండ ప్రాంతాల్లో జాలువారే నీటిని ఆస్వాదించారు. పట్టణంలోని రంగనాయకులస్వామి ఆలయాన్ని సందర్శించారు. రేంజ్‌అధికారి ఉమామహేశ్వరరెడ్డితో దుర్గం చరిత్ర అడిగి తెలుసుకున్నారు.

ఆనంతోనే ఆత్మకూరు అభివృద్ధి

- ప్రజాగళం సభలో టీడీపీ అధినేత చంద్రబాబు



మిద్దెలు ఎక్కి చంద్రబాబు ప్రసంగాన్ని వింటున్న ప్రజలు



సభలో చంద్రబాబు పక్కన అభివాదం చేస్తున్న అభ్యర్థులు వేమిరెడ్డి, ఆనం

ఆత్మకూరు ఏప్రిల్ 27: "అసెంబ్లీ అభ్యర్థి ఆనం రామనారాయణ రెడ్డికి అపార రాజకీయ అనుభవం ఉంది. ఇప్పటి కే ఆత్మకూరును అభివృద్ధి చేసి చూపిన ఘనత ఆయనదే. ఆత్మకూరు మరింత అభివృద్ధి చెందాలంటే ఆనంను, ప్రజా సేవే లక్ష్యంగా రాజకీయాల్లోకి వచ్చిన నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకరరెడ్డిలను గెలిపించాలి. నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించే బాధ్యత నేను తీసుకుంటా"నని టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు ఆత్మకూరు వాసులకు హామీ ఇచ్చారు. పట్టణ సమీపంలోని నెల్లూరుపాళెం జంక్షన్ వద్ద శనివారం నిర్వహించిన ప్రజాగళం సభలో చంద్రబాబు మాట్లాడారు. ఆత్మకూరు నియోజకవర్గంలో ప్రధాన సమస్యలను ఇప్పటికే ఆనం తన దృష్టికి తెచ్చి పరిష్కరించాలని కోరారన్నారు. ఇక్కడ ఎమ్మెల్యే, మంత్రి దోపిడీకి తెరతీశాడని విమర్శించారు. ఎమ్మెల్యేకు షాడోగా మరో వ్యక్తిని నియమించి ప్రజల సమస్యలను, అభివృద్ధిని గాలికొదిలేశారని విమర్శించారు. గ్రావెల్, ఇసుక మాఫియాకు తెరలేపారన్నారు. ఆత్మకూరును అభివృద్ధి చేసి చూపిన ఆనం కావాలా.. పదేళ్లపాటు అభివృద్ధే చేయని వైసీపీ అభ్యర్థి కావాలో ప్రజలు నిర్ణయించుకుని టీడీపీ అభ్యర్థులను గెలిపించాలని పిలుపునిచ్చారు.

- సభ విజయవంతం

ఆత్మకూరులో చంద్రబాబు సభను విజయవంతం చేయడంలో టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు సఫలీకృతులయ్యారు. నియోజకవర్గ నలుమూలల నుంచి వందలాది సంఖ్యలో ప్రజలు తరలిరావడంతో నెల్లూరుపాళెం జంక్షన్ కిక్కిరిసిపోయింది. చంద్రబాబు ప్రసంగిస్తున్నంతసేపు ప్రజలు కదలకుండా ఆసక్తిగా ఆలకించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు కొమ్మి లక్ష్మయ్యనాయుడు, మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, నాయకులు మేకపాటి శాంతమ్మ, తాళ్లూరు గిరినాయుడు, ఆనం కైవల్యారెడ్డి, ఆనం రంగమయూర్ రెడ్డి, పుట్టం బ్రహ్మానందరెడ్డి, కాటంరెడ్డి రవీంద్రారెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ జి వెంకటరమణమ్మ, బీజేపీ రాష్ట్ర నాయకులు కర్నాటి ఆంజనేయరెడ్డి, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ నలిశెట్టి శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

అధినేతకు ఎంపీపీ పరిచయం



చంద్రబాబుకు సునీతను పరిచయం చేస్తున్న ఆనం

అనంతసాగరం, ఏప్రిల్ 27: ఆత్మకూరులో జరిగిన ప్రజాగళంలో టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడుకు ఆత్మకూరు అభ్యర్థి ఆనం రామనారాయణరెడ్డి అనంతసాగరం మండలాధ్యక్షురాలు మునగపాటి సునీతను ప్రత్యేకంగా పరిచయం చేశారు. మహిళ అయినా విరామం లేకుండా ఈ తల్లి పార్టీ గెలుపు కోసం మండల నాయకులు, కార్యకర్తలకు భరోసా ఇస్తూ కష్టపడి పనిచేస్తున్నట్లు వివరించారు. దీంతో చంద్రబాబునాయుడు సునీతను ప్రత్యేకంగా అభినందించారు. మరింత ఉత్సాహంతో పనిచేయాలని సూచించారు.

వృద్ధుడి ఆత్మహత్య

సంగం, ఏప్రిల్ 27: పెరమనకు చెందిన చెంచురామయ్య (70) పురుగుమందు తాగి కోలుకోలేక శనివారం మృతి చెందాడు. శుక్రవారం రాత్రి మందు తాగిన విషయాన్ని గుర్తించిన కుటుంబసభ్యులు చికిత్సనిమిత్తం నెల్లూరు వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కన్నుమూశాడు. మృతుడికి భార్య, పిల్లలు ఉన్నారు. ఆ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

మహిళపై యాసిడ్ దాడి

చేజర్ల, ఏప్రిల్ 27: భార్యపై అనుమానంతో భర్త యాసిడ్‌తో దాడి చేసిన సంఘటన కండాపురంలో శనివారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. ఎస్ఐ ప్రభాకర్ వివరాల మేరకు.. పుట్టా మురార్జి సొంత అక్క కూతురు సుప్రజను పెళ్లి చేసుకుని నెల్లూరులో కాపురం ఉండేవాడు. కొన్నిరోజులుగా భార్యపై అనుమానంతో హింసిస్తుండేవాడు. భర్త పెట్టే బాధలు తట్టుకోలేక కొన్నిరోజులుగా పుట్టా సుప్రజ అమ్మవారి ఇంటి వద్ద కండాపురంలోనే ఉంటుంది. పుట్టా మురార్జి శుక్రవారం గ్రామానికి వచ్చి బాత్‌రూమ్‌లు కడిగే యాసిడ్‌తో దాడి చేసినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ప్రస్తుతం భర్త పరారీలో ఉన్నారు. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

టీడీపీ హయాంలోనే మత్స్యకారులకు లబ్ధి!

- వెంకటగిరి టీడీపీ అభ్యర్థి కురుగొండ్ల రామకృష్ణ



దాచూరులో కురుగొండ్లకు స్వాగతం పలుకుతున్న టీడీపీ నాయకులు

కలువాయి, ఏప్రిల్ 27: కండలేరు జలాశయంపై ఆధారపడి జీవించే మత్స్యకారులకు తెలుగుదేశం హయాంలో లబ్ధి చేకూరిందని వెంకటగిరి టీడీపీ అభ్యర్థి కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. శనివారం ఆయన దాచూరు, పెరం కొండలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తిరిగి మత్స్యకారులకు మంచి రోజులు రావాలంటే సైకిల్ గుర్తుపై ఓటు వేసి చంద్రబాబు నాయుడును సీఎంగా, తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని ప్రజలను కోరారు. వైసీపీ ప్రభుత్వంలో కొందరు స్థానిక నాయకులు బయట ప్రాంతాల నుంచి జాలర్లను పిలిపించి జలాశయంలో అక్రమంగా వేట సాగించి మత్స్య సంపదను దోచుకుని అర్హులైన మత్స్యకారులకు అన్యాయం చేశారని మండిపడ్డారు. తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో మత్స్యకారులకు పలు సంక్షేమ పథకాలు అందజేసినట్లు తెలిపారు. టీడీపీ అధికారంలోని రాగానే కండలేరు మత్స్యకారులకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఒక అవకాశం అంటూ జగన్‌రెడ్డి అధికారంలోకి వచ్చి రాష్ట్రం 20ఏళ్లు వెనుకబడి పోయేలా చేశారని ఆరోపించారు. కల్లబొల్లి మాటలు చెప్పి మళ్లీ అధికారంలోని రావడానికి వైసీపీ నాయకులు ప్రయత్నిస్తున్నారని వాటిని మీరు నమ్మవద్దన్నారు. టీడీపీ ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. నేడు పేదలకు అన్యాయం జరిగితే పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి చెప్పుకునే పరిస్థితి కూడా లేదని వాపోయారు. దాచూరులో కురుగొండ్లకు ప్రజలు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో దాచూరు సర్పంచ్ రాజుల అనురాధ, పీర్ల సోమయ్య యాదవ్, మేడికొండ వేణునాయుడు పాల్గొన్నారు.

ప్రజాగళానికి తరలిన నాయకులు ,అభిమానులు



అనంతసాగరం: సైకిల్ గుర్తుకు ఓటు వేయాలని కోరుతున్న నాయకులు



సంగం: చంద్రబాబు ప్రజాగళం సభకు తరలివెళ్తున్న అభిమానులు

సంగం: ఆత్మకూరులో శనివారం మధ్యాహ్నం జరిగే మాజీ సీఎం నారా చంద్రబాబునాయుడు ప్రజాగళం బహిరంగసభకు సంగం మండలం నుంచి భారీగా టీడీపీ అభిమానులు తరలివెళ్లారు. మండలంలోని ప్రతి గ్రామం నుంచి వందల మంది టీడీపీ అభిమానులు, కార్యకర్తలు, ఆటోల్లో స్వచ్ఛందంగా కదిలారు.

కమ్మవారిపల్లిలో టీడీపీ ప్రచారం

అనంతసాగరం: కమ్మవారిపల్లిలో శనివారం టీడీపీ శ్రేణులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. తెలుగుదేశం గెలుపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మండలాధ్యక్షురాలు మునగపాటి సునీత పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా పార్టీ అధికారంలోకి వస్తే అమలు చేసే గ్యారంటీలను వివరించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ లక్ష్మీరెడ్డి, జనసేన అధ్యక్షుడు ఉదయగిరి రవి పాల్గొన్నారు.

దున్నపోతుల వాగుపై వంతెనకేదీ మోక్షం



పుల్లాయపల్లి వద్ద దెబ్బతిన్న వంతెన

ఉదయగిరి రూరల్, ఏప్రిల్ 27: పుల్లాయపల్లి సమీపంలోని దున్నపోతుల వాగుపై కుర్రపల్లి-కృష్ణాపురం ప్రధాన రహదారిపై ఉన్న వంతెన 2020 అక్టోబర్‌లో కురిసిన భారీ వర్షాలకు కొట్టుకుపోయింది. నాటి నుంచి నూతన వంతెన నిర్మాణం చేపట్టకపోవడంతో వాహనదారులు ప్రయాణ కష్టాలు ఎదుర్కొంటున్నారు. తాత్కాలిక రోడ్డు ఏర్పాటు చేసినా రాత్రి సమయాల్లో ప్రమాదాలు జరుగుతున్నాయి. వంతెన నిర్మాణానికి ఆర్‌అండ్‌బీ అధికారులు ప్రతిపాదనలు ఉన్నతాధికారులకు పంపినా ప్రభుత్వం నిధులు మంజూరు చేయలేదు. ఈ వంతెన నిర్మాణం ఎప్పుడు జరుగుతుందోనని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దెబ్బతిన్న వంతెన స్థానంలో నూతన నిర్మాణం చేపట్టడంలో వైసీపీ పాలకులు విఫలం అయ్యారని మండిపడుతున్నారు.

బీసీల సంక్షేమమే ధ్యేయం

ఉదయగిరి రూరల్, ఏప్రిల్ 27: బీసీలను ఆర్థికంగా, రాజకీయంగా ఎదుగుదల చేసింది సీఎం జగన్‌రెడ్డి అని రాజ్యసభ సభ్యులు, జాతీయ బీసీ నాయకులు ఆర్.కృష్ణయ్య అన్నారు. శనివారం స్థానిక వైసీపీ కార్యాలయంలో నియోజకవర్గ వైసీపీ అభ్యర్థి మేకపాటి రాజగోపాల్‌రెడ్డితో కలిసి విలేకరులతో మాట్లాడారు. సార్వత్రిక ఎన్నికల్లో నెల్లూరు పార్లమెంట్, ఉదయగిరి అసెంబ్లీ వైసీపీ అభ్యర్థులు వేణుంబాక విజయసాయి రెడ్డి, మేకపాటి రాజగోపాలరెడ్డిలను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర వైసీపీ బీసీ సెల్ జనరల్ సెక్రటరీ బెజవాడ గణేష్, బీసీ సెల్ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు బేబిరాణి, జెడ్పీటీసీ మోడి రామాంజనేయులు పాల్గొన్నారు.

తెలుగుదేశంతోనే అన్నివర్గాల అభివృద్ధి

- ఉదయగిరి ఉమ్మడి అభ్యర్థి కాకర్ల సురేష్



దుత్తలూరు: పార్టీలో చేరిన వారితో కాకర్ల, కంభం

కొండాపురం, ఏప్రిల్ 27: తెలుగుదేశం పార్టీని గెలిపిస్తేనే అన్నివర్గాల అభివృద్ధి సాధ్యం అవుతుందని నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి కాకర్ల సురేష్ అన్నారు. శనివారం గరిమెనపెంట, ఇస్కదామెర్ల, తూర్పుఎర్రబల్లిలో జరిగిన ప్రచారంలో పాల్గొని మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వంలో అన్నివర్గాల ప్రజలు నష్టపోయారన్నారు. అనంతరం గరిమెనపెంట, కోవివారిపల్లె, చల్లావారిపల్లె, కేవీఆర్ కాలనీ, పొట్టిపల్లె, తూర్పుఎర్రబల్లిలో ఇంటింటికి వెళ్లి టీడీపీ సూపర్‌సిక్స్ కరపత్రాలను ప్రజలకు అందజేశారు. ఒక్క అవకాశమిస్తే ఉదయగిరిని మరింత అభివృద్ధి చేస్తానన్నారు. ఈ ఎన్నికల్లో ఉదయగిరి ఎమ్మెల్యేగా తనను, నెల్లూరు ఎంపీగా వేమిరెడ్డి ప్రభాకరరెడ్డిని గెలిపించాలని ఓటర్లను కోరారు. పొట్టిపల్లిలో టీడీపీ నాయకుడు ఏలూరి రాజేష్ గజమాలతో కాకర్లను సత్కరించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి, మాజీ జడ్పీచైర్మన్ చెంచలబాబు యాదవ్, కన్వీనర్ ఎమ్.ఓంకారం, గంటాలక్ష్మీ నరసింహులు, యారవ క్రిష్ణయ్య అల్లిక మధు, చెన్నుపాటి శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఉదయగిరి రూరల్: సార్వత్రిక ఎన్నికల్లో నెల్లూరు పార్లమెంట్, ఉదయగిరి అసెంబ్లీ ఉమ్మడి అభ్యర్థులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కాకర్ల సురేష్‌బాబుల సైకిల్ గుర్తుపై ఓట్లేసి అత్యధిక మెజార్టీ గెలిపించాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మన్నేటి వెంకటరెడ్డి, మండల టీడీపీ కన్వీనర్ బయ్యన్న తెలిపారు. శనివారం వారు గన్నేపల్లి, నేలటూరు, కొండాయపాళెం గ్రామాల్లో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులతో కలిసి ప్రచారం చేశారు. ఇంటింటికి తిరిగి మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేసి ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కాకర్ల రుక్మిణి, ఎన్ఆర్ఐ శైలజ, గడ్డం వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, వెంటకస్వామి, మాబాషా, శ్రీరాములు పాల్గొన్నారు.

సీతారామపురం: బసినేనిపల్లి, రొంపిదొడ్ల, రంగనాయుడుపల్లి, చిన్ననాగంపల్లి, బాలాయపల్లి, సీతారామపురం, సంగసానిపల్లి, పండ్రంగిలో బాబు ష్యూరిటీ- భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని టీడీపీ బూత్ ఇన్‌చార్జ్, జనసేన నాయకులు నిర్వహించారు. నియోజకవర్గ వడ్డెర సంఘం అధ్యక్షుడు తురక వెంకటేశ్వర్లు పార్టీ పథకాల గురించి, చిన్న సన్నకారు రైతులు, మహిళలు, విద్యార్థులకు కలిగే ప్రయోజనాలను వివరించారు. టీడీపీ యువత ఇంటింటికి వెళ్లి సూపర్ సిక్స్ పథకాల క్యాలెండర్లు, కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ కప్పు ప్రభాకర్ రాజు, చింతల శ్రీనివాసులు సీతారామపురం సర్పంచ్ కొడవటికంటి భాగ్యకుమారి, తోట మనోజ్, కలవెల జ్యోతి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

దుత్తలూరు (ఉదయగిరి రూరల్): దుత్తలూరులో శుక్రవారం రాత్రి నియోజకవర్గ ఉమ్మడి అసెంబ్లీ అభ్యర్థి కాకర్ల సురేష్ సమక్షంలో వైసీపీ నేత బొందల రఘురామిరెడ్డి ఆధ్వర్యంలో 50కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీ తీర్థం పుచ్చుకున్నాయి. వీరికి కాకర్ల పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో ప్రజలు విసిగివేసారి పోయారన్నారు. ఎప్పుడు ఎన్నికల వస్తాయా, ఆ పార్టీకి బుద్ధి చెబుదామా అని ఎదురుచూస్తున్నారని తెలిపారు. ఈ ఎన్నికల్లో తనతోపాటు నెల్లూరు పార్లమెంట్ ఉమ్మడి అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సైకిల్ గుర్తుపై ఓట్లేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్రానికి భవిష్యత్తు ఉంటుందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వరికుంటపాడు: కనియంపాడుకు చెందిన 30 వైసీపీ కుటుంబీకులు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. టీడీపీ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చంద్ర మధుసూదనరావు, పోలిబోయిన శ్రీకాంత్‌యాదవ్‌లు నాయకులు, కార్యకర్తలతో కలిసి గ్రామం నుంచి ప్రత్యేక వాహనాల్లో వింజమూరులోని పార్టీ ప్రధాన కార్యాలయానికి తరలి వెళ్లారు. అక్కడ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి కాకర్ల సురేష్ పార్టీ కండువాలు వేసి ప్రత్యేక అభినందనలు తెలిపారు. రెండేళ్లుగా నియోజకవర్గంలో కాకర్ల చేస్తున్న సేవా కార్యక్రమాలకు ఆకర్షితులై ఆయనకు అండగా నిలిచేందుకు పార్టీలో చేరినట్లు వారు తెలిపారు. అదే బాటలో నడుస్తున్న ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని గెలిపించేందుకు బాధ్యతగా కృషి చేస్తామన్నారు. పేదల పక్షపాతిగా నిలిచిన తెలుగుదేశంను అధికారంలోకి తీసుకొచ్చేందుకు పాటు పడతామని హామీ ఇచ్చారు. పీ.వెంకటేశ్వర్లు, పోలి బోయిన బ్రహ్మేశ్వరరావు, సందే పవన్‌కుమార్, గుండ్లపల్లి విజయకుమార్ పాల్గొన్నారు.



సీతారామపురం: పథకాల క్యాలెండర్లు, కరపత్రాలను పంపిణీ చేస్తున్న నాయకులు



కొండాపురం: ఓటర్లను ఆప్యాయంగా పలకరిస్తున్న కాకర్ల

వైసీపీ నాయకుల బరితెగింపు

- జగనన్న లేఅవుట్‌లో కొలతలు, హద్దురాళ్ల ఏర్పాటు
- అడ్డుకున్న అధికారులు



లేఅవుట్‌లోకి హద్దురాళ్లు తీసుకెళ్లిన ట్రాక్టర్

వెంకటాచలం, ఏప్రిల్ 27 : ఎన్నికల కోడ్ అమలులో ఉండగానే అధికార పార్టీ నాయకులు బరితెగించారు. ఇస్కపాళెం గ్రామంలో జగనన్న లేఅవుట్‌లో కొలతలు, హద్దు రాళ్ల ఏర్పాటుకు సిద్ధపడ్డారు. ఇది గమనించిన స్థానికులు నిలదీయగా ఆదివారం పట్టాలు ఇస్తారని చెప్పారు. ఈ విషయం తెలుసుకున్న టీడీపీ నాయకులు బాబుల్‌రెడ్డి, కొవూరు సురేష్ లతో పాటు మరికొందరు ఆ పనులను అడ్డుకొని టీడీపీ మండలాధ్యక్షుడు గుమ్మడి రాజాయాదవ్, అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. రాజా యాదవ్ తహసీల్దారు, అసిస్టెంట్ ఎన్నికల అధికారి పూర్ణచంద్రరావుకు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. పనులను ఆపించాలని ఇస్కపాళెం వీఆర్‌వో కిరణ్‌కు తహసీల్దారు ఫోన్ చేసి ఆదేశించారు. వీఆర్వో కిరణ్ గ్రామ తలారులతో ఆ పనులను ఆపి వేయించారు. ఈ వ్యవహారంపై విచారించనున్నట్లు తహసీల్దారు తెలిపారు. టీడీపీ మండలాధ్యక్షుడు రాజాయాదవ్ మాట్లాడుతూ వైసీపీ అభ్యర్థి కాకాణికి ఓటమి భయం పట్టుకొందని, ఎలాగైనా గెలవాలని ఇలాంటి దిగజారుడు రాజకీయాలు చేస్తున్నాడని మండిపడ్డారు. కోడ్ ఉల్లంఘించిన వైసీపీ నాయకులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సోమశిలలో 8.262 టీఎంసీల నిల్వ

అనంతసాగరం, ఏప్రిల్ 27: సోమశిల జలాశయం పూర్తిస్థాయి నీటి సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా శనివారానికి ప్రాజెక్టులో 8.262 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. దిగువ డెల్టాకు 200, ఉత్తర కాలువకు 5, దక్షిణ కాలువకు 25 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతి



అశోక్ లేలాండ్ మినీ ట్రక్కును ఢీకొన్న కంటైనర్ లారీ



మహ్మద్ ఇర్ఫాన్, వెంకటసాయిరాం మృతదేహాలు

కావలి రూరల్, ఏప్రిల్ 27: కావలి పట్టణ సమీపంలోని తుమ్మలపెంట ఫ్లైవోవర్ బ్రిడ్జిపై శనివారం ముందు వెళుతున్న మినీ ట్రక్కు వాహనాన్ని వెనుక నుంచి కంటైనర్ లారీ ఢీకొన్న ఘటనలో ఇద్దరు వ్యక్తులు మృతి చెందారు. రూరల్ పోలీసుల కథనం మేరకు.. చెన్నై నుంచి పాత ఏసీల లోడుతో అశోక్ లేలాండ్ కంపెనీకి చెందిన మినీ ట్రక్కు వాహనం పశ్చిమగోదావరి జిల్లా ఆకివీడుకు బయలుదేరింది. ఈ వాహనం మార్గమధ్యంలోని కావలి సమీపంలో తుమ్మలపెంట ఫ్లైవోవర్ బ్రిడ్జిపైకి వచ్చేసరికి తమిళనాడు నుంచి హైదరాబాదు వెళుతున్న కంటైనర్ లారీ వెనుక నుంచి వేగంగా ట్రక్కును ఢీకొంది. ఈ ప్రమాదంలో గుంటూరు జిల్లా పండరీపురంకు చెందిన అశోక్ లేలాండ్ మినీ ట్రక్కు డ్రైవర్ తోటకూర వెంకట సాయిరాం(34) అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన పశ్చిమగోదావరి జిల్లా ఆకివీడుకు చెందిన పాత ఏసీల వ్యాపారి మహ్మద్ ఇర్ఫాన్(30)ను చికిత్స నిమిత్తం 108 వాహనంలో కావలి ఏరియా వైద్యశాలకు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించి సీఐ కాటూరి శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భవనం పైనుంచి పడి కార్మికుడు..



గుర్తుతెలియని కార్మికుడి మృతదేహం

నెల్లూరు(క్రైం), ఏప్రిల్ 27: నెల్లూరులోని చంద్రమౌళి నగర్‌లో నూతనంగా నిర్మిస్తున్న ఓ భవనం పైనుంచి ప్రమాదవశాత్తు జారిపడి ఓ కార్మికుడు మృతి చెందాడు. పోలీసుల సమాచారం మేరకు.. నగరానికి చెందిన శ్రీనివాస్ బేల్దారి మేస్త్రీగా పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ప్రస్తుతం చంద్రమౌళినగర్ ఆరో వీధిలో నిర్మిస్తున్న భవనానికి పనిచేస్తున్నాడు. శనివారం ఉదయం కరెంటాఫీసు సెంటర్‌లో ఓ వ్యక్తిని సహచర కూలీగా తీసుకుని వెళ్లాడు. ఆ వ్యక్తి పనిచేస్తుండగా భవనం పైనుంచి కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. సహచరులు 108 అంబులెన్స్‌లో జీజీహెచ్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. సమాచారం అందుకున్న వేదాయపాళెం పోలీసులు వైద్యశాలకు చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతి చెందిన కార్మికుడి వివరాలు తెలిసిన వారు 9440796304 నెంబరుకు సమాచారం అందించాలని ఇన్‌స్పెక్టర్ పీవీ నారాయణ కోరారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

- 18 సవర్ల బంగారు నగలు, రూ.లక్ష నగదు అపహరణ



బీరువా పగులగొట్టిన దృశ్యం

పొదలకూరు, ఏప్రిల్ 27 : తాళం వేసి ఉన్న ఓ ఇంట్లో చోరీ జరిగిన సంఘటన పొదలకూరు పట్టణంలోని మారుతీనగర్‌లో శనివారం చోటుచేసుకుంది. పోలీసులు కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని మారుతీనగర్‌లో నివాసం ఉంటున్న తోకల సురేష్ అనే వ్యక్తి ఇంటికి తాళం వేసి కుటుంబీకులతో కలిసి ఈనెల 25న మనుబోలు మండలం వడ్లపూడి గ్రామంలో ఓ వివాహానికి వెళ్లారు. శనివారం ఉదయం వచ్చి చూడగా ఇంటి తాళం పగులగొట్టి తలుపులు తీసి ఉన్నాయి. ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువా తెరిచి ఉంది. బీరువాలో పెట్టిన 18 సవర్ల బంగారు నగలు, రూ.లక్ష నగదు కనిపించలేదు. దీంతో చోరీ జరిగిందని భావించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. రంగంలోకి దిగిన పోలీసులు చోరీ జరిగిన ప్రదేశానికి వెళ్లి పరిశీలించగా ఇంటి వరండాలో గడ్డపార పడి వుంది. గడ్డపార సహాయంతో దొంగలు ఇంటి తాళాలు పగలగొట్టినట్లు గ్రహించి క్లూసీ టీమ్‌కు సమాచారం అందించడంతో క్లూస్ టీం వేలిముద్రలు సేకరించారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రైలు ఢీకొని చుక్కల దుప్పి మృతి

బిట్రగుంట: బిట్రగుంట రైల్వే స్టేషన్ ఉతరం వైపు ఎగువ మార్గంలో శనివారం గుర్తు తెలియని రైలు ఢీకొని చుక్కల దుప్పి మృతి చెందిందని సెక్షన్ ఆఫీసర్ ఆర్.సుమన్ తెలిపారు. ప్రమాదం జరిగిన వెంటనే ఈ విషయమై వెటర్నరీ అధికారులకు సమాచారాన్ని ఇవ్వగా వెటర్నరీ వెద్యాధికారి రాజు, అసిస్టెంట్ ఋూస్సీ ఘటనా స్థలికి చేరుకుని చుక్కల దుప్పిని పరిశీలించి మృతి చెందినట్లు నిర్ధారించి శవపంచనామా చేశారన్నారు. దుప్పి మృతదేహాన్ని అటవీశాఖ సిబ్బంది సహాయంతో దహన సంస్కారాలు పూర్తి చేసినట్లు తెలిపారు.



చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	143
లేయర్ లైవ్	93
స్కిన్ చికెన్	254
స్కిన్‌లెస్	284
లేయర్	158

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ. 6878
వెండి కిలో ధర	రూ. 83,500
వెండి ఒక గ్రాము	రూ. 85.50

514 పొగాకు బేళ్లు కొనుగోలు

కలిగిరి, ఏప్రిల్ 27: స్థానిక పొగాకు వేలం కేంద్రానికి శనివారం రైతులు మొత్తం 616 పొగాకు బేళ్లు విక్రయానికి తీసుకొచ్చారు. వేలంలో 13 కంపెనీల ప్రతినిధులు పాల్గొని 514 బేళ్లు కొనుగోలు చేశారు. నోబిడ్-77, ఆర్ఆర్-13, సీఆర్-9, జంపింగ్‌లాట్స్-3 కారణాలతో 102బేళ్లు తిరస్కరణకు గురయ్యాయి. కిలో పొగాకు గరిష్ఠ ధర రూ.285, కనిష్ఠ ధర రూ.216, సగటు ధర రూ.242.29గా నమోదైనట్లు వేలం నిర్వహణాధికారి మహేష్‌కుమార్ తెలిపారు.

టీడీపీలో చేరిన వారికి సముచిత స్థానం

● ఎన్డీఏ కూటమి అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు ● పసుపు కండువాలు వేసుకున్న హ్యాపీబాషా, పలువురు ముస్లింలు



కందుకూరు : టీడీపీలో చేరిన హ్యాపీబాషా, ముస్లిం నేతలతో ఎమ్మెల్యే ఉమ్మడి అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు

కందుకూరు, ఏప్రిల్ 27: జగన్ పాలనలోని వైసీపీ ప్రభుత్వంపై విసుగుచెంది ఆ పార్టీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరుతున్న వారికి భవిష్యత్‌లో సముచిత స్థానం కల్పిస్తామని టీడీపీ, జనసేన, బీజేపీల ఉమ్మడి కందుకూరు అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు తెలిపారు. కందుకూరు పట్టణానికి చెందిన వైసీపీ నాయకుడు షేక్ హ్యాపీబాషా, ఆయన ఆధ్వర్యంలో పలు ముస్లిం కుటుంబాల వారు శనివారం తెలుగుదేశం పార్టీలో చేరారు. ఇంటూరి నాగేశ్వరరావు నివాసంలో జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీలో చేరిన వారికి ఆయన పసుపు కండువాలు వేసి ఆహ్వానించారు. షేక్ హ్యాపీబాషాతో పాటు ఆయన బంధుమిత్రులు నజీర్, హర్షద్, కరీముల్లా, శైలేష్, బాజీ, రహమత్, గౌస్, సమీర్ తదితరులు వార్డు నాయకులు సయ్యద్ సుల్తాన్ ఆధ్వర్యంలో పసుపు కండువాలు కప్పుకున్నారు.

● బృందావనంలో టీడీపీలోకి వలసలు

కందుకూరు పట్టణంలో వైసీపీకి కంచుకోటగా ఉన్న బృందావనంలోనూ తెలుగుదేశం పార్టీలోకి వలసలు కొనసాగుతున్నాయి. బృందావనంకు చెందిన పలువురు వైసీపీ నేతలు, కార్యకర్తలు ఆపార్టీని వీడి శనివారం టీడీపీ కూటమి అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. వైసీపీ జిల్లా ప్రచారకమిటీ కార్యదర్శి సుదర్శి శ్యాం, జంగాల వెంకటరావు, పాలేటి కరుణాకర్, సత్యనారాయణ, కట్టా వెంకటనారాయణ, గుమ్మడి సురేష్, అల్లాడి అజయ్ తదితరులు టీడీపీ కార్యాలయానికి రాగా వారందరికీ నాగేశ్వరరావు పసుపు కండువాలు వేసి టీడీపీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమాల్లో పార్టీ నాయకులు దామా మల్లేశ్వరరావు, షేక్‌ఫజల్, అశ్వక్, సలీం, సలాం, మున్నా, రూబీ, గౌస్, ఫిరోజ్, ఫాజల్, హర్షద్, చదలవాడ కొండయ్య, దాసరి ప్రమోద్, పాలేటి కోటేశ్వరరావు, గేరా నరేష్, జంగాల రాఘవ తదితరులు పాల్గొన్నారు.

● కరేడు వాసుల చేరిక

ఉలవపాడు : మండలంలోని కరేడు గ్రామానికి చెందిన మక్కే మోషే, కొల్లూరి మహేష్, పోలుబోయిన శ్రీనివాసులు, మరికొందరు శనివారం కందుకూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు సమక్షంలో టీడీపీలో చేరారు. వారికి ఆయన పసుపు కండువా కప్పి స్వాగతం పలికారు. రాష్ట్ర అభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యమని టీడీపీ గెలుపు ధ్యేయంగా కష్టపడతామని ఈ సందర్భంగా పార్టీలో చేరినవారు తెలిపారు. స్థానిక నాయకులు పోలుబోయిన శ్రీనివాసులు, కొల్లి వెంకటరమణ, రేగలగడ్డ శ్రీను, మద్దెల శ్రీధర్, మల్లవరపు వెంకట్రావు, మక్కే వెంకటేశ్వర్లు, ఎం సాయి, బీ మురళి తదితరులు పాల్గొన్నారు.



ఉలవపాడు : టీడీపీలో చేరిన కరేడువాసులతో ఇంటూరి నాగేశ్వరరావు

ఇంటూరి సౌజన్య ఇంటింటి ప్రచారం



సూపర్‌సిక్స్ పథకాల కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఇంటూరి సౌజన్య

కందుకూరు, ఏప్రిల్ 27: పట్టణంలోని కోవూరు రోడ్డు సాయిబాబా గుడి ప్రాంతంలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు సతీమణి ఇంటూరి సౌజన్య శనివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ, సూపర్‌సిక్స్ పథకాలపై అవగాహన కల్పిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఎంపీగా వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, ఎమ్మెల్యేగా ఇంటూరి నాగేశ్వరరావులను సైకిల్‌గుర్తుపై ఓటువేసి గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో 31వ వార్డు అధ్యక్షుడు అత్తంటి శివకృష్ణ, వరప్రసాద్, పీలా శ్రీనివాసులు, చుంచు వేణు, జమ్ము చైతన్య, నవిడిబోయిన వెంకటకృష్ణ, ముప్పవరపు వేణు, గుమ్మా శివ, మచ్చా మనోహర్, చల్లా మహేంద్ర, ముచ్చు లక్ష్మీరాజ్యం, కల్లూరి శైలజ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీకి మద్దతుగా బ్రాహ్మణ సమితి ప్రచారం

రానున్న సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థులకు మద్ద తు ఇవ్వాలని కోరుతూ బ్రాహ్మణ బంధువుల ఆధ్వర్యంలో శనివారం రాత్రి కందుకూరు పట్టణంలో ప్రచారం నిర్వహించారు. గతంలో తెలుగుదేశం పార్టీకి పనిచేసిన వారితో పాటు నూతనంగా అనేకమంది ముందుకొచ్చి టీడీపీ అభ్యర్థులకు మద్దతుగా ప్రచార కార్యక్రమంలో పాల్గొనటం విశేషం. పట్టణంలోని 26, 27 వార్డులు, జనార్ధనకాలనీ, బాల నాగేంద్రస్వామి గుడి ప్రాంతాలలో రిటైర్డ్ ఉద్యోగులు, ఉద్యోగులను కలిసి టీడీపీకి మద్దతివ్వాలని ప్రచారం నిర్వహించారు. జగన్మోహనరెడ్డి పాలనలో రిటైర్డ్ ఉద్యోగులకు, పెన్షనర్లకు తీవ్ర అన్యాయం జరిగిందని కనీసం దాచుకున్న సొమ్మును కూడా పొందలేని పరిస్థితి ఏర్పడినందున వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దించటమే లక్ష్యంగా ప్రతిఒక్కరూ టీడీపీకి మద్దతివ్వాలని కోరారు. ఎంపీగా వేమిరెడ్డి ప్రభాకరరెడ్డిని, ఎమ్మెల్యేగా ఇంటూరి నాగేశ్వరరావును గెలిపించాలన్నారు. కార్యక్రమంలో మంచిరాజు మురళీమోహన్, పెట్లూరి సుబ్బారావు, ఆర్. వెంకటేశ్వర్లు(ఆర్‌వీ), నారాయణం రాధాకృష్ణ, గుంటూరు పద్మనాభశర్మ, శ్రీరామచంద్రమూర్తి, రామచంద్రుని మోహనరావు, పొన్నగంటి వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.



కందుకూరులో టీడీపీ కూటమికి మద్దతుగా ప్రచారంలో పాల్గొన్న బ్రాహ్మణ రిటైర్డ్ ఉద్యోగులు

జనసేనలో చేరిన దారం సోదరులు



నాగబాబు సమక్షంలో జనసేనలో చేరిన దారం మాల్యాద్రి, కృష్ణ

కందుకూరు, ఏప్రిల్ 27: కందుకూరు పట్టణంలోని పడమర బలిజపాలెంకు చెందిన దారం మాల్యాద్రి, దారం కృష్ణలు తమ అనుచరులతో కలిసి జనసేన పార్టీలో చేరారు. వారు శనివారం పిఠాపురం వెళ్లి జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ సోదరుడు నాగబాబు సమక్షంలో జనసేన పార్టీలో చేరారు. కందుకూరు సిటింగ్ ఎమ్మెల్యే మానుగుంట మహీధరరెడ్డికి పట్టణంలో ముఖ్య అనుచరులుగా ఉన్న వీరు స్థానిక పరిస్థితుల దృష్ట్యా జనసేన, టీడీపీ కూటమికి మద్దతివ్వాలన్న నిర్ణయంతో జనసేనలో చేరగా ఇప్పటికే పడమర బలిజపాలెంలోని అధికశాతం మంది ఇంటూరి నాగేశ్వరరావు సమక్షంలో టీడీపీ కూటమిలో చేరగా ప్రస్తుతం దారం సోదరులు జనసేనలో చేరడం విశేషం.

వడదెబ్బ తగలకుండా అవగాహన కల్పించాలి

● డిప్యూటీ డీఎంహెచ్‌వో ప్రియంవద



రికార్డులు పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో

ఉలవపాడు, ఏప్రిల్ 27 : రోజురోజుకు ఎండ తీవ్రత ఎక్కువవుతున్నందున ప్రజలకు ముఖ్యంగా చిన్న పిల్లలకు, వృద్ధులను వడదెబ్బ నుంచి కాపాడుకోడానికి అవగాహన కల్పించాలని కందుకూరు డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం ప్రియంవద వైద్య సిబ్బందికి సూచించారు. శనివారం ఉదయం కరేడులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమె సందర్శించారు. వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటలలోపు ముగించాలని ఆదేశించారు. వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలతోపాటు ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేయాలని సూచించారు. వైద్యశాలకు సంబంధించిన రికార్డులను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారిని రమ్యజ్యోతి, ఆసుపత్రి సిబ్బంది ఉన్నారు.

మద్యం అక్రమ రవాణా, నాటు సారాపై నిఘా పెంచాలి



మాట్లాడుతున్న సెబ్ ప్రత్యేకాధికారి దయాసాగర్

కావలి, ఏప్రిల్ 27: మే 13న జరుగనున్న సార్వత్రిక ఎన్నికల సందర్భంగా మద్యం అక్రమ రవాణా, నాటు సారాపై నిఘా పెంచాలని జిల్లా సెబ్ స్పెషలాఫీసర్ దయాసాగర్ చెప్పారు. కావలి శాంతినగర్‌లో ఉన్న సెబ్ కార్యాలయాన్ని శనివారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించి పలు కేసుల వివరాలను సేకరించారు. అనంతరం ఎన్నికల సందర్భంగా నేరాలు అరికట్టేందుకు సెబ్ అధికారులు తీసుకోవాల్సిన చర్యలు గురించి వివరించారు. ఎన్నికలకు ప్రబావితం చేసే మద్యం ఎక్కడా అనధికారికంగా సరఫరా కాకుండా అలాగే నాటు సారా తయారీ, సరఫరాలపై గట్టి నిఘా ఉంచాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కావలి సెబ్ ఇన్‌స్పెక్టర్ టీ. లక్ష్మణస్వామి, ఎస్ఐ రాజశ్రీ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పోలేరమ్మ గుడిలో టీడీపీ నేతల పూజలు

కావలి, ఏప్రిల్ 27: టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దగుమాటి వెంకట(కావ్య) క్రిష్ణారెడ్డి, నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిలు విజయం సాధించాలని కోరుతూ శనివారం టీడీపీ నేతలు పాతూరులోని కాలేరమ్మగుడి వద్ద ఉన్న పోలేరమ్మ గుడిలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ బాధ్యులు టీడీపీ నేత జనిగర్ల మనోహర్‌ను సత్కరించారు. కాలేరమ్మగుంట గిరిజనులకు వైసీపీ పాలనలో ఎలాంటి మౌలిక వసతులు కల్పించలేదని టీడీపీ అధికారంలోకి రాగానే క్రిష్ణారెడ్డి ద్వారా ఈ ప్రాంత అభివృద్ధితో పాటు గిరిజనుల సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు రామిరెడ్డి క్రిష్ణారెడ్డి, జంపాని ప్రసాద్, వాకా శ్రీనివాసులురెడ్డి, దాసరి రవి, మధుసూదనరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జలదంకి సొసైటీ మాజీ అధ్యక్షుడు కన్నుమూత

● కావ్య, వంటేరు, తదితరుల నివాళి

జలదంకి, ఏప్రిల్ 27: కావలి అసెంబ్లీ టీడీపీ అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డి బావ, జలదంకి సొసైటీ మాజీ అధ్యక్షుడు ముంగమూరి వెంకటేశ్వరరెడ్డి(70) అనారోగ్యంతో చెన్నైలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందారు. ఈయన మృతదేహాన్ని కుటుంబసభ్యులు కావలి పట్టణంలోని రామ్మూర్తిపేటలోని వారి నివాసానికి తీసుకువచ్చారు. శనివారం టీడీపీ కావలి అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డి, కావలి మాజీ ఎమ్మెల్యే వంటేరు వేణుగోపాల్‌రెడ్డి, ఉదయగిరి టీడీపీ అభ్యర్థి కాకర్ల సురేష్ సోదరుడు సునీల్, కావలి మాజీ ఏఎంసీ చైర్మన్ మలిశెట్టి వెంకటేశ్వర్లు, మాజీ మున్సిపల్ చైర్మన్ పోతుగంటి అలేఖ్య, కావలి పట్టణం, జలదంకి మండలంలోని పలు రాజకీయపార్టీల నాయకులు, ప్రముఖులు ఆయన మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం పట్టణంలోని హిందూ శ్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహించారు.

ఎమ్మెల్యే రామిరెడ్డి, పసుపులేటిల..

నేర చరిత్ర తెలుసుకోవాలి

● టీడీపీ కావలి అభ్యర్థి కావ్య కృష్ణారెడ్డి



కావలి : ఎమ్మెల్యేపై కేసులతో కూడిన అఫిడవిట్ పత్రాన్ని ప్రదర్శిస్తున్న కావ్య కృష్ణారెడ్డి



బిట్రగుంట : దగదర్తిలో ప్రజలకు అభివాదం చేస్తున్న దగుమాటి

కావలిటౌన్, ఏప్రిల్ 27: ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్ రెడ్డి, ఇండిపెండెంట్ అభ్యర్థి పసుపులేటి సుధాకర్‌ల నేరచరిత్ర ప్రజలు తెలుసుకోవాలని టీడీపీ, జనసేన, బీజేపీల ఉమ్మడి అభ్యర్థి కావ్య కృష్ణారెడ్డి పేర్కొన్నారు. శనివారం తన నివాసం వద్ద కార్యాలయంలో జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నామినేషన్ సందర్భంగా ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్ రెడ్డి తనపై 7 క్రిమినల్ కేసులు, పసుపులేటి సుధాకర్ తనపై 8 క్రిమినల్ కేసులున్నట్లు స్వయంగా వారే తమ అఫిడవిట్‌లలో పొందుపరిచారన్నారు. అఫిడవిట్ నకళ్ల ప్రతులను ప్రదర్శిస్తున్నానని, వారిద్దరూ తోడు దొంగలన్నారు. పథకం ప్రకారం తనపై కేసులున్నట్లు తాను రౌడీనని దుష్ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. తనపై రాష్ట్రంలో ఎటువంటి కేసులు లేనట్లు అన్ని జిల్లాల ఎస్పీలు డీజీపీ క్లీన్ చిట్ ఇచ్చారన్నారు. దొంగలిద్దరూ తనను దొంగ అనడం విడ్డూరమని, 2014 ఎన్నికల్లో ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్ రెడ్డి చీప్ లిక్కర్ పంపిణీ చేసి ఏడుగురి ప్రాణాలు బలిగొన్నారన్నారు. ఇటీవల దేవాలయం లాంటి సచివాలయంలో ఎమ్మెల్యే తన కార్యకర్తలచే చీప్ లిక్కర్ డంప్ చేయించి దొరికిపోయి బుకాయించడం దారుణమన్నారు. సుధాకర్‌పై హైదరాబాద్‌లో కబ్జాలు, దౌర్జన్యాలు తదితర కేసులున్నాయని గత ఎన్నికల్లో జనసేన తరుపున పోటీ చేసి అడ్రస్ లేకుండా పోయారని, తిరిగి ఇండిపెండెంట్‌గా ప్రత్యక్షమయ్యారన్నారు. టీడీపీని ఓడించేందుకు పసుపులేటికి విజయసాయిరెడ్డి, ఎమ్మెల్యే నుంచి దొడ్డిదారిన డబ్బులందుతున్నాయని ఆరోపించారు. ప్రజలు విజ్ఞతతో ఆలోచించాలని, మంచి చెడులు బేరీజు వేసుకోవాలని, తిరిగి వైసీపీని గెలిపిస్తే దోపిడీ దురాగతాలు పెట్రేగిపోతాయన్నారు. సమావేశంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మలిశెట్టి వెంకటేశ్వర్లు, బీజేపీ రాష్ట్ర నాయకులు కందుకూరి సత్యనారాయణ, టీడీపీ నేతలు మన్నవ రవిచంద్ర, గుత్తికొండ కిషోర్, రామకృష్ణ, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి కోసం టీడీపీని గెలిపించండి.

దగదర్తి(బిట్రగుంట) : అప్పుల్లో కూరుకుపోయిన ఆంధ్రరాష్ట్రాని అభివృద్ధి పథంలో నడిపేది నారా చంద్రబాబునాయుడు మాత్రమేనని, టీడీపీని గెలిపించి స్వర్ణాంధ్రప్రదేశంగా తీర్చిదిద్దుకుందామని టీడీపీ అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డి, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాలేపాటి సుబ్బానాయుడు అన్నారు. దగదర్తి ప్రధాన కూడల్లో శనివారం రాత్రి వారు ఎన్నికల ప్రచారం నిర్వహించారు.. గ్రామానికి విచ్చేసిన కావలి వారితోపాటు సీనియర్ నేత రవీంద్రనాయుడు, బీజేపీ నేత కందుకూరి సత్యనారాయణను స్థానిక నేతలు పూలమాలలు శాలువలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ప్రజలను భయభ్రాంతులను చేస్తున్న వైసీపీ పాలన అంతమొందించటానికి టీడీపీని గెలిపించాలని కోరారు. వైసీపీ పాలనలో జరిగినన్ని మారణ కాండలు ఏ ప్రభుత్వంలో జరగలేదన్నారు. బెదిరించి భయపెట్టి డబ్బుల ఆశ చూపి పాలిస్తున్న వైసీపీ ప్రభుత్వానికి ప్రజలు సరైన బుద్ధి చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు, కార్యకర్తలు, నందమూరి అభిమానులు పాల్గొన్నారు.



బిట్రగుంట : ఏకే కండ్రిగలో ప్రచారం చేస్తున్న వేణుగోపాల్‌రెడ్డి

చంద్రబాబుతోనే గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి

బిట్రగుంట : గ్రామీణ ప్రాంతాల ప్రజలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలంటే చంద్రబాబు నాయుడుతోనే సాధ్యమని టీడీపీ అభ్యర్థి దగుమాటి క్రిష్ణారెడ్డి సోదరుడు వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. బోగోలు మండలం ఇబ్రహీంపేట, అక్కరాజువారి కండ్రికల్లో టీడీపీ మండల కన్వీనర్ మాలేపాటి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బాబు ప్రవేశ పెట్టిన సూపర్‌సిక్స్ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఉమ్మడి పార్టీల టీడీపీ అభ్యర్థులు నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కావలి అసెంబ్లీ దగుమాటి క్రిష్ణారెడ్డిని గెలిపించి ఆంధ్రరాష్ట్రంలో టీడీపీ పాలన తీసుకొచ్చేందుకు అందరం కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు కోడూరు వెంకటేశ్వర్లురెడ్డి, బోగిరి ప్రభాకర్, లేళ్లపల్లి సుధీర్‌బాబు, బీజేపీ నేత గుర్రం వెంకటేశ్వర్లు, ఎంఆర్పీఎస్ నేత ఏసుపోగు జయరాజు తదితరులు ఉన్నారు.

టీడీపీ పాలనలోనే పల్లెల అభివృద్ధి



అల్లూరు : ప్రచారం నిర్వహిస్తున్న బినీత్‌రెడ్డి, చందన్‌రెడ్డి

అల్లూరు : టీడీపీ పాలనలోనే పల్లెల అభివృద్ధి సాధ్యమని, దీనికి నిదర్శనం గత తెలుగుదేశం పాలనలో జరిగిన అభివృద్ధి తప్ప గడిచిన ఐదేళ్ల వైసీపీ పాలనలో కనపడకపోవడమేనని కావలి అభ్యర్థి కావ్య కృష్ణారెడ్డి అల్లుడు వాకాటి బినీత్‌రెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం మండలంలోని బీరంగుంటలో వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మేనల్లుడు చందన్‌రెడ్డితో కలిసి ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్లె ప్రాంతాల్లో టీడీపీకి స్పందన బాగుందని, అభివృద్ధికి నోచుకోని గ్రామాల్లో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. టీడీపీ కావలి ఎమ్మెల్యే అభ్యర్థి కావ్య కృష్ణారెడ్డి, ఎంపీ అభ్యర్థిగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిలను గెలిపించి అభివృద్ధికి తోడ్పాటును అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో రేబాల శంకర్‌రెడ్డి, శ్రీనివాసులు, జొన్నలగడ్డ రఘురామయ్య, తిరుమలశెట్టి నరేంద్ర, అంకిశెట్టి రాజేష్, కప్పిరి విష్ణు, ఏలూరు సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పార్టీ ఏదైనా ప్రచారానికి ఓకే!

వలేటివారిపాలెం, ఏప్రిల్ 27 : ఎన్నికల నోటిఫికేషన్ వచ్చినప్పటి నుంచి మందుబాబులకు ప్రతి రోజూ పండగే. మద్యం అందిస్తే చాలు పార్టీతో పని లేకుండా ఏ పార్టీకైనా ప్రచారం చేసేస్తున్నారు. రోజుకో పార్టీకి ప్రచారం చేస్తున్నారు. మరికొంత మంది మందుబాబులు ఉదయం ఓ పార్టీతో సాయంత్రం మరో పార్టీతో కలిసిపోతున్నారు. ఉచిత మద్యం పుష్కలంగా దొరుకుతుండడంతో మందుబాబులకు కిక్కు దిగడంలేదు. ప్రధాన పార్టీ కార్యాలయాల వద్ద వీరి సందడి అధికంగా ఉంది.

● కూల్‌గా ప్రచారం

ఎన్నికల పోలింగ్ కౌంట్‌డౌన్ మొదలైంది. గెలుపుకోసం బరిలో నిలిచిన అభ్యర్థులు పోటాపోటీగా ప్రచారం చేస్తున్నారు. వారం రోజుల నుంచి ఉష్ణోగ్రతలు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. భానుడు ప్రతాపానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు అల్లాడిపోతున్నారు. ఈ నేపథ్యంలో అభ్యర్థులు ప్రచారం స్టైల్ మార్చారు. మునుపటిలా ఉదయం 9 గంటల నుంచి కాకుండా 7 గంటలకే ఇంటింటి ప్రచారం మొదలు పెట్టి 11 గంటలకే ముగిస్తున్నారు. తిరిగి సాయంత్రం 4 నుంచి రాత్రి 9 గంటల వరకు ప్రచారం కొనసాగిస్తున్నారు. బహిరంగ సభలు కూడా సాయంత్రం సమయాల్లోనే పెట్టుకొంటున్నారు. ఇక ప్రచారంలో ఖాళీ సమయం దొరికిందంటే పార్టీ కార్యాలయాల్లో సమావేశాలు పెట్టి భవిష్యత్ వ్యూహాలపై చర్చించుకుంటున్నారు. అదే సమయంలో పార్టీల్లో స్తబ్దుగా ఉంటున్న వారిని కలిసి వారిని తమ వైపు తిప్పుకునే ప్రయత్నాలు చేస్తున్నారు.

మాలకొండ ఆదాయం రూ.10,58,418

వలేటివారిపాలెం, ఏప్రిల్ 27 : మండలంలోని మాలకొండ లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి శనివారం భక్తుల నుంచి రూ.10,58,418 ఆదాయ లభించినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ కేబీ శ్రీనివాసరావు తెలిపారు. అష్టోత్తరం టికెట్ల విక్రయంతో రూ.10,300, కుంకుమార్చనకు రూ.24,960, వివాహములకు రూ.10 వేలు, తలనీలాల సమర్పణకు రూ.65,175, వాహనపూజలకు రూ.3,700, ప్రత్యేక దర్శనానికి రూ. 3,81,800, స్థలపురాణం పుస్తకాలు విక్రయం ద్వారా రూ.540, రూము అద్దెలు రూ.36,830, కవర్లు విక్రయం రూ.6,600, లడ్డూ ప్రసాదం ద్వారా రూ. 2,11,540, అన్నదానం ద్వారా రూ. 2,66,973, విరాళముల ద్వారా రూ. 40 వేలు ఆదాయం లభించినట్లు ఆలయ తెలిపారు.

నేడు కాకర్ల ఎన్నికల ప్రచారం

జలదంకి, ఏప్రిల్ 27: మండలంలోని జమ్మలపాలెం, ఎల్ఆర్ అగ్రహారం, రామవరప్పాడు, చోడవరం గ్రామాలలో ఆదివారం ఉదయగిరి టీడీపీ అభ్యర్థి కాకర్ల సురేష్ ఎన్నికల ప్రచారం చేయనున్నట్లు టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి నాయకులు ఒక ప్రకటనలో పేర్కొంది. ఈ ప్రచారంలో ఉదయగిరి ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, కావలి మాజీ ఎమ్మెల్యే వంటేరు వేణుగోపాల్‌రెడ్డి, జడ్పీ మాజీ చైర్మన్ చెంచలబాబుయాదవ్ పాల్గొంటారని తెలిపారు.

కాంగ్రెస్‌కే మద్దతు : వామపక్షాలు

కావలిటౌన్, ఏప్రిల్ 27: కాంగ్రెస్ అభ్యర్థులకే తమ మద్దతు అని వామపక్షాల నేతలు సీపీఎం జిల్లా నాయకులు పసుపులేటి పెంచలయ్య, సీపీఎం నియోజకర్గ ఇన్‌చార్జ్ నాగరాజు, సీపీఎంఎల్ న్యూడెక్రసీ రాష్ట్ర నాయకులు కరవది భాస్కర్, దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్ మల్లి, తదితరులు తెలిపారు. శనివారం కావలి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి పొదలకూరు కల్యాణ్ ఎన్నికల కార్యాలయంలో వామపక్ష పార్టీలతో కలిసి కల్యాణ్ విలేకర్లతో మాట్లాడారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతనిధి లేళ్లపల్లి సురేష్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

మందాటి చెరువును కాపాడుకుందాం

● చెరువు పరిరక్షణ కమిటీ నిరసన



మందాటి చెరువు వద్ద నిరసన తెలుపుతున్న చెరువు పరిరక్షణ కమిటీ సభ్యులు

కావలిటౌన్, ఏప్రిల్ 27: ముసునూరు మందాటి చెరువును ఆక్రమణదారుల నుంచి కాపాడుకుందామనే నినాదంతో శనివారం మందాటి చెరువు పరిరక్షణ కమిటి నిరసన ప్రదర్శన నిర్వహించారు. కమిటీ కన్వినర్ కనుమూరు భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ ముసునూరులో మందాటి చెరువు దాదాపు 130 ఎకరాలకు పైగా ఉండేదని 50 ఎకరాలు ఆక్రమణకు గురైందన్నారు. చెరువును పరిరక్షించాల్సిన పాలకులు అధికారులే ఆక్రమణలను దొడ్డి దారిన ప్రోత్సహించడం దుర్మార్గమన్నారు. అక్రమార్కులు చెరువు స్థలాన్ని ఆక్రమించి నివాసాలు షోరూమ్‌లు నిర్మిస్తున్నారని క్రయవిక్రయాలు జరుగుతున్నాయని కోట్ల రూపాయలు చేతులు మారుతున్నాయని ఆరోపించారు. చెరువును పరిరక్షించాల్సిన అధికారులు చోద్యం చూడడం దారుణమని రెవెన్యూ అధికారులు రికార్డులకెక్కించకుండా అనధికారికంగా పొజిషన్ సర్టిఫికేట్లు ఇస్తున్నారని వాటి ఆధారంగా అక్రమార్కులు రెచ్చిపోతున్నారని ఎన్నికల సమయంలో మరింత రెచ్చిపోయి బహిరంగంగా నిర్మాణాలు చేపడుతున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు మేల్కొని ఆక్రమణలు అడ్డుకోవాలని చెరువును పరిరక్షించాలని లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కమిటి సభ్యులు మందా కిరణ్, ఇంటూరు రమణయ్య, దుగ్గిరాల జార్జ్, రవినాయుడు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నేతల ఇంటింటా ప్రచారం

లింగసముద్రం, ఏప్రిల్ 27 : లింగసముద్రం ఎస్టీ కాలనీలో టీడీపీ మండల అధ్యక్షుడు వేముల గోపాలరావు, గ్రామ పార్టీ అధ్యక్షుడు గాలంకి ప్రసాద్, తెలుగు యువత మండల అధ్యక్షుడు అడపా రంగయ్య, ఇతర టీడీపీ నాయకులతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. చంద్రబాబు సూపర్ సిక్స్ పథకాల గురించి వివరించారు. రాబోయే ఎన్నికల్లో నెల్లూరు ఉమ్మడి ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కందుకూరు అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావులను బారీ మెజారిటీతో గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో కండే మాలకొండయ్య, అడపా నర్సయ్య, ఏ చినకొండయ్య, మాజీ ఎంపీపీ పీ బాలకోటయ్య, సీహెచ్ బాలకోటయ్య, బింకం శేషయ్య, ఈ శ్రీనివాసులు, చెంబేటి రమేష్, రాధాకృష్ణయ్య, కొట్టే శేషాద్రి, ఉన్నం వీరాస్వామి, బొచ్చు మాల్యాద్రి, ఎ పెదసత్యం తదితరులు పాల్గొన్నారు. అలాగే మండలంలోని పెదపవని గ్రామంలో శనివారం రాత్రి గ్రామ పార్టీ అధ్యక్షుడు గొర్రెపాటి సాంబయ్య ఇంటింటి ఎన్నికల ప్రచారం నిర్వహించి కరపత్రాలను పంపిణీ చేశారు. రాబోయే ఎన్నికల్లో నెల్లూరు ఎంపీ, కందుకూరు ఎమ్మెల్యే ఉమ్మడి అభ్యర్థులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఇంటూరి నాగేశ్వరరావులను గెలిపించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ధనుం మధు, పఠాన్ హిదాయతుల్లా తదితరులు పాల్గొన్నారు.



సూపర్ సిక్స్ పథకాలు వివరిస్తున్న గోపాలరావు

జన కేతనం



ఇంతవరకు అతీగతీ లేదు...

రైతునెత్తిన రాళ్లపాడు

- రాళ్లపాడు కాలువ పొడిగింపు పనులు
- కందుకూరు ఉత్తర బైపాస్ నిర్మాణం
- రెండింటి పూర్తికి మాటిచ్చి 22 నెలలు



రాళ్లపాడు ఎడమ కాలువ (ఫైల్)

కందుకూరు, ఏప్రిల్ 27: సాక్షాత్తూ రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డే బహిరంగ సభలో ఇచ్చిన హామీలకు అతీగతీ లేదు. కందుకూరు నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు ఆరునెలల్లోగా నిధులు మంజూరు చేసి, టెండర్లు పిలుస్తామని ఆయన ప్రకటించారు. అయినా ఇంత వరకు అడుగు ముందుకు పడలేదు. కందుకూరు నియోజకవర్గ అభివృద్ధిలో ఎంతో కీలకంగా భావించే రాళ్లపాడు ఎడమ కాలువ పొడిగింపు పనులు, కందుకూరులో ఉత్తర బైపాస్ రోడ్డు నిర్మాణ పనులకు ఆరునెలల్లోగా నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటానని, 2022జూన్‌లో రామాయపట్నం పోర్టు భూమిపూజ సందర్భంగా జరిగిన సభలో జగన్ ప్రకటించారు. అదే సభలో ఎమ్మెల్యే మహీధరరెడ్డి నియోజకవర్గ అభివృద్ధి కోసం రాళ్లపాడు ఎడమ కాలువ పొడిగింపు పనులకు, కందుకూరుకు ఉత్తర బైపాస్ నిర్మాణానికి, కందుకూరు మున్సిపాలిటీ పరిధిలో అభివృద్ధి పనుల కోసం, కరేడు పీహెచ్‌సీ భవనాల నిర్మాణాలను నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. వీటిలో రాళ్లపాడు ఎడమ కాలువ పొడిగింపు, ఉత్తర బైపాస్‌లకు 2009లోనే మంజూరు ఉత్తర్వులు వచ్చాయని, సర్వే కూడా పూర్తి అయిందని, నిధుల కొరతతో భూసేకరణ జరగలేదని వివరించారు. తక్షణం ఆ పనులు ప్రారంభమ్యేలా అవసరమైన సుమారు రూ. 90 కోట్లు మంజూరు చేస్తానని జగన్ హామీ ఇచ్చారు. అలాగే కందుకూరు మున్సిపాలిటీ అభివృద్ధి కోసం ఎమ్మెల్యే మహీధరరెడ్డి కోరిన రూ.26కోట్లు నిధులు విడుదల చేయటం జరుగుతుందని, కరేడు పీహెచ్‌సీకి భవనాల నిర్మాణానికి నిధులిస్తానని హామీ ఇచ్చారు. అయితే మున్సిపాలిటీలో అభివృద్ధికి నిధులు మంజూరు చేయటం మినహా ఏ ఒక్క హామీ అమలు కాలేదు.

మూడు వేల ఎకరాలకు నీరు

రాళ్లపాడు ఎడమ కాలువ పొడిగింపు పనుల పూర్తయితే రెండువేల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ జరుగుతుంది. అంతేకా మరో మూడువేల ఎకరాల అదనపు ఆయకట్టుకు సాగునీరందుతుంది. ఈ కాలువ పొడిగింపు ద్వారా వీఆర్ కోట, శాఖవరం, నలదలపూరు, కళవళ్ల చెరువుల పరిధి లో ఉన్న ఆయకట్టును స్థిరీకరించటంతో పాటు మరికొన్ని గ్రామాలకు సాగునీరందుతుంది. ఈ కాలువ పొడిగింపు ద్వారా పోకూరు, నేకునాంపురం చెరువుల ఆయకట్టును స్థిరీకరించాలన్న ప్రతిపాదన కూడా ఉంది. రాళ్లపాడు ఎడమ కాలువ పొడి గింపు పనులకు గతంలోనే మం జూరు ఉత్తర్వులు ఉండటంతో పాటు కాలువ డిజైన్‌కు సంబం ధించిన సర్వే, భూసేకరణ కోసం సామాజిక, ఆర్థిక సర్వే కూడా పూర్తయిం ది. ఎంతో ఉపయోగకరమైన ఈ కాలువ పనులకు నిధుల విడుదలకు ఇచ్చిన హామీ కార్యరూపం దాల్చలేదు.

బైపాస్ ఎంతో అవసరం



మోసం గురూ!

కందుకూరులో ట్రాఫిక్ సమస్య నియంత్రణకు ఉత్తర బైపాస్ నిర్మాణం ఎంతో అవసరం. పట్టణంలో రెండు దశాబ్దాలుగా ట్రాఫిక్ సమస్య పెరిగిపోయింది. పట్టణానికి ఉత్తరం వైపున పలు పరిశ్రమలు రావడంతో నిత్యం లారీలు, ట్రాక్టర్లు, ఇతర వాహనాల్లో జామాయిల్ కర్ర, పొట్టు, ఇతర వ్యవసాయ ఉత్పత్తుల వాహనాలు పెద్దఎత్తున తిరుగుతున్నాయి. బైపాస్ నిర్మాణం జరిగితే ఈ వాహనాలన్నీ పట్టణంలోకి రాకుండా పోవడం ద్వారా ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం లభి స్తుంది. కానీ నిధుల కొరతతో పనులు ప్రారంభంకాని వైనాన్ని ఎమ్మెల్యే మహీధరరెడ్డి వివరించగా, తక్షణం నిధుల కేటాయింపు చేస్తానని సీఎం జగన్ హామీ ఇచ్చారు. కానీ అమలుకు నోచుకోలేదు. అలాగే కరేడు పీహెచ్‌సీకి భవనాల నిర్మాణానికి కూడా నిధులు విడుదల కాలేదు.

ఏమేయ్.. నువ్వు రా... పెచారానికి పోదం.. మద్దేనం బువ్వ.. సందేళకు చుక్క.. కూలి వస్తాది !



పార్టీ ఏదైనా ప్రచారాల పేరుతో బేరం

రామయ్య: ఏందిరో నరసయ్య యాడికి బోతున్నవ
నరసయ్య: యాడికుందిలే మామా... పనికే కదా !
రామయ్య: ఓర్నాయాలా.. ఈ ఎండలో పనికేం పోతావురా ?
నరసయ్య: మరి ఇంకేం చేయమంటావు ?!
రామయ్య: పిచ్చి నాయాలా పెచారానికి పోదాం రా..
నరసయ్య: పెచారమా.. మాకెందులేబ్బా..
రామయ్య: అబ్బేలేదు.. గిబ్బే లేదు పోదాంపా..
నరసయ్య: జేబులో డబ్బుల్లేవ్ మామా..
రామయ్య: డబ్బు లెందుకురా పిచ్చోడా.. అంతా వాళ్లే చూసుకుంటారు.
నరసయ్య: వాళ్లెవరు సామి మధ్యలో...?
రామయ్య: అదేరా ఆ పార్టీ వాళ్లు
నరసయ్య: ఏంతిస్తారేంది?
రామయ్య: రోజుకూలీ, మందు సీసా, బిర్యానీ పొట్లం... చాలదా ?
నరసయ్య: అవునే.. ఇదేందో బాగుందే.. పద !
పుల్లయ్య: ఓరే యాడికిరే ఇద్దరూ సైయిగ్గా బోతుండ్రు
రామయ్య: యాడికి లేదులే రా పెచారినికే..
పుల్లయ్య: నీ పని బాగుంది కదరా.. రోజూ భలే బేరం తగులుద్దే
నరసయ్య: ఇట్టాంటప్పుడే లేవోయ్.. వాళ్లు కూడా మనల్ని గమనించేది !
పుల్లయ్య: అట్టయితే ఆగుండ్రా ఇప్పుడే వస్తా...
రామయ్య: మళ్లీ ఎక్కడికి రా... లేటవుద్ది !
పుల్లయ్య: పిల్లోడు సెలవులని ఇంటికాడే ఉన్నాడు. వాడ్ని తోడునొస్తా...
నరసయ్య: కక్కుర్తి నాయలా...? సరేలే తొందరగా పో...
పుల్లయ్య: ఇంతకీ ఏ పార్టీ వాళ్లది పెచారం ?
రామయ్య: ఏదయితే నీకెందురా మనం పోతున్నాం..
నరసయ్య: అంతేలేరా.. పెద్ద పెద్దోళ్లే తినంగా మనమెంత.. పదండి తొందరగా...!

- పరికుంటపాడు



నోట మందు


రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తే జైలుకే!

ఎన్నికల జాగ్రత్త

కొంతమంది అభ్యర్థులు సెంటిమెంట్‌ను రెచ్చగొడితే ఓట్లు పడతాయని భావించి కులం,మతం, వర్గం, ప్రాంత భేదాలతో ఇష్టారాజ్యంగా మాట్లాడుతుంటారు. ఇలాంటి రెచ్చగొట్టే వ్యాఖ్యలు అరికట్టేందుకు ఎన్నికల సంఘం కఠిన నిబం ధనలను రూపొందించింది. ఎన్నికల్లో ఎవరైనా జాతి, మతం, కులం, భాష, సమాజం పేరుతో రెచ్చగొడితే ఐపీఎస్ సెక్షన్ 158ఏ ప్రకారం మూడేళ్ల జైలుశిక్ష, జరిమానా విధిస్తారు. ఓటుకోసం మద్యం, డబ్బులు, ఇతర వస్తువులను తీసుకున్న వారిని కూడా నేరుస్థులుగానే పరిగణి స్తారు. ఐపీఎస్ సెక్షన్ 171బీ, 171హెచ్ ప్రకారం లంచంగా పరిగణించి ఏడాది జైలుశిక్ష విధిస్తారు. ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికల్లో డబ్బు, మద్యం ప్రవాహాలపై నిఘా పెంచారు. ఓటర్లను ప్రలోభాలకు గురి చేసిన వారు కూడా భారీ మూల్యం చెల్లించుకోక తప్పదు.

- ఉదయగిరి

ఆ రోజుల్లో కక్షలు ఉండేవి కాదు!



నేను తొలిసారిగా 1972లో ఓటు వేశాను. మా రోజుల్లో ఎన్నికలు ఎంతో స్నేహపూర్వక వాతావరణంలో జరిగేవి. పోటీ చేసే వారి మధ్య కక్షలు ఉండేవి కాదు. ఉదయాన్నే ఓటు వేయడానికి వచ్చిన వారికి పోటీ చేసిన వారు భోజనాలు ఏర్పాటు చేసేవారు. ఇది లంచం కింద కాదు. రిక్షాలు ఏర్పాటు చేసేవారు. ఏ రిక్షాలో వెళ్లినా మరో పోటీదారు ఫలానా వారు ఆ రిక్షాలో వెళ్లారని అసూయ పడేవారు కాదు. అలా వెళ్లిన వారిపై కక్ష సాధింపునకు దిగేవారు కాదు. ఇప్పుడు అలా కాదు. వీళ్ల మనోళ్లు, వారు వాలోళ్లు అని గిరి గీసుకుంటున్నారు. గెలుపు కోసం అడ్డదారులు తొక్కుతున్నారు. నాడు ఎన్నికల్లో ఫలితాలు కోసం బ్యాలెట్లు లెక్కింపు పూర్తయ్యే సరికి దాదాపు రెండురోజులు ఎదురు చూసేవాళ్లం. ఇప్పుడు ఈవీఎం మెషీ న్లు రావడంతో ఎవరు గెలిచారో తొందరగా తెలిసిపోతోంది. ఎన్నికలు ముగిసిన తరువాత అభివృద్ధి కోసం విజేత, పరాజితులు కృషి చేయాలి.

పెద్దల మాట

- చలమయ్య, అన్నారెడ్డిపాళెం, సంగం

స్టార్ క్యాంపెయినర్ల ప్రచారం

- కోడ్ ఉల్లంఘన జరగకుండా పరిశీలించాలి
- నోడల్ అధికారుల సమీక్షలో కలెక్టర్



అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హరినారాయణన్

నెల్లూరు (హరనాథ పురం); ఏప్రిల్ 27: స్టార్ క్యాంపెయినర్లు ప్రచారానికి వస్తున్నందున కోడ్ ఉల్లంఘన జరగకుండా నిశితంగా పరిశీలించాలని కలెక్టర్ ఎం. హరి నారాయణన్ అధికారులను ఆదేశిం చారు. కార్పొరేషన్‌లోని కమాండ్ కంట్రోల్ రూంలో శనివారం నోడల్ అధికారులతో సమా వేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల ప్రచారం ముమ్మరంగా సాగుతున్నందున కోడ్ అమలును అత్యంత జాగ్రత్తగా పరిశీలించాలన్నారు. ఇంటలిజెన్స్ విభాగం అధికారులు మద్యం డంప్‌లు ఎక్కడున్నాయో గుర్తించి సీజ్ చేయాలన్నారు. చెక్ పోస్టుల దగ్గర ప్రతి వాహనాన్ని తనిఖీ చేయాలన్నారు. ఆటోలు, ద్విచక్ర వాహనాలను తప్పనిసరిగా తనిఖీ చేయాలన్నారు. జిల్లాలో ఎన్నికల విధులు కేటాయించ బడిన వారు మే 1వ తేదీలోగా పోస్టల్ బ్యాలెట్ కోసం ఫామ్ 12 అందచేయాలన్నారు. సమావేశంలో డీఆర్వో లవన్న,నోడ్ అధికారులు బాపురెడ్డి, వెంకట్రావు, పద్మావతి, అనిత రాణి, ఎస్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

పరిశీలకుల నోడల్ అధికారిగా డీఎస్వో



నెల్లూరు(హరనాథపురం): పరిశీలకుల నోడల్ అధికారిగా జిల్లా పౌరసరఫరాల అధికారి డీవీ రమణను కలెక్టర్ హరినారాయణన్ శనివారం నియమించారు. రమణ ఏపీ టూరిజం హోటల్‌లో ప్రజలకు అందుబాటులో ఉంటారు. 80083 01500 నంబరులో ఆయన్ను సంప్రదించవచ్చు.

ఫిర్యాదుల స్వీకరణకు ఎన్నికల పరిశీలకులు వీరే!

నెల్లూరు (హరనాథపురం), ఏప్రిల్ 27 : ఎన్నికల ప్రక్రియను పూర్తిస్థాయిలో పర్యవేక్షణకు, పారదర్శకంగా ఎన్నికల నిర్వహణకు కేంద్ర ఎన్నికల సంఘం జిల్లాకు ఎన్నికల పరిశీలకులను నియమించిందని, వీరు ప్రజలకు, రాజకీయ పార్టీలకు అందుబాటులో ఉంటారని జిల్లా పరిశీలకుల నోడల్ అధికారి డీవీ రమణ ఒక ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గాల పరిధిలో ఏమైనా ఫిర్యాదులు ఉంటే వెంటనే ఫోన్ ద్వారా లేదా, అర్జీల రూపంలో సంబంధిత పరిశీలకులకు తెలియచేయాలని కోరారు.

- ఆత్మకూరు, కోవూరు, నెల్లూరు సిటీ, నెల్లూరు రూరల్ అసెంబ్లీ నియోజకవర్గాలకు నితిన్ బదారియా నియమితులయ్యారు. 6281209403 నెంబరుకు ఫోన్ చేసి, ఫిర్యాదు చేయవచ్చు
- నెల్లూరు పార్లమెంటు, కందుకూరు, కావలి, ఉదయగిరి నియోజకవర్గాలకు రామ్‌కుమార్ నియమితుల య్యారు. ఈయన ఫోన్ నంబరు 9014504275.
- నెల్లూరు పార్లమెంటు, కందుకూరు, కావలి, ఆత్మకూరు, కోవూరు, నెల్లూరు సిటీ, నెల్లూరు రూరల్, ఉదయగిరి నియోజకవర్గాలకు అశోక్‌దుదే పోలీసు పరిశీలకులుగా నియమితులయ్యారు. ఫోన్ నెం.7569618685.
- నెల్లూరు పార్లమెంటు నియోజకవర్గానికి వ్యయ పరిశీలకులుగా గోరసె ప్రసాద్ దత్తాత్యేయ నియమితులు కాగా, 8008292237 నెంబరుకు ఫోన్ చేసి, ఫిర్యాదులు చేయవచ్చు.
- కోవూరు, నెల్లూరుసిటీ, రూరల్, సర్వేపల్లి నియోజకవర్గాలకు కంచన్‌రామ్‌మీనా సాధారణ పరిశీలకులుగా నియమితులయ్యారు. ఫోన్ నెం. 8247832811.
- కందుకూరు, కావలి, ఆత్మకూరు, ఉదయగిరి నియోజకవర్గాలకు వ్యయపరిశీలకులుగాజ్యోతిమోయ్ భైలుంగ్ నియమితులుకాగా, ఫోన్ నెం.8639687940.
- తిరుపతి పార్లమెంటు నియోజకవర్గం, సర్వేపల్లి నియోజవర్గానికి సాధారణ పరిశీలకులుగా కె.జ్యోతి (9912340472), పోలీసు పరిశీలకులుగా అరవింద్ సాల్వే (9154141876) నియమితులయ్యారు. తిరుపతి పార్లమెంటు వ్యయపరిశీలకులుగా పరదీప్ కూమార్ (9032666742) నియమితులయ్యారు.

అప్పట్లో 21 ఏళ్లకు ఓటు

మీకు తెలుసా..!

దేశంలో మొదటిసారిగా సాధారణ ఎన్నికలు 1952లో జరిగాయి. కేంద్ర ఎన్నికల కమిషనర్‌గా సుకుమార్ సేన్ ఆధ్వర్యంలో 17.90 కోట్ల మందికి ఓటు వేసే అవకాశం కల్పించారు. 1985 వరకు ఓటు హక్కు కనీస వయసు 21 ఏళ్లుగా ఉండేది. 1988 లో 61వ రాజ్యాంగ సవ రణ చట్టం ద్వారా ఓటు హక్కు వయసు 18 ఏళ్లకు తగ్గించారు. ఎన్నికల నిర్వహణలో సమూల సంస్కరణలు అమలు చేసిన ఘనత 1990 దశకంలో ఎన్నికల కమిషనర్‌గా పనిచేసిన టీఎన్ శేషన్‌కు దక్కు తుంది. మొదటిసారి జరిగిన ఎన్నికల్లో 55 పార్టీలు బరిలో నిలవగా, 2014 నాటికి ఆసంఖ్య 370కి చేరింది. నాడు బ్యాలెట్ పేపర్‌తో ఎన్నికల నిర్వహించే విధానం నుంచి నేడు ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ (ఈవీఎం) అమల్లో వచ్చింది. 2019 ఎన్నికల నుంచి ఓటు ఎవరికి వేశారో తెలుసుకునేందుకు ఓటర్ వెరిఫైడ్ పేపర్ ట్రయిల్ (వీవీ ప్యాడ్) యంత్రాలను వినియోగిస్తున్నారు.

- అనంతసాగరం/ ఉదయగిరి



నామినేషన్ దాఖలు చేసిన పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా అభ్యర్థి రాజేశ్వరి (ఫైల్)

ఆత్మకూరు బరిలో తొలిసారిగా నారీ


ఇప్పటి వరకు జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఆత్మకూరు నుంచి ఎందరో ఉద్దండులు పోటీ చేసి, తమ రాజకీయ భవితకు బాటలు వేసుకున్నారు. అయితే మహిళలకు మాత్రం ఇక్కడ నుంచి పోటీ చేసే అవకాశం ఏపార్టీ కూడా ఇవ్వలేదు. తాజా ఎన్నికల్లో మాత్రం పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా అభ్యర్థిగా బీ రాజేశ్వరి బరిలో నిలిచారు. ప్రస్తుత ఎన్నికల్లో టీడీపీ నుంచి ఆనం రామనారా యణరెడ్డి, వైసీపీ నుంచి మేకపాటి విక్రమ్ రెడ్డి, కాంగ్రెస్ నుంచి చేవూరు శ్రీధర్‌రెడ్డి బరిలో ఉన్నారు. నియోజకవర్గంలో 2,14,582 మంది ఓట్లు ఉండగా, వారిలో 1,05,444 మంది పురుషులు కాగా, 1,09,130 మంది స్త్రీలు ఉన్నారు. పురుషుల కంటే స్త్రీల ఓట్లే ఆధిక్యత ఉన్నా ఏ రాజకీయ పార్టీ మహిళలకు అసెంబ్లీ సీటు కేటాయించలేదు.

● ఏళ్ల తరబడి నిరాశే..

1955 నుంచి 2019 వరకు జరుగుతున్న అసెంబ్లీ ఎన్నికల తీరుతెన్నులను పరిశీలిస్తే ఒక్కసారి కూడా ఏ పార్టీ తన అభ్యర్థిగా మహిళలను నిలబెట్టిన దాఖలాలు కనిపించడం లేదు. ముఖ్యంగా 12 సార్లు గెలిచిన కాంగ్రెస్ పార్టీ గానీ, ఐదు సార్లు పోటీ చేసిన టీడీపీ నుంచి గానీ, మూడుసార్లు పోటీ చేసిన వైసీపీ నుంచి గాని, నాలుగు సార్లు పోటీ చేసిన బీజేపీ నుంచి గానీ, సీపీఎం, సీపీఐ నుంచి గానీ ఇంతవరకు ఆత్మకూరులో మహిళకు అసెంబ్లీ టికెట్ కేటాయించిన దాఖలాలు లేవు. కాగా ప్రస్తుత ఎన్నికల్లో పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా అభ్యర్థిగా బీ రాజేశ్వరి పోటీలో ఉండడం గమనార్హం. అసెంబ్లీలో ఆత్మకూరు మగువ వాణి ఎప్పుడు వినిపిస్తుందో వేచిచూడాల్సిందే.

ఎవరు ఏ పార్టీయో..?

- రోజుకో జెండా, పూటకో కండువా మార్చుతున్న నేతలు
- అధినేతల బాటలోనే ద్వితీయశ్రేణి నేతలు



జంపింగ్ జపాంగ్

ఎమ్మెల్యేగా పోటీచేసే నేతలే పార్టీలు మారుతున్నారు. వారిని ఆదర్శంగా తీసుకుని కావలి నియోజకవర్గంలో దిగువ స్థాయి నాయకులు కూడా జెండాలు మార్చేస్తున్నారు. దీంతో ఏ నాయకుడు ఏరోజు ఏ పార్టీలో ఉంటారో అంతు బట్టడంలేదు. 2009లో కావలి నుంచి ఎమ్మెల్యే అభ్యర్థులుగా టీడీపీ నుంచి బీద మస్తాన్ రావు, కాంగ్రెస్ నుంచి కాటం రెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి, ప్రజా రాజ్యం పార్టీ నుంచి రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డిలు పోటీ చేశారు. అయితే ఇప్పుడు ఈ ముగ్గురు ఒకటై వైసీపీలో కొనసాగుతున్నారు. వైసీపీ అభ్యర్థి ప్రతాప్‌కుమార్ రెడ్డి గెలుపునకు కృషిచేస్తున్నారు. 2014లో టీడీపీ నుంచి బీద మస్తాన్ రావు, వైసీపీ నుంచి రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి పోటీ పడ్డారు. వారిద్దరి గెలుపు కోసం ఇరుపార్టీల కేడర్ ద్వేషాలు పెంచుకుని పోరాడారు. ఇప్పుడు వారిద్దరూ ఒకటయ్యారు.2019లో టీడీపీ తరుపున కాటం రెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి, వైసీపీ తరపున రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అసెంబ్లీకి పోటీపడగా, టీడీపీ నెల్లూరు ఎంపీ అభ్యర్థిగా బీద మస్తాన్‌రావు పోటీ చేశారు. ప్రస్తుతం ఈ ముగ్గురు ఒకటై వైసీపీలో పనిచేస్తున్నారు. ఇలా వివిధ పార్టీల తరుపున పోటీ చేసిన నేతలే ఒకటి అవుతుండటంతో వారిని ద్వితీయ, తృతీయశ్రేణి నేతలు ఫాలో అవుతున్నారు. ప్రస్తుతం కావలిలో టీడీపీ తరపున దగుమాటి వెంకట(కావ్య) క్రిష్ణారెడ్డి, వైసీపీ తరపున రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి పోటీ చేస్తున్నారు.ఈ ఇద్దరు ఆర్థికంగా పరిపుష్టి కలవారు. అలాగే స్వతంత్ర అభ్యర్థి పసుపులేటి సుధాకర్ కూడా ఆర్థికంగా బలంగా ఉండటంతో అన్ని పార్టీలలోని నేతలు, కార్యకర్తలు ప్యాకేజీలు తీసుకుని పార్టీలు మారుతున్నారు. దీంతో వివిధ పార్టీలకు చెందిన నేతలు ఎప్పుడు ఏ పార్టీలో ఉంటారో అర్థం కాక రాజకీయ పరిశీలకులు సైతం తలలు పట్టుకుంటున్నారు. సహజంగా ఓటర్లు ఏ పార్టీకి ఓటు వేస్తారో వారి నాడి అంతుపట్టక అయోమయంలో ఉంటే, వారి కన్నా ముందు నేతలు నాడి అంతుపట్టక పలువురు గందరగోళంలో పడ్డారు.

- కావలి



నిఘా

నీడలా వెన్నాడుతున్న నిఘా !

- అభ్యర్థుల ఖర్చులపై ఆరా

సార్వత్రిక ఎన్నికల నామినేషన్ల పర్వం పూర్తయింది. ఏ పార్టీ తరుపున ఎవరు పోటీలో ఉంటారనేది కూడా తేలింది. నామినేషన్లకు సుమారు నెల ముందు నుంచే అభ్యర్థులు విస్తృతంగా ప్రచారం చేపట్టారు. ఇక రెండోరౌండ్ సాదాసీగా ప్రచారం చేస్తే చాలదు. పోలింగ్ రోజు వరకు భారీ ఖర్చు తప్పదు. ఖర్చుల విషయమంలో ఎన్నికల సంఘం అధికారులు అభ్యర్థులను నీడలా వెంటాడుతారు. ఎన్నికల సంఘం మార్గదర్శక సూత్రాల మేరకు ఖర్చు చేస్తున్నారా? అని పరిశీలించేందుకు వాళ్ల బృందాలు పరిశీలిస్తున్నాయి. గెలుపు కోసం అభ్యర్థులు ఎన్ని కోట్ల ఖర్చుకైనా వెనుకాడరు. ఫ్లయింగ్‌స్క్వాడ్, ఎస్‌ఎస్‌టీ బృందాలు, కోడ్ ఆఫ్ కాంటాక్ట్ బృందం, వీడియో వీక్షక బృందం, అకౌంటింగ్ బృందం వీడియో సర్వేలియన్స్ బృందం పోటీలో ఉన్న అభ్యర్థుల కదలికలను గమనిస్తూ ఉంటాయి. ప్రచార ఖర్చును అంచానవేయడంతోపాటు అభ్యర్థులు ఎన్నికల నియమావళిని పాటిస్తున్నా.. లేదా ? నిఘా వేస్తారు. వాహనాల తనిఖీలు నిర్వహించి పరిమితికి మించి డబ్బు మద్యం, ఇతర విలువైన వస్తువులు రవాణా చేస్తుంటే స్వాధీనం చేసుకుంటారు. నీడలా వెంటాడే ఈ బృందాలు మధ్య అభ్యర్థులు పోలింగ్ ముగిసే చాలా జాగ్రత్తగా ఉండాలి.

-ఉదయగిరి

కోవూరు సర్వేపల్లి

ప్రసన్న కాదు.. పర్సంటేజీల ఎమ్మెల్యే



సభలో ప్రసంగిస్తున్న చంద్రబాబు, పక్కన అభివాదం చేస్తున్న వేమిరెడ్డి దంపతులు



సభలో ప్రజల ఆనందం

- కోవూరుకు సవాల్‌గా మారిపోయారు!
- వెయ్యి కోట్ల షుగర్ ఫ్యాక్టరీ కొట్టేసేందుకు టెండర్
- కోవూరు ఎమ్మెల్యేపై ధ్వజమెత్తిన చంద్రబాబు

బుచ్చిరెడ్డిపాళెం/నెల్లూరు (ఆంధ్రజ్యోతి), ఏప్రిల్ 27: 'ఆయన పేరు ప్రసన్నకాదు.. పర్సంటేజీ ఎమ్మెల్యే.. ఆయన్ను ప్రసన్నం చేసుకుంటేనే ఏ పనులైన జరుగుతాయి. లే అవుట్ వేయాలంటే ఎకరాకు రూ.5 లక్షలు కప్పం కట్టాలి. కనిగిరి రిజర్వాయర్‌లో రూ.కోట్ల గ్రావెల్ తవ్వేశారు. వెయ్యి కోట్ల విలువైన షుగర్ ఫ్యాక్టరీ భూములను కొట్టేసేందుకు టెండర్ వేశాడు. టీడీపీ, జనసేన కార్యకర్తలు దానిని అడ్డుకున్నారు. మొత్తంగా కోవూరు నియోజకవర్గానికి ప్రసన్నకుమార్‌రెడ్డి ఓ సవాల్‌గా తయారయ్యారు. అందుకు నేను ఇస్తున్నా మెడిసినే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి. రాజకీయమంటే దోపిడీ అన్నది ప్రసన్న సిద్ధాంతం కానీ రాజకీయమంటే ప్రజాసేవ అన్నది వేమిరెడ్డి దంపతుల సిద్ధాంతం.' అంటూ తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డిపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. శనివారం రాత్రి బుచ్చిరెడ్డిపాళెంలోని బస్టాండ్ సెంటరులో జరిగిన ప్రజాగళం సభలో చంద్రబాబు ప్రసంగించారు. కోవూరులో వైసీపీ నాయకులు కుక్కల మాదిరిగా మొరుగుతున్నారని, కుక్కలకు ఏనుగులు భయపడవన్న విషయాన్ని వారు తెలుసుకోవాలని హితవుపలికారు. ప్రశాంతమైన జిల్లాగా నెల్లూరుకు పేరుందని కానీ వైసీపీ ప్రభుత్వ పాలనలో భూకబ్జాలు, గొడవలు, బెట్టింగులు, అరాచకాలకు నిలయంగా మార్చారని దుయ్యబట్టారు. ఎన్నికల నేపథ్యంలో గోవా, పుదుచ్చేరిల నుంచి కల్తీ మద్యం తెచ్చి పేదల ప్రాణాలతో వైసీపీ ఎమ్మెల్యేలు ఆటలాడుతున్నారని మండిపడ్డారు. కోవూరు సభలో ప్రజల ఉత్సాహాన్ని చూస్తుంటే గెలుపు ఎవరిదో డిసైడ్ అయిపోయిందని వ్యాఖ్యానించారు. జిల్లాలో సోమశిల జలాశయం ఉన్నా డెల్టాలో తాగునీరు ఇవ్వలేని దుస్థితి దుపురించిందని విమర్శించారు. ఎన్డీయే కూటమి అధికారంలోకి రాగానే కోవూరులో ఇంటింటికి తాగునీరు అందిస్తామని హామీ ఇచ్చారు. పోలంరెడ్డి దినేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● కిక్కిరిసిన బుచ్చి

బుచ్చిలో ప్రజాగళం సభ సూపర్ సక్సెస్ అయింది. చంద్రబాబు ప్రసంగం వినేందుకు నియోజకవర్గం నలుమూలల నుంచి టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివచ్చారు. ఆత్మకూరులో సభ ముగించుకుని చంద్రబాబు రాక కొంత ఆలస్యమైనా ప్రజలు ఓపిగ్గా ఎదురుచూశారు. చంద్రబాబు ప్రసంగిస్తునంతసేపు కార్యకర్తలు ఉత్సాహంగా కనిపించారు. చంద్రబాబు సంధించే ప్రశ్నలకు సభకు వచ్చిన వారి అరుపులు, కేకలతో సమాధానాలు వచ్చాయి. సభకు వచ్చిన వారి ఉత్సాహం చూసిన చంద్రబాబు కోవూరులో గెలుపు డిసైడ్ అయిపోయిందని వ్యాఖ్యనించారంటేనే అక్కడ సభ జరిగిన తీరు అర్థం చేసుకోవచ్చు.

వైసీపీ నాయకుల బరితెగింపు

- జగనన్న లేఅవుట్‌లో కొలతలు, హద్దురాళ్ల ఏర్పాటు
- అడ్డుకున్న అధికారులు



లేఅవుట్‌లోకి హద్దురాళ్లు తీసుకెళ్లిన ట్రాక్టర్

వెంకటాచలం, ఏప్రిల్ 27 : ఎన్నికల కోడ్ అమలులో ఉండగానే అధికార పార్టీ నాయకులు బరితెగించారు. ఇస్కపాళెం గ్రామంలో జగనన్న లేఅవుట్‌లో కొలతలు, హద్దు రాళ్ల ఏర్పాటుకు సిద్ధపడ్డారు. ఇది గమనించిన స్థానికులు నిలదీయగా ఆదివారం పట్టాలు ఇస్తారని చెప్పారు. ఈ విషయం తెలుసుకున్న టీడీపీ నాయకులు బాబుల్‌రెడ్డి, కొవూరు సురేష్ లతో పాటు మరికొందరు ఆ పనులను అడ్డుకొని టీడీపీ మండలాధ్యక్షుడు గుమ్మడి రాజాయాదవ్, అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. రాజా యాదవ్ తహసీల్దారు, అసిస్టెంట్ ఎన్నికల అధికారి పూర్ణచంద్రరావుకు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. పనులను ఆపించాలని ఇస్కపాళెం వీఆర్‌వో కిరణ్‌కు తహసీల్దారు ఫోన్ చేసి ఆదేశించారు. వీఆర్వో కిరణ్ గ్రామ తలారులతో ఆ పనులను ఆపి వేయించారు. ఈ వ్యవహారంపై విచారించనున్నట్లు తహసీల్దారు తెలిపారు. టీడీపీ మండలాధ్యక్షుడు రాజాయాదవ్ మాట్లాడుతూ వైసీపీ అభ్యర్థి కాకాణికి ఓటమి భయం పట్టుకొందని, ఎలాగైనా గెలవాలని ఇలాంటి దిగజారుడు రాజకీయాలు చేస్తున్నాడని మండిపడ్డారు. కోడ్ ఉల్లంఘించిన వైసీపీ నాయకులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఎన్నికల తర్వాత కరోనా ప్యాలెస్‌కే కాకాణి పరిమితం

● సోమిరెడ్డి సమక్షంలో 30 కుటుంబాలు చేరిక

వెంకటాచలం, ఏప్రిల్ 27: ఎన్నికల తర్వాత కాకాణి గోవర్ధన్‌రెడ్డి నెల్లూరులో నూతనంగా నిర్మించుకున్న కరోనా ప్యాలెస్‌కే పరిమితం అవ్వడం ఖాయమని మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఎద్దేవా చేశారు. వేదాయపాళెంలో ఉన్న కార్యాలయంలో శనివారం మండలంలోని కాకుటూరు గ్రామానికి చెందిన 30 కుటుంబాలు సోమిరెడ్డి సమక్షంలో వైసీపీని వీడి టీడీపీలో చేరారు. వీరికి సోమిరెడ్డి పార్టీ కండువాలు కప్పి టీడీపీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు గుమ్మడి రాజాయాదవ్, టీడీపీ నాయకులున్నారు.

●మండలంలోని గూడ్లూరువారిపాళెం గ్రామంలో సోమిరెడ్డి కుమారై సింధురెడ్డి శనివారం ఎన్నికల ప్రచారం చేశారు. ఇంటింటికీ వెళ్లి సోమిరెడ్డి చేసిన అభివృద్ధి పనులను ప్రజలకు వివరించి ఎన్నికల్లో ఓటువేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో రాజాయాదవ్, రాధా కృష్ణమ నాయుడు, మురళీధర్‌రెడ్డి, సుబ్బారెడ్డి, దశయ్య తదితరులున్నారు.

●మండలంలోని పూడిపర్తి గ్రామంలో సోమిరెడ్డి అక్క, బావ సంయుక్తమ్మ, రాధాకృష్ణారెడ్డి దంపతుల్దిరూ కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సోమిరెడ్డి హయాంలో పూడిపర్తిలో జరిగిన అభివృద్ధి పనులు, చంద్రబాబు సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులున్నారు.

●**ముత్తుకూరు:** సర్వేపల్లి నియోజకవర్గం అభివృద్ధి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డితోనే సాధ్యమని నియోజకవర్గ టీడీపీ సమన్వయకర్త సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి తెలిపారు. శనివారం ముసునూరువారి పాలెంలో ఎన్నికల ప్రచారం నిర్వహించి చంద్రమోహన్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు పల్లంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి నీలం మల్లికార్జునయాదవ్, అధ్యక్షుడు ఈపూరు మునిరెడ్డి, సీనియర్ నాయకులు మునుకూరు రవికుమార్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



వెంకటాచలం: టీడీపీలో చేరిన వారితో మాజీ మంత్రి సోమిరెడ్డి

●**పొదలకూరు:** పొదలకూరు పంచాయతీ పరిధిలోని లింగంపల్లిలో శనివారం సోమిరెడ్డి కోడలు శృతిరెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ కరపత్రాలు అందజేస్తూ ఆరు గ్యారెంటీలను వివరిస్తూ ఓటు వేయమని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు తలచీరు మస్తాన్‌బాబు, పట్టణ బొద్దులూరు మల్లికార్జున్‌నాయుడు, బక్కయ్యనాయుడు, టీడీపీ మహిళా అధ్యక్షురాలు ఆదాల సుగుణమ్మ, మైనారిటీ నాయకులు జమీర్‌బాషా, తదితరులు పాల్గొన్నారు.



పొదలకూరు : లింగంపల్లి ప్రచారంలో శృతిరెడ్డి

త్వరలో కాకాణి పాపాలు పండుతాయి..

తోటపల్లిగూడూరు: సర్వేపల్లి నియోజకవర్గంలో మంత్రి కాకాణి చేసిన పాపాలు త్వరలో పండుతాయని సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. మండలంలోని చింతోపు, ముంగలదొరువు, సౌత్ ఆములూరు గ్రామాలలో శనివారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా సోమిరెడ్డి మాట్లాడుతూ ఈ ఒక్కసారి గెలిపించి నియోజకవర్గంలో తలెత్తుకునేటట్లు చేయాలని, పంచాయతీలో ఉన్న సమస్యలను టీడీపీ అధికారంలోకి రాగానే పరిష్కరిస్తానని ప్రజలకు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు బొమ్మి సురేంద్ర, సురేష్‌రెడ్డి, మాగుంట రమణారెడ్డి, జనసేన, బీజేపీ, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు సభకు భారీగా తరలిన టీడీపీ శ్రేణులు

కోవూరు, ఏప్రిల్ 27: బుచ్చిరెడ్డిపాళెం పట్టణంలో శనివారం జరిగిన చంద్రబాబునాయుడి సభకు మండల పరిధిలోని గ్రామాల నుంచి టీడీపీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివెళ్లారు. కోవూరు, పడుగుపాడు, పోతిరెడ్డిపాళెం, లేగుంటపాడు, ఇనమడుగు, పాటూరు, గంగవరం గ్రామాల నుంచి కార్లు, ఆటోలు, బైక్‌ల్లో పెద్దసంఖ్యలో వెళ్లారు. టీడీపీ మండల కమిటీ అధ్యక్షుడు ఇంతా మల్లారెడ్డి, నాయకులు నాటకరాని వెంకట్, తిరుమూరు అశోక్ రవీంద్రరెడ్డి, చెంబేటి పెంచలయ్య, గంగవరం రవిచంద్ర, నజీర్‌బాష, బాలరవి, జెట్టి రాజగోపాలరెడ్డి, కే సుధాకరరెడ్డి నాయకత్వంలో పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు.

నగరంలో బాహుబలి ఎగ్జిబిషన్ ప్రారంభం

● ఆకట్టుకుంటున్నరైడర్లు



ఎగ్జిబిషన్‌లోని బాహుబలి సెట్టింగ్

నెల్లూరు (సాంస్కృతికం), ఏప్రిల్ 27 : నెల్లూరు నగరంలోని వైఎంసీఏ మైదానంలో బాహుబలి ఎగ్జిబిషన్ శనివారం రాత్రి ఘనంగా ప్రారంభమైంది. సినీ దర్శకుడు రాజమౌళి నిర్మించిన బాహుబలి 1, 2 సినిమాలలోని సెట్టింగ్స్ అచ్చుగుద్దినట్లు ఈ ఎగ్జిబిషన్‌లో ఏర్పాటు చేశారు. ఎగ్జిబిషన్‌లోకి ప్రవేశించిన వెంటనే బాహుబలి చిత్రంలోని మధుర ఘట్టాలు కళ్ల ముందు ఆవిష్కరిస్తాయి. లోపల 150 దుకాణాలు, ఫుడ్ కోర్టులతోపాటు టోరా టోరా, జెయింట్ వీల్, బ్రేక్ డ్యాన్స్ డ్రాగన్ ట్రైన్స్, చిన్నారుల రైడ్స్ ఆకట్టుకుంటున్నాయి. ఎగ్జిబిషన్ నిర్వాహకుడు ఎస్‌కే బాబు మాట్లాడుతూ ఈ ఎగ్జిబిషన్ ప్రతి రోజు సాయంత్రం 5 నుంచి రాత్రి 10గంటల వరకు ఉంటుందని, నగరవాసులు అందరూ తరలిరావాలని విజ్ఞప్తి చేశారు.

సోమశిలలో 8.262 టీఎంసీల నిల్వ

అనంతసాగరం, ఏప్రిల్ 27: సోమశిల జలాశయం పూర్తిస్థాయి నీటి సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా శనివారానికి ప్రాజెక్టులో 8.262 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. దిగువ డెల్టాకు 200, ఉత్తర కాలువకు 5, దక్షిణ కాలువకు 25 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతి



అశోక్ లేలాండ్ మినీ ట్రక్కును ఢీకొన్న కంటైనర్ లారీ





మహ్మద్ ఇర్ఫాన్, వెంకటసాయిరాం మృతదేహాలు

కావలి రూరల్, ఏప్రిల్ 27: కావలి పట్టణ సమీపంలోని తుమ్మల పెంట ఫ్లైవోవర్ బ్రిడ్జిపై శనివారం ముందు వెళుతున్న మినీ ట్రక్కు వాహనాన్ని వెనుక నుంచి కంటైనర్ లారీ ఢీకొన్న ఘటనలో ఇద్దరు వ్యక్తులు మృతి చెందారు. రూరల్ పోలీసుల కథనం మేరకు.. చెన్నై నుంచి పాత ఏసీల లోడుతో అశోక్ లేలాండ్ కంపెనీకి చెందిన మినీ ట్రక్కు వాహనం పశ్చిమగోదావరి జిల్లా ఆకివీడుకు బయలుదేరింది. ఈ వాహనం మార్గమధ్యంలోని కావలి సమీపంలో తుమ్మలపెంట ఫ్లైవోవర్ బ్రిడ్జిపైకి వచ్చేసరికి తమిళనాడు నుంచి హైదరాబాదు వెళుతున్న కంటైనర్ లారీ వెనుక నుంచి వేగంగా ట్రక్కును ఢీకొంది. ఈ ప్రమాదంలో గుంటూరు జిల్లా పండరీపురంకు చెందిన అశోక్ లేలాండ్ మినీ ట్రక్కు డ్రైవర్ తోటకూర వెంకట సాయిరాం(34) అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన పశ్చిమగోదావరి జిల్లా ఆకివీడుకు చెందిన పాత ఏసీల వ్యాపారి మహ్మద్ ఇర్ఫాన్(30)ను చికిత్స నిమిత్తం 108 వాహనంలో కావలి ఏరియా వైద్యశాలకు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించి సీఐ కాటూరి శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భవనం పైనుంచి పడి కార్మికుడు..



గుర్తుతెలియని కార్మికుడి మృతదేహం

నెల్లూరు(క్రైం), ఏప్రిల్ 27: నెల్లూరులోని చంద్రమౌళి నగర్‌లో నూతనంగా నిర్మిస్తున్న ఓ భవనం పైనుంచి ప్రమాదవశాత్తు జారిపడి ఓ కార్మికుడు మృతి చెందాడు. పోలీసుల సమాచారం మేరకు.. నగరానికి చెందిన శ్రీనివాస్ బేల్దారి మేస్త్రీగా పనిచేసుకుంటూ జీవనం సాగి స్తున్నాడు. ప్రస్తుతం చంద్రమౌళినగర్ ఆరో వీధిలో నిర్మిస్తున్న భవనానికి పనిచేస్తున్నా డు. శనివారం ఉదయం కరెంటాఫీసు సెంటర్‌లో ఓ వ్యక్తిని సహచర కూలీగా తీసుకుని వెళ్లాడు. ఆ వ్యక్తి పనిచేస్తుండగా భవనం పైనుంచి కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. సహచరులు 108 అంబులెన్స్‌లో జీజీహెచ్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. సమాచారం అందుకున్న వేదాయపాళెం పోలీసులు వైద్యశాలకు చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతి చెందిన కార్మికుడి వివరాలు తెలిసిన వారు 9440796304 నెంబరుకు సమాచారం అందించా లని ఇన్‌స్పెక్టర్ పీవీ నారాయణ కోరారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

● 18 సవర్ల బంగారు నగలు, రూ.లక్ష నగదు అపహరణ



బీరువా పగులగొట్టిన దృశ్యం

పొదలకూరు, ఏప్రిల్ 27 : తాళం వేసి ఉన్న ఓ ఇంట్లో చోరీ జరిగిన సంఘటన పొదలకూరు పట్టణంలోని మారుతీనగర్‌లో శనివారం చోటుచేసుకుంది. పోలీసులు కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని మారుతీనగర్‌లో నివాసం ఉంటున్న తోకల సురేష్ అనే వ్యక్తి ఇంటికి తాళం వేసి కుటుంబీకులతో కలిసి ఈనెల 25న మనుబోలు మండలం వడ్లపూడి గ్రామంలో ఓ వివాహానికి వెళ్లారు. శనివారం ఉదయం వచ్చి చూడగా ఇంటి తాళం పగులగొట్టి తలుపులు తీసి ఉన్నాయి. ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువా తెరిచి ఉంది. బీరువాలో పెట్టిన 18 సవర్ల బంగారు నగలు, రూ.లక్ష నగదు కనిపించలేదు. దీంతో చోరీ జరిగిందని భావించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. రంగంలోకి దిగిన పోలీసులు చోరీ జరిగిన ప్రదేశానికి వెళ్లి పరిశీలించగా ఇంటి వరండాలో గడ్డపార పడి వుంది. గడ్డపార సహాయంతో దొంగలు ఇంటి తాళాలు పగలగొట్టినట్లు గ్రహించి క్లూసీ టీమ్‌కు సమాచారం అందించడంతో క్లూస్ టీం వేలిముద్రలు సేకరించారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రైలు ఢీకొని చుక్కల దుప్పి మృతి

బిట్రగుంట: బిట్రగుంట రైల్వే స్టేషన్ ఉతరం వైపు ఎగువ మార్గంలో శనివారం గుర్తు తెలియని రైలు ఢీకొని చుక్కల దుప్పి మృతి చెందిందని సెక్షన్ ఆఫీసర్ ఆర్.సుమన్ తెలిపారు. ప్రమాదం జరిగిన వెంటనే ఈ విషయమై వెటర్నరీ అధికారులకు సమాచారాన్ని ఇవ్వగా వెటర్నరీ వైద్యాధికారి రాజు, అసిస్టెంట్ ఝాన్సీ ఘటనా స్థలికి చేరుకుని చుక్కల దుప్పిని పరిశీలించి మృతి చెందినట్లు నిర్ధారించి శవపంచనామా చేశారన్నారు. దుప్పి మృతదేహాన్ని అటవీశాఖ సిబ్బంది సహాయంతో దహణ సంస్కారాలు పూర్తి చేసినట్లు తెలిపారు.



చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	143
లేయర్ లైవ్	93
స్కిన్ చికెన్	254
స్కిన్‌లెస్	284
లేయర్	158

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ. 6878
వెండి కిలో ధర	రూ. 83,500
వెండి ఒక గ్రాము	రూ. 85.50

వీఎస్‌యూ విద్యార్థికి డాక్టరేట్



వర్ధి వెంకటేశ్వర్లు

వెంకటాచలం, ఏప్రిల్ 27: విక్రమ సింహపురి యూనివర్సిటీలో మెరైన్ బయాలజీ విభాగం పరిశోధన విద్యార్థి వర్ధి వెంకటేశ్వర్లుకు వీఎస్‌యూ డాక్టరేట్ ప్రదానం చేసింది. వెంకటేశ్వర్లు బయో అక్యుములేషన్ ఆఫ్ టాక్సిక్ మెటల్స్ అండ్ మెటల్లోతయోనిక్స్ ఇన్ సెలెక్టెడ్ మెరైన్ ఫిషెస్ ఆఫ్ నెల్లూరు కోస్ట్ ఇన్ సౌత్ కోస్టల్ ఆంధ్రప్రదేశ్ అనే అంశంపై మెరైన్ బయాలజీ విభాగంలో ప్రొఫెసర్ సీహెచ్ వెంకట్రాయులు పర్యవేక్షణలో పరిశోధన గ్రంథం సమర్పించినట్లు వర్సిటీ పరీక్షల నిర్వాహణాధికారి డాక్టర్ ఆర్ మధుమతి తెలిపారు. దీంతో వెంకటేశ్వర్లుకు వర్సిటీ వీసీ సుందరవల్లి, రిజిస్ట్రార్ డాక్టర్ పీ రామచంద్రారావుతోపాటు పలువురు శనివారం అభినందించారు.

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి టీడీపీతోనే సాధ్యం

● ఎన్నికల ప్రచారంలో కూటమి అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి



కొడవలూరు: ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న ప్రశాంతిరెడ్డి

కొడవలూరు, ఏప్రిల్ 27: ఐదేళ్ల వైసీపీ పాలనలో గ్రామాలలో ఎక్కడ చూసినా సమస్యలు స్వాగతం పలుకుతున్నాయని, గ్రామీణ ప్రాం తాలు పట్టణాలకు దీటుగా అభివృద్ధి చెందాలంటే టీడీపీతోనే సాధ్యమని కూటమి శాసనసభ అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. మండలంలో గుండాలమ్మపాలెం, పద్మనాభసత్రం గ్రామాల్లో శనివారం ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఆమెకు ప్రజలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నియోజకవర్గంలో అరాచకపు శక్తుల ఆంక్షలు, బెదిరింపులను లెక్క చేయకుండా మండుటెండలో సైతం ప్రజలు తనపై చూపుతున్న ఆదరాభిమానాలకు ఆనందంగా ఉందన్నారు.

కొడవలూరు నుండి గుండాలమ్మపాళెంకు రోడ్డు అధ్వానంగా ఉందని ఈమధ్యలో సీసీరోడ్డు నిర్మిస్తామన్నారు. డ్రైనేజి వ్యవస్థ దారుణంగా ఉందని, సైడు కాలువలు నిర్మిస్తామని, శ్మశానం ఏర్పాటు చేస్తామన్నారు. ముఖ్యంగా టీడీపీ ప్రభుత్వంలో కట్టిన పక్కా ఇళ్లకు బిల్లులు చెల్లించ కుండా పేదలపై కక్షసాధింపు చర్యలు చేపట్టారని, టీడీపీ అధికారంలోకి రాగానే పక్కాగృహలు కట్టించి వారిని ఆదుకుంటామని హామీ ఇచ్చారు. పేదలు ఆర్థికంగా బలోపేతం కావాలంటే టీడీపీ అధికారం చేపట్టాలన్నారు. బాబు ష్యూరిటీ - భవిష్యత్‌కు గ్యారెంటీ పథకాలతో మహిళలు, వృద్ధులు, యువత, అన్ని రంగాల ప్రజలు అభివృద్ధి చెందనున్నారన్నారు. ప్రజలకు సేవచేయడమే తమ లక్ష్యమని, తనను ఎమ్మెల్యేగా, ఎంపీగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమాన్ని కెవిఆర్ విజయ పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు కోటం రెడ్డి దివ్యరెడ్డి, కె కృష్ణ, టీడీపీ నాయకులు కోటంరెడ్డి అమరేంద్రరెడ్డి, పల్లంరెడ్డి సురేష్‌రెడ్డి, కోటంరెడ్డి దివ్యరెడ్డి, పల్లంరెడ్డి సాయిమోహన్‌రెడ్డి, జోన్న శివకుమార్, జి శేఖర్‌రెడ్డి, కె కృష్ణ, సతీష్‌రెడ్డి, సురేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే మహిళాభివృద్ధి : నీలిమారెడ్డి

ఇందుకూరుపేట: తెలుగుదేశం పార్టీతోనే మహిళాభివృద్ధి అని ప్రశాంతిరెడ్డి కుమార్తె నీలిమారెడ్డి అన్నారు. మండలంలోని సట్టివారి కండ్రిగ కొత్తూరు, చింతోపులో శనివారం ఇంటింటికీ తిరిగి కరపత్రా లను పంపిణీచేసి బాబు ష్యూరిటీ - భవిష్యత్తు గ్యారెంటీ పథకాలను ప్రజలకు వివరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి మహిళా సాధికారత, సంక్షేమానికి కృషి చేసిందన్నారు. డ్వాక్రా సంఘాలు తెలుగుదేశం ప్రభుత్వ హయాంలోనే ఏర్పడ్డాయని తెలిపారు. వైసీపీ ప్రభుత్వంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని, దిశా చట్టం కాగితాలకే పరిమితమైందన్నారు. రాబోవు సార్వత్రిక ఎన్నికల్లో వేమిరెడ్డి దంపతులను ఆశీర్వదించాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో కైలాసం ఆదిశేషారెడ్డి, రావెళ్ల వీరేంద్రచౌదరి, మునగాల రంగారావు, రామచంద్రయ్య, బీజేపీ నాయకులు కైలాసం లావణ్య శ్రీనివాస్‌రెడ్డి దంపతులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతిరెడ్డికి లక్ష ఓట్ల మెజారిటీ తథ్యం : నాపా

కొడవలూరు: సార్వత్రిక ఎన్నికలలో కూటమి శాసనసభ అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి లక్ష ఓట్ల మెజారిటీతో గెలవనున్నదని టీడీపీ సీనియర్ నాయకుడు నాపా వెంకటేశ్వర్లు నాయుడు అన్నారు. మండలంలో కమ్మపాళెం గ్రామంలో నియోజకవర్గ కమ్మ సామాజిక వర్గంకు సంబంధించి శనివారం నాపా వెంకటేశ్వర్లు నాయుడు ఆధ్వరంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో వేమిరెడ్డి దంపతుల గెలుపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. సమాజ సేవే లక్ష్యంగా రాజకీయాలలోకి వచ్చిన వేమిరెడ్డి దంపతులపై వైసీపీ నాయకులు ఓటమి భయంతో చేస్తున్న అసత్య ఆరోపణలను ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. వైసీపీని ఇంటికి సాగనం పేందుకు ప్రజలు ఎదురుచూస్తున్నారన్నారు. గత ప్రభుత్వంలో చేసిన అభివృద్ధి తప్ప ఎక్కడా అభివృద్ధి జరగలేదన్నారు. ప్రజలు అభివృద్ధికి పట్టం కట్టాలని, వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిని ఎమ్మెల్యేగా, వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని ఎంపీగా ఆశీర్వదించాలని కోరారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకుల కె కిషోర్ నాయుడు, బోల్ల సతీష్ నాయుడు, నాపా బాలకృష్ణ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

కోవూరు కాలనీల్లో ఇంటింటి ప్రచారం

కోవూరు: టీడీపీ పార్లమెంటు అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, అసెంబ్లీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిని గెలిపించాలని కోరుతూ రైతు నాయకుడు పచ్చిపాల విజయసాయిరెడ్డి శనివారం కోవూరు పట్టణ పరిధిలోని కాలనీల్లో ఇంటింటి ప్రచారం చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల సంక్షేమానికి టీడీపీ కృషి చేస్తుందన్నారు. పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా పనిచేస్తున్న చంద్రబాబునాయుడిని ముఖ్యమంత్రిగా ఎన్నుకోవాల్సి ఉందన్నారు. ఎన్ఎస్ఆర్ కాలనీ, ఎన్వీకేఆర్ కాలనీల్లో సాగిన ప్రచారంలో టీడీపీ నాయకులు గోధుమ సుధీర్, డీ శ్రీనివాసులు, పచ్చినీల వెంకటేశ్వర్లు, పెద్దసంఖ్యలో మహిళా కార్యకర్తలు పాల్గొన్నారు.



ఇందుకూరుపేట: ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న ప్రశాంతిరెడ్డి కుమార్తె నీలిమారెడ్డి



కోవూరు: ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న రైతు నాయకుడు పచ్చిపాల విజయసాయిరెడ్డి

ఎన్నికల పర్వం

నేడు నగరంలో చంద్రబాబు పర్యటన

● ముస్లింల ఆత్మీయ సదస్సుకు రాక : నారాయణ

నెల్లూరు (విద్య), ఏప్రిల్ 27 : ఎన్నికల ప్రచారంలో భాగంగా మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదివారం నెల్లూరులో పర్యటించనున్నారని మాజీ మంత్రి, టీడీపీ నెల్లూరు నగర అభ్యర్థి పొంగూరు నారాయణ తెలిపారు. నగరంలోని కోటమిట్ట షాదీ మంజిల్‌లో ఏర్పాటు చేయనున్న ముస్లిం మైనార్టీల ఆత్మీయ సదస్సుకు చంద్రబాబు నాయుడు హాజరవుతున్నారన్నారు. ఈ క్రమంలో షాదీ మంజిల్‌లో ఏర్పాట్లను శనివారం పరిశీలించారు. సమష్టి కృషితో చంద్రబాబు పర్యటనను విజయ వంతం చేద్దామని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ సదస్సులో ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, టీడీపీ అగ్ర నేతలు కూడా పాల్గొంటారని తెలిపారు. నగరంలోని అన్ని డివిజన్ల నుంచి పెద్ద ఎత్తున ముస్లింలు హాజరవుతున్నారని, ఎవరికీ ఇబ్బందులు కలు గకుండా ఏర్పాట్లు చేయాలని నాయకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నెల్లూరు పార్లమెంటు నియోజకవర్గ అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్, డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్, నారాయణ విద్యాసంస్థల జీఎం వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


షాదీ మంజిల్‌లో ఏర్పాట్లను పరిశీలిస్తున్న నారాయణ

నందమూరి బాలకృష్ణతో నేతల భేటీ

హిందూపురం ఎమ్మెల్యే, సినీ నటుడు నందమూరి బాలకృష్ణతో మాజీ మంత్రి, నగర టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పొంగూరు నారాయణ, ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి శనివారం మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. స్వర్ణాంధ్ర సాధికారత యాత్రలో భాగంగా నెల్లూరులో పర్యటించిన బాలకృష్ణ నగరంలోని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి నివాసంలో శుక్రవారం రాత్రి బస చేశారు. ఈ సందర్భంగా శనివారం బాలయ్యతో భేటీ అయిన నారాయణ, వీపీఆర్ పలు రాజకీయ అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర పాల్గొన్నారు.

స్ట్రాంగ్ రూముల్లో సీసీ కెమెరాల నిఘా ఉండాలి

● కలెక్టర్ హరినారాయణన్

నెల్లూరు రూరల్, ఏప్రిల్ 27 : ఎన్నికల అనంతరం ఈవీఎంలను భద్రపరిచే స్ట్రాంగ్ రూముల వద్ద సీసీ కెమెరాల నిఘా నిరంతరం కొనసాగే విధంగా అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను కలెక్టర్ హరి నారాయణన్ ఆదేశించారు. నెల్లూరు రూరల్లోని కనుపర్తిపాడు వద్దనున్న ప్రియదర్శిని కళాశాలలో ఏర్పాటు చేస్తున్న స్ట్రాంగ్ రూములను ఆయన శనివారం పరిశీలించారు. అక్కడ తీసుకుంటున్న జాగ్రత్తలపై అధికారులను ప్రశ్నించారు. ఈవీఎంలను భద్రపరిచే గదులతోపాటు, ఓట్లు లెక్కించే కేంద్రాలను పరిశీలించారు. యంత్రాంగానికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ ఆరీఫ్ హఫీజ్, కమిషనర్ వికాస్ మర్మత్, ఎన్నికల పరిశీలకులు పాల్గొన్నారు.

మూడురెక్కల ఫ్యాను ముక్కలవడం ఖాయం

నెల్లూరు(క్రైం), ఏప్రిల్ 27: టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల కలయికతో మూడు రెక్కల వైసీపీ ఫ్యాన్ ముక్కలవడం గ్యారెంటీ అని బీజేపీ రాష్ట్ర నాయకుడు మస్తానయ్య గౌడ్ అన్నారు. నగరంలోని ఆయన కార్యాలయంలో శనివారం విలేకర్లతో మాట్లాడారు. ఆంధ్ర రాష్ట్రం పూర్వ వైభవాన్ని పొందాలంటే రాష్ట్ర ప్రజలు బీజేపీ, తెలుగుదేశం, జనసేన పార్టీ కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు.

జగనూ.. మేమేం పాపం చేశాం?

నెల్లూరు (సాంస్కృతికం): రాష్ట్రంలోని ఐదు లక్షల మంది విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగులకు రావలసిన డీఏ, పీఆర్సీ బకాయిలు ఐదేళ్లుగా చెల్లించడం లేదు. జగన్... మేమేం పాపం చేశామని బకాయిలు చెల్లించడం లేదంటూ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం ఉపాధ్యక్షుడు షేక్ ఖాసిం ముఖ్య మంత్రిని ఓ ప్రకటనలో ప్రశ్నించారు. ఎన్నికల వేళ ఉద్యోగులను మంచి చేసుకునేందుకు వారికి రావాల్సిన సరెండర్ లీవుల బకాయిలు కొంతైనా చెల్లించారని, అది సంతోషకరమే అయినా.. జీవిత చరమాంకంలో అనారోగ్యాలతో అల్లాడు తున్న విశ్రాంత ఉద్యోగులపై కనికరం చూపడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. విశ్రాంత ఉద్యోగులకు ప్రభుత్వం నుంచి ఒక్కొక్కరికి కనీసం రూ.1లక్ష నుంచి 5లక్షల వరకు బకాయిలు రావాల్సి ఉందన్నారు. ఎన్నికల సందర్భంగా మాకు రావాల్సిన బకాయిల్లో కనీసం రూ.1లక్ష పెన్షన్ ఖాతాకు జమచేయాలని విజ్ఞప్తి చేశారు.

టీడీపీ ప్రభుత్వంతోనే మహిళా సాధికారత

● కేతంరెడ్డి వినోద్ రెడ్డి

నెల్లూరు (విద్య), ఏప్రిల్ 27 : తెలుగుదేశం పార్టీ ప్రభుత్వంతోనే మహిళా సాధికారిత సాధ్యమవుతుందని టీడీపీ నాయకుడు కేతంరెడ్డి వినోద్‌రెడ్డి అన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, పొంగూరు నారాయణకు మద్దతుగా శనివారం ఆయన 42వ డివిజన్‌లో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. పొదుపు సంఘాల వ్యవస్థను రాష్ట్రంలో ప్రవేశపెట్టింది టీడీపీ ప్రభుత్వమేనన్నారు. మహిళలకు పావలా వడ్డీకే రుణాలు, సబ్సిడీ రుణాలు, స్వయం ఉపాధి శిక్షణ వంటివి గతంలో టీడీపీ ప్రభుత్వం చేసిందన్నారు. వైసీపీ ప్రభుత్వం వచ్చిన నాటి నుంచి ఏ రూపంలో నిధులు దోచుకుందామా అన్న ఆలోచన తప్ప మహిళలకు చేసిందేమీ లేదని విమర్శించారు. త్వరలో రానున్న కూటమి ప్రభుత్వంలో మహిళలకు పెద్దపీట వేస్తారన్నారు. తల్లికి వందనం, ఆడబిడ్డ నిధి, ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం వంటి పథకాలు అమలవుతాయని తెలిపారు. రానున్న ఎన్నికల్లో మహిళలంతా అండగా నిలిచి ఎంపీగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని, నగర ఎమ్మెల్యేగా పొంగూరు నారాయణను గెలిపించాలని కోరారు.


ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న కేతంరెడ్డి

మొండి గోడలే అభివృద్ధి!

సగం పిల్లర్లతోనే ఆగిపోయిన పెద్ద మసీదు పనులు



● బారాషహీద్ దర్గాపై వైసీపీ నిర్లక్ష్యం ● ముందుకు సాగని నిర్మాణ పనులు
● ఏటా లక్షల మందితో రొట్టెల పండుగ ● మౌలిక వసతుల కల్పనలో ఉదాసీనత
● పెద్ద మసీదుకు గత ప్రభుత్వంలో రూ.15 కోట్లు మంజూరు ● జగన్ వచ్చాక పిల్లర్లకే పరిమితం

నెల్లూరు (సాంస్కృతికం), ఏప్రిల్ 27 : జిల్లాకే తలమానికమైన బారాషహీద్ దర్గా అభివృద్ధి వైసీపీ పాలనలో మొండి గోడలకే పరిమితమైంది. స్వర్ణాల చెరువు తీరాన ఉన్న ఈ దర్గాలో ప్రతి సంవత్సరం రొట్టెల పండుగ వైభవంగా జరుగుతుంది. మత సామరస్యానికి ప్రతీకగా జరిగే ఈ రాష్ట్ర పండుగకు దేశ విదేశాల నుంచి లక్షలాది మంది తరలివస్తారు. ఇంతటి ప్రాముఖ్యత కలిగిన దర్గాలో అభివృద్ధి పనులు గడిచిన ఐదేళ్లుగా పడకేశాయి. తెలుగు దేశం పార్టీ ప్రభుత్వం హయాంలో చేపట్టిన పనులు కూడా పూర్తి చేయలేదు. 2014 నుంచి 2019 వరకు టీడీపీ హయాంలో మున్సిపల్ శాఖా మంత్రిగా పొంగూరు నారాయణ బారాషహీద్ దర్గాలో అభివృద్ధిని పరుగులు పెట్టించారు. అంతర్గత రోడ్లు, ఫుట్‌పాత్‌లు, గ్రీనరీ, చిల్డ్రన్స్‌పార్కు అభివృద్ధి, స్వర్ణాల చెరువు ఘాట్ నిర్మాణం వంటి పనులతోపాటు శాశ్వత మరుగుదొడ్లు, యాత్రికుల విడిదికి తాలింఖానా వంటివి ఏర్పాటు చేశారు.


మొండిగోడలతో స్వాగత ద్వారం,

● ముందుకు కదలని మసీదు

బారాషహీద్ దర్గా మైదానంలో ముస్లింలు ప్రార్థనలు చేసుకునేం దుకు టీడీపీ ప్రభుత్వంలో పూర్తి మౌలిక సదుపాయాలతో పెద్ద మసీదు నిర్మాణ పనులు చేపట్టారు. దీని కోసం రూ.15కోట్ల నిధులు మంజూరు చేశారు. 2019 ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వం రావడంతో మసీదు నిర్మాణం పిల్లర్లకే పరిమితమైంది. ఇప్పటికీ మసీదు నిర్మాణం పూర్తికాలేదు. ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి రూ.కోటితో ఈద్గా నిర్మాణం చేయించారు. అలాగే మసీదు నిర్మాణం, బారాషహీద్ దర్గా విస్తరణతోపాటు భక్తుల వసతి, గృహనిర్మాణాలకు దాదాపు రూ.17కోట్ల నిధులు మంజూరు చేయించారు. నుడా నిధులు రూ.కోటితో దర్గాకు రెండు ప్రవేశద్వారాల నిర్మాణాలకు శ్రీకారం చుట్టారు. మంజూరైన నిధులకు ఆర్థిక శాఖ అనుమతులు రాకపో వడం తో కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ప్రభుత్వంపై ఒత్తిడి చేశారు. ఆ తర్వాత ఆయన వైసీపీ నుంచి దూరమవడంతో రూరల్ నియోజక వర్గం ఇన్‌చార్జిగా ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డిని నియమించారు. ఆదాల బాధ్యతలు స్వీకరించిన వారం రోజుల తర్వాత దర్గా అభివృ ద్ధికి మంజూరైన రూ.17కోట్ల నిధులకు ఆర్థిక శాఖ అనుమతులు లభించాయని ప్రకటించారు. ఇది జరిగి ఏడాదిపైనే అయినా ఒక్క రూపాయి కూడా నిధులు విడుదల కాలేదు. స్వాగత ద్వారాల నిర్మాణం చేపట్టిన కాంట్రాక్టరు బిల్లులు మంజూరు కాకపోవడంతో పనులు నిలిపివేశారు. దీంతో ప్రవేశ ద్వారాల వద్ద మొండిగోడలు వెక్కిరిస్తున్నాయి. ఇదేవిధంగా యాత్రికుల వసతి గృహ నిర్మాణం పనులకు నిధులు మంజూరు కాకపోవడంతో వాటిని అసంపూర్తిగా వదిలేశారు. మాజీ మంత్రి నారాయణ దర్గా ప్రాంగణంలో సెంట్రల్ లైటింగ్‌తో రోడ్లు, ప్లాట్‌ఫా రంలు, డివైడర్‌లలో పచ్చదనం కోసం చెట్లు వేయించారు. ప్రస్తుతం ఆ పచ్చదనం పరిరక్షించే వారు లేక ఎండిపోతోంది.


బారాషహీద్ దర్గా ప్రాంగణంలో చెత్తకుప్పలు

రాములోరికి పుష్పయాగం

● అలరించిన నృత్య ప్రదర్శనలు


శబరి శ్రీరామక్షేత్రంలో పుష్పయాగం చేస్తున్న అర్చకులు

నెల్లూరు (సాంస్కృతికం), ఏప్రిల్ 27 : నగరంలోని శబరి శ్రీరామ క్షేత్రంలో వార్షిక బ్రహ్మోత్సవాల ముగింపు సందర్భంగా శనివారం రాత్రి సీతారాములకు పుష్పయాగం వైభవం గా జరిగింది. ఉదయం ఉక్తహోమాలు జరిగాయి. సాయంత్రం అర్చకుడు నరేష్‌స్వామి ఆధ్వ ర్యంలో ఓం నమో భగవతే వాసుదేవాయ అనే ద్వాదశాక్షర విధానంలో 12 రకాల సుగంధ పుష్పాలతో యాగం చేశారు. శ్రీమీనాక్షి నృత్యాలయం విద్యార్థుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అనంతరం పల్లకిసేవ జరిగింది. ఉభయకర్తలుగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ప్రశాంతిరెడ్డి వ్యవహరించారు. ఆలయ కమిటీ పర్యవేక్షించింది.

● మూలాపేటలోని రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాల్లో పొన్న వాహనంపై నగరోత్సవం వైభవంగా జరిగింది. ఉదయం ముసుగుల సేవ భక్తులకు కనువిందు చేసింది.

● ఉస్మాన్‌సాహెబ్‌పేట కోదండరామస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో శనివారం రాత్రి గజవాహన సేవ జరిగింది. ఉదయం తీర్థవాది ఉత్సవం, శ్రీరామపట్టాభిషేకం జరిగాయి.

● సంతపేట ఆంజనేయ స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు శనివారంతో ముగిశాయి. చివరి రోజు ఉదయం స్వామివారికి విశేష అభిషేకాలు, పూజలు జరిగాయి. పూలంగిసేవ ఆకట్టుకుంది. రాత్రి దవనోత్సవం, పల్లకీసేవ జరిగాయి. ధర్మకర్తలు, ఉభయకర్తలు, ఈవో దుర్గయ్య పర్యవేక్షించారు.


పొన్న వాహనంపై వేణుగోపాల స్వామి

ధరల పెంపుతో ప్రజల నడ్డివిరిచిన వైసీపీ

నెల్లూరు రూరల్ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి

నెల్లూరు రూరల్, ఏప్రిల్ 27 : నిత్యావసర సరుకుల ధరలపై అదుపుకోల్పోయిన వైసీపీ ప్రభుత్వం పేద, నిరుపేద, మధ్యతరగతి ప్రజల నడ్డివిరిచిందని నెల్లూరు రూరల్ టీడీపీ అభ్యర్థి కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి జగన్ సర్కారుపై ధ్వజమెత్తారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం 41వ డివిజన్‌లో రోడ్‌షో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి నిత్యం అవసరమైన సరుకుల ధరలను పెంచుకుంటూ పోయారని విమర్శించారు. టీడీపీ ప్రభుత్వంలో జేబు నిండా డబ్బు తీసుకెళ్తే సంచి నిండా సరుకులు వచ్చేవని, కానీ జగన్ అధికారంలోకి వచ్చాక సంచి నిండా డబ్బులు తీసుకెళ్లినా జేబు నిండా కూడా సరుకులు రావడం లేదని దుయ్యబట్టారు. పేద ప్రజలు అటు ఉపాధి అవకాశాలకు దూరమై, ఇటు పెరిగిన ధరలతో జీవించలేక పక్క రాష్ట్రాలకు వలసెల్లిపోతున్నారన్నారు. ఇవన్నీ నియంత్రణలోకి రావాలంటే రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వం ఏర్పడి చంద్రబాబు సీఎం కావాలన్నారు. ప్రజలంతా సైకిల్ గుర్తుకు ఓటేయాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం నెల్లూరులోని తన కార్యాలయంలో మండలానికి చెందిన సౌత్‌మోపూరు గ్రామం మొగళ్లపాళెం నుంచి బిరదోలు తిరుపతి, నాగార్జున, బాలచంద్ర, చంద్రశేఖర్, నగరంలోని 20వ డివిజన్ నుంచి చెన్నారెడ్డి, ద్వారకానాథ్, సాంబయ్యను కండువా కప్పి తెలుగుదేశం పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమాలలో మాజీ మేయర్ భానుశ్రీ, టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


టీడీపీ ప్రచారంలో కార్యకర్తలు, ప్రజలు (పైన) ప్రజలకు అభివాదం చేస్తున్న రూరల్ అభ్యర్థి శ్రీధర్‌రెడ్డి

డీకేడబ్ల్యూ కళాశాలలో సర్టిఫికెట్ కోర్సులు

నెల్లూరు (విద్య), ఏప్రిల్ 27 : నగరంలోని డీకే ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో పలు రకాల సర్టిఫికెట్ కోర్సులు నిర్వహిస్తున్నామని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డీ గిరి తెలిపారు. శనివారం కళాశాలలో ఆయన మాట్లాడుతూ వృక్షశాస్త్ర విభాగంలో 30 మంది, పుట్ట గొడుగులు అనే అంశంపై 20 మంది విద్యార్థినులు సర్టిఫికెట్ కోర్సులను పూర్తి చేశారన్నారు. విద్యార్థినుల్లో నైపుణ్యాలను పెంపొందించుకునేందుకు ఈ కోర్సులు ఎంతో దోహదం చేస్తాయ ని చెప్పారు. కోర్సులు పూర్తయిన వారు స్టార్టప్‌ను కూడా ప్రారంభించుకోవచ్చని తెలిపారు. అనంతరం విద్యార్థినులకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఏ రమణరావు, వృక్షశాస్త్ర విభాగం అధిపతి డాక్టర్ బీ రాజరాజేశ్వరి, అధ్యాపకుడు డాక్టర్ ఎం ఉమాశంకర్‌రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

యువత ఉజ్వల భవితే టీడీపీ లక్ష్యం

● మాజీ మంత్రి పొంగూరు నారాయణ

నెల్లూరు (విద్య), ఏప్రిల్ 27 : రాష్ట్రంలోని యువత ఉజ్వల భవిష్యత్తే తెలుగుదేశం పార్టీ ప్రధాన లక్ష్యమని మాజీ మంత్రి, నగర టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పొంగూరు నారాయణ తెలిపారు. ఆయన శనివారం నగరంలోని 44వ డివిజన్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు యువత భవితకే అత్యధిక ప్రాధాన్యతనిస్తారని, దీనికోసంగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారన్నారు. వైసీపీ ప్రభుత్వంలో పరిశ్రమలు ఏర్పాటు చేయకపోవడం, ఉద్యోగావకాశాలు లేకపోవడంతో యువత తీవ్ర నిరుత్సాహంతో ఉందని చెప్పారు. ఐదేళ్లుగా రాష్ట్రంలో ఆదాయ వనరులు పెంచకపోగా రూ.13లక్షల కోట్లు అప్పులు తెచ్చిన వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని ఆర్థికంగా దెబ్బతీసిందని విమర్శించారు. రానున్న ఎన్నికలతో టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ సమస్యలన్నింటికీ పరిష్కారం లభిస్తుందని, రాష్ట్రాభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యమవుతుందని తెలిపారు. మే 13న జరిగే ఎన్నికల్లో తనను ఎమ్మెల్యేగా, వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని ఎంపీగా గెలిపించాలని కోరారు.

● టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే చంద్రబాబు నాయుడు తొలి సంతకం మెగా డీఎస్సీపైనే పెడతారని పొంగూరు నారాయణ సతీమణి రమాదేవి తెలిపారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం ఆమె నగరంలోని 13, 48 డివిజన్లలో పర్యటించారు. ఏ ప్రాంతానికి వెళ్లినా యువత తల్లిదండ్రులు తమ బిడ్డలకు ఉపాధి, ఉద్యోగావకాశాలు లేవని ఆవేదన వ్యక్తం చేస్తున్నారన్నారు. గడిచిన ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వంలో తమ బిడ్డలకు ఉద్యోగాలు రాలేదని, డీఎస్సీ విషయంలోనూ నమ్మించి మోసం చేశారని చెబుతున్నారన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంట నే తొలుత మెగా డీఎస్సీని ప్రకటించడంతోపాటు పరిశ్రమలను తీసుకువచ్చి యువత అందరికీ ఉద్యోగావకాశాలు కల్పిస్తారని తెలిపారు. యువత ఉద్యోగంలో చేరే వరకు నెలకు రూ.3వేలు నిరుద్యోగ భృతిని అందించి వారిలో ఆత్మస్థైర్యాన్ని నింపుతారన్నారు. ప్రజలు, యువత టీడీపీకి అండగా ఉండి రానున్న ఎన్నికల్లో నగర ఎమ్మెల్యేగా నారాయణను, నెల్లూరు ఎంపీగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కాగా, 11వ డివిజన్‌లో నారాయణ కుమార్తె శరణి ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

టీడీపీలో చేరికలు : పొంగూరు నారాయణ సమక్షంలో వైసీపీకి చెందిన పలువురు నేతలు, కార్యకర్తలు తెలుగుదేశం పార్టీలో చేరారు. నగరంలోని గోమతినగర్‌లో గల నారాయణ క్యాంపు కార్యాలయంలో టీడీపీ నెల్లూరు పార్లమెంటు నియోజకవర్గ అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్ ఆధ్వర్యంలో పార్టీలో చేరిన వారికి నారాయణ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. చంద్రబాబునాయుడు నాయకత్వంలోనే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందన్న నమ్మకంతో ప్రజలు టీడీపీలో చేరడం శుభపరిణామమన్నారు. అందరూ కష్టపడి టీడీపీలోని అధికారంలోకి తీసుకురావాలని కోరారు.


ఎన్నికల ప్రచారంలో యువతితో మాట్లాడుతున్న పొంగూరు రమాదేవి


ఎన్నికల ప్రచారంలో ఓటరుతో నారాయణ కరచాలనం

వడదెబ్బ తగలకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేయండి

● డీఎంహెచ్‌వో పెంచలయ్య

నెల్లూరు(వైద్యం), ఏప్రిల్ 27 : జిల్లాలో ఎండ తీవ్రత చాలా ఎక్కువగా ఉందని, దీన్ని దృష్టిలో పెట్టుకుని ప్రజలు వడదెబ్బకు గురికాకుండా తగిన ఏర్పాట్లు చేయాలని డీఎంహెచ్‌వో డాక్టర్ పెంచలయ్య అధికారులను ఆదేశించారు. శనివారం నగరంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి, కిమ్స్, మెడికవర్, నారాయణ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులను ఆయన పరిశీలించారు. వేసవి తీవ్రత వల్ల వడదెబ్బకు గురయ్యే వారికి ఆయా ఆసుపత్రుల్లో చేసిన ఏర్పాట్లను పరిశీలించారు. వైద్యాధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సంద ర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ వేసవి తీవ్రత జూన్ వరకు ఉంటుందన్నారు. ఉదయం 11 తర్వాత సాయంత్రం 4 గంటల వరకు బయటకు రావొద్దని ప్రజలను కోరారు. అత్యవసరమైతే ఒదులుగా ఉన్న దుస్తులు, గొడుగు, నీళ్ల బాటిలు దగ్గర ఉంచుకుని బయటకు రావాలని సూచించారు. రైల్వేస్టేషన్, బస్టాండ్లలో ఓఆర్ఎస్ పాకెట్లను అందుబాటులో ఉంచామన్నారు. ఏఎన్ఎం, ఆశాల వద్ద కూడా ఓఆర్ఎస్ ప్యాకెట్లు తీసుకోవచ్చని తెలిపారు. అన్ని పీహెచ్‌సీలలో వడదెబ్బ బాధితులకు చికిత్సలు అందిస్తారన్నారు. వడదెబ్బ నిఘా అధికారి డాక్టర్ భా స్కర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్ర మంలో జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ సిద్ధానాయక్, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ మస్తాన్‌బాషా, ప్రభుత్వ వైద్య కళాశాల అదనపు ప్రిన్సిపాల్ డాక్టర్ నరేంద్ర, డాక్టర్ సుధీర్ పాల్గొన్నారు.


జీజీహెచ్‌లో ఏర్పాట్లను పరిశీలిస్తున్న వైద్య బృందం

బాలయ్య రోడ్‌షో సూపర్‌హిట్

- ఈలలు, కేరింతల మధ్య రాపూరు, గూడూరు సభలు





గూడూరులో బాలకృష్ణకు నిమ్మమాలతో స్వాగతం



రాపూరు సభలో బాలయ్య అభివాదం

వెంకటగిరి/డక్కిలి/గూడూరు, ఏప్రిల్ 27: స్వర్ణాంధ్ర సాకారయాత్రలో భాగంగా సినీ హీరో, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ రాపూరు, గూడూరు పర్యటన విజయవంత మైంది.శనివారం సాయంత్రం రాపూరులో నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో ఆయన ప్రసంగం ఆద్యంతం జనాలను హుషారెత్తించేలా సాగింది.బందోబస్తులో ఉన్న పోలీసుల వైపు చూసి 'ఏమ్మా.. మీకు టీఏలూ, డీఏలూ, సెలవులు, అలవెన్సులు ఇస్తున్నారా?.. కనీసం జీతాలైనా సక్రమంగా ఇస్తున్నారా ..? ' అని ప్రశ్నించారు. వారు మౌనంగా వుండిపోవడంతో 'ఎందుకమ్మా మీకు.. ఈ బానిస బతుకులు... ఉంటే రౌడీ ఇన్‌స్పెక్టర్‌లా ఉండండి.వ్యవస్థలన్నింటినీ నాశనం చేశాడు జగన్ పిచ్చోడు. ఇంకా ఎందుకు ఊడిగం చేస్తారు' అని ప్రశ్నించారు.మాట్లాడితే సిద్ధం అంటున్నాడు జగన్ . ఆయన దేనికి సిద్ధం... ? తల్లిని, చెల్లిని గెంటేసేందుకు సిద్ధమా? సొంత బాబాయిని హత్య చేసిన నిందితులను కాపాడేందుకు సిద్ధమా.. యువతకు ఉద్యోగాలు ఇస్తామని మోసం చేసేందుకు సిద్ధమా ? అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లో సీపీఎస్ రద్దు చేస్తానని ఉద్యోగులను మోసం చేసినందుకా.. ఎందుకు సిద్ధమో తేల్చాలన్నారు. అధికార మదంతో రూ. 16 వందల కోట్ల ప్రజాధనాన్ని సిద్ధం సిద్ధం.. అంటూ బోర్డులకు ఖర్చు పెట్టారని బాలకృష్ణ ఆరోపించారు. ఇక్కడ పసుపు దండు కదిలితే అక్కడ జగన్ గుండె దడదడా కొట్టుకుంటుందన్నారు. జగన్‌కు పిచ్చి బాగా ముదిరిందని ప్రజలు ఎన్నికల్లో ఆ పిచ్చిని దించాలన్నారు. రాష్ట్రంలో రాక్షస పాలన పోవాలంటే ఎన్డీయే కూటమి విజయంతోనే సాధ్యమన్నారు. ప్రజలు తమ ఓటు అనే ఆయుధంతో జగన్‌ను తరిమికొట్టాలన్నా రు.ప్రచారరథంపై పక్కనున్న అభ్యర్థులను చూపిస్తూ రానున్న ఎన్నికల్లో వెంకటగిరి టీడీపీ అభ్యర్థి కురుగొండ్ల రామకృష్ణను, తిరుపతి ఎంపీగా బీజేపీ అభ్యర్థి వరప్రసాద్‌ను గెలిపించాలని కోరారు.టీడీపీ తిరుపతి పార్లమెంటు అధ్యక్షుడు నరసింహయాదవ్, అధికార ప్రతినిధి శ్రీధర్‌వర్మ, పార్టీ నాయకులు దందోలు వెంకటేశ్వర రెడ్డి, రాఘవరెడ్డి, కోటేశ్వరరావు, కేఎంకే ప్రసాద్‌నాయుడు, అవ్వారు సత్యం, గంగాధర్,కాసా శ్రీనివాసులు నాయుడు, తదితరులు పాల్గొన్నారు.అనంతరం బయల్దేరి గూడూరుకు చేరుకున్న బాలకృష్ణ కోర్టుసెంటర్ నుంచి ర్యాలీగా బయల్దేరారు.టీడీపీ అభ్యర్థి పాశం సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో బాలకృష్ణకు నిమ్మకాయలతో చేసిన గజమాలతో ఘనస్వాగతం పలికారు. అక్కడినుంచి కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు, బాలకృష్ణ అభిమానులు బైక్‌ర్యాలీ చేపట్టారు. రోడ్డుకిరువైపులా అభిమానంతో ఎదురుచూస్తున్న జనానికి బాలయ్య కూడా చిరునవ్వులు చిందిస్తూ అభివాదం చేశారు. అండర్‌బ్రిడ్జి మీదుగా వివేకానంద రోడ్డు, రైల్వేస్టేషన్‌రోడ్డు మీదుగా టవర్‌క్లాక్ సెంటర్‌కు ర్యాలీ ఉత్సాహంగా సాగింది. టవర్‌క్లాక్ సెంటర్ వద్ద నిర్వహించిన సభలో బాలయ్య ప్రసంగం జనాన్ని ఉర్రూతలూగించింది.లెజెండ్ సినిమాలో మహిళాశక్తిని పొగుడుతూ బాలయ్య చెప్పిన డైలాగ్ ఇక్కడ చెప్పడంతో జనాలు చప్పట్లతో హోరెత్తించారు. జగన్ అరాచక పాలన గురించి బాలయ్య తనదైన శైలిలో గుక్కతిప్పుకోకుండా డైలాగులు చెప్పడంతో కేరింతలు కొట్టారు. దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ, జనాల సమస్యలను పరిష్కరించడం కోసం పరితపించే జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్, రాష్ట్రాభివృద్ధిని కాంక్షించే చంద్రబాబుల కలయిక అరాచక జగన్ పాలనను అంతమొందిస్తుందన్నారు.టీడీపీ అభ్యర్థి పాశం సునీల్‌కుమార్, బీజేపీ అభ్యర్థి వరప్రసాదరావును గెలిపించాలని బాలయ్య కోరారు.

రాపూరు సభకు హాజరైన జనం



కవ్విస్తున్న వైసీపీ

- జనసేన అభ్యర్థి ప్రచారానికి అడ్డంకులు
- కయ్యానికి కాలుదువ్వుతున్న వైసీపీ శ్రేణులు



ఎస్వీ హైస్కూల్ సమీపంలో శనివారం ఉదయం జనసేన ప్రచారాన్ని అడ్డుకున్న వైసీపీ శ్రేణులు







ఎన్డీఏ కూటమి పార్టీల కార్యకర్తలపై వైసీపీ శ్రేణుల ముష్టిఘాతాలు

తిరుపతి, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : తిరుపతిలో 2019 వరకు ఒకటి, రెండు సమస్యాత్మక ప్రాంతాల్లో తప్ప మిగిలిన చోట్ల ప్రశాంతంగా ఎన్నికలు జరిగేవి. ఆ తర్వాత పరిస్థితి పూర్తిగా మారిపోయింది. తిరుపతిలో ఎన్నికలంటేనే సగటు ఓటరుకు వెగటు, భయం పుట్టేలా పరిస్థితిని మార్చేశారు. వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటినుంచి జరిగిన ఎన్నికలన్నీ గొడవలు, రాళ్లదాడులు, దొంగ ఓటర్లను అడ్డుకోవడం వంటి సంఘటనల నడుమ ఉద్రిక్త వాతావరణమే కనిపించింది. స్థానిక సంస్థల ఎన్నికలు మొదలుకుని ఎంపీ ఉప ఎన్నిక, టౌన్‌బ్యాంకు, ఎమ్మెల్సీ ఎన్నికలు ఏ విధంగా జరిగాయో దేశం మొత్తం చూసింది. అలాంటి వాతావరణానికి అలవాటుపడి పైచేయిగా నిలిచిన వైసీపీ శ్రేణులు ప్రస్తుత సార్వత్రిక ఎన్నికల్లోనూ అదే పంథాను అనుసరించే వ్యూహంతో ముందుకెళుతున్నట్లు కనిపిస్తోంది. టీడీపీ, బీజేపీ బలపరుస్తున్న జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు నామినేషన్ వేసినప్పటినుంచి వైసీపీ శ్రేణుల్లో ఆందోళన మొదలైంది. ఆరణి ర్యాలీలో వేలాదిగా తరలివచ్చిన జనవాహినిని చూసి వైసీపీ నాయకులు కుట్రకు తెరలేపినట్టుగా ప్రచారం జరుగుతోంది. జనసేన అభ్యర్థి ప్రచారం చేపట్టే ప్రాంతాల్లో ముందుగా వైసీపీ శ్రేణులు వాలిపోయి కవ్వింపు చర్యలకు దిగుతున్నాయి.

పోలీసుల ప్రేక్షకపాత్ర : ఎన్నికల ప్రచారంలో నాలుగైదు ఉద్రిక్త ఘటనలు చోటుచేసుకుంటున్నప్పటికీ పోలీసులు ప్రేక్షకపాత్ర వహించడం అనుమానాలకు తావిస్తోంది. తిరుపతిలో ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరగాలంటే ఎన్నికల కమిషన్ ప్రత్యేక దృష్టిపెట్టాల్సిన అవసరం వుంది. అధికార పార్టీకి పోలీసులు తొత్తులుగా వ్యవహరిస్తున్నారని ఎన్డీఏ కూటమి నేతలు ఆరోపిస్తున్న నేపథ్యంలో ఇప్పటికైనా అప్రమత్తంగా వ్యవహరించాల్సివుంది.

● భూమనా...ఇది కడపకాదు

రాష్ట్రంలో రాక్షస పాలన జరుగుతోందనడానికి తిరుపతిలో వైసీపీ నేతలు చేస్తున్న అరాచకాలే నిదర్శనం. నాలుగు రోజులుగా ఎంత కవ్విస్తున్నా శాంతియుతంగా వెళ్తున్నాం. 99సార్లు శాంతియుతంగా ఉండమనే మా నాయకుడు పవన్ కల్యాణ్ చెప్పారు. పరిస్థితి చేయిదాటిపోతే యుద్ధంలో దిగడమే. ఎన్నికల అధికారుల దగ్గర అనుమతి తీసుకుని ముందుగా ప్రచారానికి వెళుతుంటే, మేం వెళ్లే దారిలో అడ్డంవచ్చి దారివదలకుండా రౌడీమూకలు అడ్డుకుంటున్నాయి. గంజాయి మూకలతో బెదరగొట్టాలని చూస్తున్నారు. ఇలాంటి తాటాకు చప్పుళ్లకు భయపడం. తిరుపతి వాళ్ల అబ్బసొత్తుకాదు. ఇది ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని తిరుపతి మాత్రమే. కడప సంస్కృతి తీసుకొస్తామంటే కుదరదు.

- ఆరణి శ్రీనివాసులు, జనసేన అభ్యర్థి

● సౌమ్యులమైన మాపై నిందలా ?

తిరుపతిలో భయోత్పాతం సృష్టించేందుకు ఎన్డీఏ కూటమి కుట్ర చేస్తోంది. చిత్తూరు, వేలూరు నుంచి రౌడీలను తీసుకొచ్చేశారు. 25మంది బయటిప్రాంతంవారు పోటీలో ఉండారంటే పరిస్థితి ఏంటో తెలియడంలేదు. సౌమ్యులుగా ఉన్న మా మీద ఏదో ఒక నెపం నెట్టే కుట్ర కూటమి చేస్తోంది.

- భూమన కరుణాకర రెడ్డి, ఎమ్మెల్యే

గిరిపురంలో ఉద్రిక్తత

ఆరణి ప్రచారాన్ని అడ్డుకున్న వైసీపీ శ్రేణులు

తిరుపతిలో జరుగుతున్న ఎన్నికల ప్రచారంలో ఉద్రిక్తతలు చోటు చేసుకుంటున్నాయి. జనసేన అభ్యర్థి ప్రచారం చేపట్టే ప్రాంతాల్లో ముందుగా వైసీపీ శ్రేణులు వాలిపోయి కవ్వింపు చర్యలకు దిగుతున్నారు. నాలుగు రోజుల క్రితం 27వ డివిజన్లోని జబ్బార్ లేఅవుట్‌లో జనసేన అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు ప్రచారానికి వెళుతుంటే వైసీపీ కార్యకర్తలు కూడా ప్రచారం పేరిట రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారు. ఎన్డీఏ కూటమి పార్టీ కార్యకర్తలు పట్టించుకోకుండా ప్రచారం చేపడుతూ దొడ్డాపురం వీధిలోకి వెళ్లిపోయారు. తాజాగా శనివారం గిరిపురంలో జనసేన అభ్యర్థి ప్రచారం చేసుకుంటూ వెళుతుంటే దారివ్వకుండా వైసీపీ కార్యకర్తలు ఇబ్బంది పెట్టారు. ప్రచారానికి వెళ్లకూడదంటూ అడ్డుకున్నారు. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య పిడిగుద్దులు, తోపులాటలతో ఉద్రిక్తత నెలకొంది. ఇంతలో సమాచారం అందుకుని అక్కడకు చేరుకున్న పోలీసులు ఇరువర్గాలకు సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. ఇంతలో టీడీపీ నేత మబ్బు దేవనారాయణ రెడ్డి తన అనుచరులతో అక్కడికి చేరుకోవడంతో ఇరువర్గాలు బాహాబాహీకి దిగాయి. పలువురికి స్వల్ప గాయాలయ్యాయి. ఆరణి శ్రీనివాసులుతో పాటు టీడీపీ నాయకులు సుగుణమ్మ, నరసింహయాదవ్, ఊకా విజయకుమార్, దంపూరి భాస్కర యాదవ్, ఆర్సీ మునికృష్ణ, జనసేన నేతలు కిరణ్‌రాయల్, రాజా రెడ్డి, సుభాషిణి, ఆర్కాట్ కృష్ణప్రసాద్ తదితరులను తోపులాటల నడుమ పోలీసులు అనంత వీధివైపు పంపారు. అక్కడ వైసీపీ కార్యకర్తలు కొందరు గుంపులుగా చేరుకుని నినాదాలు చేయడం, ఇళ్లపైకి ఎక్కి జెండాలు ఊపుతూ కవ్వింపులకు దిగారు.అయితే మబ్బు యువసేన కార్యకర్తలు దీటుగా ప్రతిఘటించడంతో అక్కడినుంచి పలాయనం చిత్తగించారు.

ఘర్షణలకు తావు లేకుండా చర్యలు : ఎస్పీ

తిరుపతి(నేరవిభాగం),ఏప్రిల్ 27: తిరుపతిలో ఎన్నికల ప్రచారంలో తలెత్తుతున్న ఘర్షణలను నివారించేందుకు చర్యలు తీసుకుంటామని ఎస్పీ కృష్ణకాంత్ పటేల్ చెప్పారు.శనివారం గిరిపురంలో జనసేన అభ్యర్థి ప్రచారానికి దారివ్వకుండా వైసీపీ కార్యకర్తలు ఇబ్బంది పెట్టడంతో తలెత్తిన ఉద్రిక్త పరిస్థితులు పునరావృతం కాకుండా అధికారులతో సమీక్షించానన్నారు. ఇకపై రెండు పార్టీల అభ్యర్థులు ఒకే ప్రాంతంలో ప్రచారం చేసుకోకుండా చూస్తానన్నారు. ఎన్నికల ప్రచారాల్లో ఘర్షణ వాతావరణం సృష్టిస్తే కఠిన చర్యలతో పాటు క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

వలంటీర్లతో వైసీపీ రాజకీయం

నేడు తిరుపతిలో చెవిరెడ్డి సమావేశం

తిరుపతి, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): చంద్రగిరి నియోజకవర్గంలో గౌరవ వేతనం తీసుకుంటూ ఇంతకాలం వలంటీర్లుగా వ్యవహరించిన వారంతా శనివారం పూర్తిగా విధుల నుంచీ తప్పుకున్నారు. వలంటీర్ల ముసుగు తొలగించి వందశాతం నిఖార్సైన వైసీపీ కార్యకర్తలుగా మారిపోయారు. కొంతకాలంగా రోజుకు కొందరు చొప్పున వలంటీర్లు చేసిన రాజీనామాలను శనివారం అధికారులు ఆమోదించారు.ఆదివారం ఈ మాజీ వలంటీర్లతో ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి సమావేశం కానున్నట్టు తెలిసింది. ఎన్నికల ప్రచారంలోకి పూర్తి స్థాయిలో వారిని దించేలా దిశానిర్దేశం చేయనున్నట్టు సమాచారం. రానున్న పదిహేను రోజులూ వారికి కీలక బాధ్యతలు అప్పగించనున్నారని, అందులో తాయిలాల పంపిణీయే ప్రధాన బాధ్యతగా వుంటుందని తెలిసింది. కాగా దీనిపై టీడీపీ వర్గాలు కూడా అప్రమత్తమవుతున్నాయి. ఎమ్మెల్యే చెవిరెడ్డి మాజీ వలంటీర్ల కదలికలపై నిఘా వుంచినట్టు తెలిసింది. ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా వారు ఎలాంటి కార్యక్రమం చేపట్టినా ఫిర్యాదు చేసి అడ్డుకునేందుకు సన్నద్ధమై వున్నట్టు తెలిసింది.

నేడు వెంకటగిరికి సీఎం జగన్

వెంకటగిరి, ఏప్రిల్ 27 :ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఎన్నికల ప్రచారంలో భాగంగా నేడు వెంకటగిరికి రానున్నారు. ఆదివారం మధ్యాహ్నం 1.10 గంటలకు హెలికాప్టర్‌లో వెంకటగిరి ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. అక్కడినుంచి 1.15 గంటలకు ప్రచార వాహనంలో బయల్దేరి పట్టణంలోని త్రిభువని థియేటర్ కూడలిలో ఏర్పాటు చేసిన సభా స్థలానికి 1.25 గంటలకు చేరుకుంటారు.1.30 గంటల నుంచి 2.15 గంటల వరకు బహిరంగ సభలో ప్రసంగించి హెలికాప్టర్‌లో నెల్లూరు జిల్లా కందుకూరు వెళతారు.

ప్రశాంతంగా పాలిసెట్

తిరుపతి(విద్య), ఏప్రిల్ 27: పాలిసెట్ (పాలిటెక్నిక్ కోర్సుల ప్రవేశ పరీక్ష) జిల్లాలో ప్రశాంతంగా జరిగిందని కో-ఆర్డినేటర్, తిరుపతి ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ డాక్టర్ వై.ద్వారకానాథ్‌రెడ్డి తెలిపారు. శనివారం తిరుపతి, గూడూరు కేంద్రాలుగా ఈ పరీక్ష జరిగిందన్నారు. జిల్లా వ్యాప్తంగా 86.53 (తిరుపతిలో 87.17 శాతం, గూడూరులో 84.34 శాతం) శాతం మంది విద్యార్థులు పరీక్ష రాశారని పేర్కొన్నారు. తిరుపతిలోని ఎనిమిది కేంద్రాల్లో 2,183 మంది బాలురు, 1,283 మంది బాలికలు మొత్తం 3,976 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో 3,466 మంది పరీక్ష రాయగా, 510 మంది గైర్హాజరయ్యారు. గూడూరులోని ఆరు కేంద్రాల్లో 617 మంది బాలురు, 353 మంది బాలికలు మొత్తం 1,150 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో.. 970 మంది పరీక్ష రాయగా, 180 మంది గైర్హాజయ్యారు. జిల్లా వ్యాప్తంగా 5,126 మంది దరఖాస్తు చేసుకోగా, 4,436 (2,800 మంది బాలురు, 1,636 మంది బాలికలు) మంది పరీక్ష రాయగా, 690 మంది గైర్హాజరయ్యారని వివరించారు. అలాగే ప్రశాంతంగా పరీక్ష నిర్వహించిన అసిస్టెంట్ కో-ఆర్డినేటర్ ఆర్వీ రమణకుమార్, హెడ్ ఆఫ్ ది జనరల్ సెక్షన్ డాక్టర్ ఎస్వీ గౌరీశంకర్‌తోపాటు చీఫ్ సూపరింటెండెంట్లు, పరిశీలకులు, రూట్ ఆఫీసర్లు, ఇతర సిబ్బందికి జిల్లా కో-ఆర్డినేటర్ కృతజ్ఞతలు తెలిపారు.

రైతునెత్తిన రాళ్లపాడు

ఇంతవరకు అతీగతీ లేదు...

- రాళ్లపాడు కాలువ పొడిగింపు పనులు
- కందుకూరు ఉత్తర బైపాస్ నిర్మాణం
- రెండింటి పూర్తికి మాటిచ్చి 22 నెలలు

మోసం గురూ!



కందుకూరు, ఏప్రిల్ 27: సాక్షాత్తూ రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డే బహిరంగ సభలో ఇచ్చిన హామీలకు అతీగతీ లేదు. కందుకూరు నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు ఆరునెల్లోగా నిధులు మంజూరు చేసి, టెండర్లు పిలుస్తామని ఆయన ప్రకటించారు. అయినా ఇంత వరకు అడుగు ముందుకు పడలేదు. కందుకూరు నియోజకవర్గ అభివృద్ధిలో ఎంతో కీలకంగా భావించే రాళ్లపాడు ఎడమ కాలువ పొడిగింపు పనులు, కందుకూరులో ఉత్తర బైపాస్ రోడ్డు నిర్మాణ పనులకు ఆరునెలల్లోగా నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటానని, 2022జూన్‌లో రామాయపట్నం పోర్టు భూమిపూజ సందర్భంగా జరిగిన సభలో జగన్ ప్రకటించారు. అదే సభలో ఎమ్మెల్యే మహీధరరెడ్డి నియోజకవర్గ అభివృద్ధి కోసం రాళ్లపాడు ఎడమ కాలువ పొడిగింపు పనులకు, కందుకూరుకు ఉత్తర బైపాస్ నిర్మాణానికి, కందుకూరు మున్సిపాలిటీ పరిధిలో అభివృద్ధి పనుల కోసం, కరేడు పీహెచ్‌సీ భవనాల నిర్మాణాలను నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. వీటిలో రాళ్లపాడు ఎడమ కాలువ పొడిగింపు, ఉత్తర బైపాస్‌లకు 2009లోనే మంజూరు ఉత్తర్వులు వచ్చాయని, సర్వే కూడా పూర్తి అయిందని, నిధుల కొరతతో భూసేకరణ జరగలేదని వివరించారు. తక్షణం ఆ పనులు ప్రారంభమయ్యేలా అవసరమైన సుమారు రూ. 90 కోట్లు మంజూరు చేస్తానని జగన్ హామీ ఇచ్చారు. అలాగే కందుకూరు మున్సిపాలిటీ అభివృద్ధి కోసం ఎమ్మెల్యే మహీధరరెడ్డి కోరిన రూ.26కోట్లు నిధులు విడుదల చేయటం జరుగుతుందని, కరేడు పీహెచ్‌సీకి భవనాల నిర్మాణానికి నిధులిస్తానని హామీ ఇచ్చారు. అయితే మున్సిపాలిటీలో అభివృద్ధికి నిధులు మంజూరు చేయటం మినహా ఏ ఒక్క హామీ అమలు కాలేదు.

మూడు వేల ఎకరాలకు నీరు

రాళ్లపాడు ఎడమ కాలువ పొడిగింపు పనుల పూర్తయితే రెండువేల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ జరుగుతుంది. అంతేకా మరో మూడువేల ఎకరాల అదనపు ఆయకట్టుకు సాగునీరందుతుంది. ఈ కాలువ పొడిగింపు ద్వారా వీఆర్ కోట, శాఖవరం, నలదలపూరు, కళవళ్ల చెరువుల పరిధి లో ఉన్న ఆయకట్టును స్థిరీకరించటంతో పాటు మరికొన్ని గ్రామాలకు సాగునీరందుతుంది. ఈ కాలువ పొడిగింపు ద్వారా పోకూరు, నేకునాంపురం చెరువుల ఆయకట్టును స్థిరీకరించాలన్న ప్రతిపాదన కూడా ఉంది. రాళ్లపాడు ఎడమ కాలువ పొడి గింపు పనులకు గతంలోనే మం జూరు ఉత్తర్వులు ఉండటంతో పాటు కాలువ డిజైన్‌కు సంబం ధించిన సర్వే, భూసేకరణ కోసం సామాజిక, ఆర్థిక సర్వే కూడా పూర్తయిం ది. ఎంతో ఉపయోగకరమైన ఈ కాలువ పనులకు నిధుల విడుదలకు ఇచ్చిన హామీ కార్యరూపం దాల్చలేదు.



రాళ్లపాడు ఎడమ కాలువ (ఫైల్)

బైపాస్ ఎంతో అవసరం

కందుకూరులో ట్రాఫిక్ సమస్య నియంత్రణకు ఉత్తర బైపాస్ నిర్మాణం ఎంతో అవసరం. పట్టణంలో రెండు దశాబ్దాలుగా ట్రాఫిక్ సమస్య పెరిగిపోయింది. పట్టణానికి ఉత్తరం వైపున పలు పరిశ్రమలు రావడంతో నిత్యం లారీలు, ట్రాక్టర్లు, ఇతర వాహనాల్లో జామాయిల్ కర్ర, పొట్టు, ఇతర వ్యవసాయ ఉత్పత్తుల వాహనాలు పెద్దఎత్తున తిరుగుతున్నాయి. బైపాస్ నిర్మాణం జరిగితే ఈ వాహనాలన్నీ పట్టణంలోకి రాకుండా పోవడం ద్వారా ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం లభి స్తుంది. కానీ నిధుల కొరతతో పనులు ప్రారంభంకాని వైనాన్ని ఎమ్మెల్యే మహీధరరెడ్డి వివరించగా, తక్షణం నిధుల కేటాయింపు చేస్తానని సీఎం జగన్ హామీ ఇచ్చారు. కానీ అమలుకు నోచుకోలేదు. అలాగే కరేడు పీహెచ్‌సీకి భవనాల నిర్మాణానికి కూడా నిధులు విడుదల కాలేదు.

స్టార్ క్యాంపెనర్ల ప్రచారం

- కోడ్ ఉల్లంఘన జరగకుండా పరిశీలించాలి
- నోడల్ అధికారుల సమీక్షలో కలెక్టర్

నెల్లూరు (హరనాథపురం); ఏప్రిల్ 27: స్టార్ క్యాంపెనర్లు ప్రచారానికి వస్తున్నందున కోడ్ ఉల్లంఘన జరగకుండా నిశితంగా పరిశీలించాలని కలెక్టర్ ఎం. హరినారాయణన్ అధికారులను ఆదేశించారు. కార్పొరేషన్‌లోని కమాండ్ కంట్రోల్ రూంలో శనివారం నోడల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల ప్రచారం ముమ్మరంగా సాగుతున్నందున కోడ్ అమలును అత్యంత జాగ్రత్తగా పరిశీలించాలన్నారు. ఇంటలిజెన్స్ విభాగం అధికారులు మద్యం డంప్‌లు ఎక్కడున్నాయో గుర్తించి సీజ్ చేయాలన్నారు. చెక్ పోస్టుల దగ్గర ప్రతి వాహనాన్ని తనిఖీ చేయాలన్నారు. ఆటోలు, ద్విచక్ర వాహనాలను తప్పనిసరిగా తనిఖీ చేయాలన్నారు. జిల్లాలో ఎన్నికల విధులు కేటాయించ బడిన వారు మే 1వ తేదీలోగా పోస్టల్ బ్యాలెట్ కోసం ఫామ్ 12 అందచేయాలన్నారు. సమావేశంలో డీఆర్వో లవన్న,నోడ్ అధికారులు బాపురెడ్డి, వెంకట్రావు, పద్మావతి, అనిత రాణి, ఎస్‌రాజు తదితరులు పాల్గొన్నారు.



అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హరినారాయణన్

పరిశీలకుల నోడల్ అధికారిగా డీఎస్వో



నెల్లూరు(హరనాథపురం): పరిశీలకుల నోడల్ అధికారిగా జిల్లా పౌరసరఫరాల అధికారి డీవీ రమణను కలెక్టర్ హరినారాయణన్ శనివారం నియమించారు. రమణ ఏపీ టూరిజం హోటల్‌లో ప్రజలకు అందుబాటులో ఉంటారు. 80083 01500 నంబరులో ఆయన్ను సంప్రదించవచ్చు.

ఫిర్యాదుల స్వీకరణకు ఎన్నికల పరిశీలకులు వీరే!

నెల్లూరు (హరనాథపురం), ఏప్రిల్ 27 : ఎన్నికల ప్రక్రియను పూర్తిస్థాయిలో పర్యవేక్షణకు, పారదర్శకంగా ఎన్నికల నిర్వహణకు కేంద్ర ఎన్నికల సంఘం జిల్లాకు ఎన్నికల పరిశీలకులను నియమించిందని, వీరు ప్రజలకు, రాజకీయ పార్టీలకు అందుబాటులో ఉంటారని జిల్లా పరిశీలకుల నోడల్ అధికారి డీవీ రమణ ఒక ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గాల పరిధిలో ఏమైనా ఫిర్యాదులు ఉంటే వెంటనే ఫోన్ ద్వారా లేదా, అర్జీల రూపంలో సంబంధిత పరిశీలకులకు తెలియచేయాలని కోరారు.

- ఆత్మకూరు, కోవూరు, నెల్లూరు సిటీ, నెల్లూరు రూరల్ అసెంబ్లీ నియోజకవర్గాలకు నితిన్ బదారియా నియమితులయ్యారు. 6281209403 నెంబరుకు ఫోన్ చేసి, ఫిర్యాదు చేయవచ్చు
- నెల్లూరు పార్లమెంటు, కందుకూరు, కావలి, ఉదయగిరి నియోజకవర్గాలకు రామ్‌కుమార్ నియమితుల య్యారు. ఈయన ఫోన్ నంబరు 9014504275.
- నెల్లూరు పార్లమెంటు, కందుకూరు, కావలి, ఆత్మకూరు, కోవూరు, నెల్లూరు సిటీ, నెల్లూరు రూరల్, ఉదయగిరి నియోజకవర్గాలకు అశోక్‌దుదే పోలీసు పరిశీలకులుగా నియమితులయ్యారు. ఫోన్ నెం.7569618685.
- నెల్లూరు పార్లమెంటు నియోజకవర్గానికి వ్యయ పరిశీలకులుగా గోరసె ప్రసాద్ దత్తాత్రేయ నియమితులు కాగా, 8008292237 నెంబరుకు ఫోన్ చేసి, ఫిర్యాదులు చేయవచ్చు.
- కోవూరు, నెల్లూరుసిటీ, రూరల్, సర్వేపల్లి నియోజకవర్గాలకు కంచన్‌రామ్‌మీనా సాధారణ పరిశీలకులుగా నియమితులయ్యారు. ఫోన్ నెం. 8247832811.
- కందుకూరు, కావలి, ఆత్మకూరు, ఉదయగిరి నియోజకవర్గాలకు వ్యయపరిశీలకులుగాజ్యోతిమోయ్ బైలుంగ్ నియమితులుకాగా, ఫోన్ నెం.8639687940.
- తిరుపతి పార్లమెంటు నియోజకవర్గం, సర్వేపల్లి నియోజవర్గానికి సాధారణ పరిశీలకులుగా కె.జ్యోతి (9912340472), పోలీసు పరిశీలకులుగా అరవింద్ సాల్వే (9154141876) నియమితులయ్యారు. తిరుపతి పార్లమెంటు వ్యయపరిశీలకులుగా పరదీప్ కూమార్ (9032666742) నియమితులయ్యారు.



పార్టీ ఏదైనా ప్రచారాల పేరుతో బేరం

నాటి ముచ్చట



రామయ్య: ఏందిరో నరసయ్య యాడికి బోతున్నవ
నరసయ్య: యాడికుందిలే మామా... పనికే కదా !
రామయ్య: ఓర్నాయాలా.. ఈ ఎండలో పనికేం పోతావురా ?
నరసయ్య: మరి ఇంకేం చేయమంటావు ?!
రామయ్య: పిచ్చి నాయాలా పెచారానికి పోదాం రా..
నరసయ్య: పెచారమా.. మాకెందులేబ్బా..
రామయ్య: అబ్బేలేదు.. గిబ్బే లేదు పోదాంపా..
నరసయ్య: జేబులో డబ్బుల్లేవ్ మామా..
రామయ్య: డబ్బు లెందుకురా పిచ్చోడా.. అంతా వాళ్లే చూసుకుంటారు.
నరసయ్య: వాళ్లెవరు సామి మధ్యలో...?
రామయ్య: అదేరా ఆ పార్టీ వాళ్లు
నరసయ్య: ఎంతిస్తారేంది?
రామయ్య: రోజుకూలీ, మందు సీసా, బిర్యానీ పొట్లం... చాలదా ?
నరసయ్య: అవునే.. ఇదేందో బాగుందే.. పద !
పుల్లయ్య: ఓరే యాడికిరే ఇద్దరూ సైయిగ్గా బోతుండ్రు
రామయ్య: యాడికి లేదులే రా పెచారినికే..
పుల్లయ్య: నీ పని బాగుంది కదరా.. రోజూ భలే బేరం తగులుద్దే
నరసయ్య: ఇట్టాంటప్పుడే లేవోయ్.. వాళ్లు కూడా మనల్ని గమనించేది !
పుల్లయ్య: అట్టయితే అగుండ్రా ఇప్పుడే వస్తా...
రామయ్య: మళ్లీ ఎక్కడికి రా... లేటవుద్ది !
పుల్లయ్య: పిల్లోడు సెలవులని ఇంటికాడే ఉన్నాడు. వాడ్ని తోడునొస్తా...
నరసయ్య: కక్కుర్తి నాయలా...? సరేలే తొందరగా పో...
పుల్లయ్య: ఇంతకీ ఏ పార్టీ వాళ్లది పెచారం ?
రామయ్య: ఏదయితే నీకెందురా మనం పోతున్నాం..
నరసయ్య: అంతేలేరా.. పెద్ద పెద్దోళ్లే తినంగా మనమెంత.. పదండి తొందరగా...!

- పరికుంటపాడు

రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తే జైలుకే!


తస్మాత్ జాగ్రత్త

కొంతమంది అభ్యర్థులు సెంటిమెంట్‌ను రెచ్చగొడితే ఓట్లు పడతాయని భావించి కులం,మతం, వర్గం, ప్రాంత భేదాలతో ఇష్టారాజ్యంగా మాట్లాడుతుంటారు. ఇలాంటి రెచ్చగొట్టే వ్యాఖ్యలు అరికట్టేందుకు ఎన్నికల సంఘం కఠిన నిబం ధనలను రూపొందించింది. ఎన్నికల్లో ఎవరైనా జాతి, మతం, కులం, భాష, సమాజం పేరుతో రెచ్చగొడితే ఐపీఎస్ సెక్షన్ 158ఏ ప్రకారం మూడేళ్ల జైలుశిక్ష, జరిమానా విధిస్తారు. ఓటుకోసం మద్యం, డబ్బులు, ఇతర వస్తువులను తీసుకున్న వారిని కూడా నేరస్థులుగానే పరిగణి స్తారు. ఐపీఎస్ సెక్షన్ 171బీ, 171హెచ్ ప్రకారం లంచంగా పరిగణించి ఏడాది జైలుశిక్ష విధిస్తారు. ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికల్లో డబ్బు, మద్యం ప్రవాహాలపై నిఘా పెంచారు. ఓటర్లను ప్రలోభాలకు గురి చేసిన వారు కూడా భారీ మూల్యం చెల్లించుకోక తప్పదు.

- ఉదయగిరి

అప్పట్లో కక్షలు ఉండేవి కాదు!

పెద్దల మాట



నేను తొలిసారిగా 1972లో ఓటు వేశాను. మా రోజుల్లో ఎన్నికలు ఎంతో స్నేహపూర్వక వాతావరణంలో జరిగేవి. పోటీ చేసే వారి మధ్య కక్షలు ఉండేవి కాదు. ఉదయాన్నే ఓటు వేయడానికి వచ్చిన వారికి పోటీ చేసిన వారు భోజనాలు ఏర్పాటు చేసేవారు. ఇది లంచం కింద కాదు. రిక్షాలు ఏర్పాటు చేసేవారు. ఏ రిక్షాలో వెళ్లినా మరో పోటీదారు ఫలానా వారు ఆ రిక్షాలో వెళ్లారని అసూయ పడేవారు కాదు. అలా వెళ్లిన వారిపై కక్ష సాధింపునకు దిగే వారు కాదు. ఇప్పుడు అలా కాదు. వీళ్ల మనోళ్లు, వారు వాలోళ్లు అని గిరి గీసుకుంటున్నారు. గెలుపు కోసం అడ్డదారులు తొక్కుతున్నారు. నాడు ఎన్నికల్లో ఫలితాలు కోసం బ్యాలెట్లు లెక్కింపు పూర్తయ్యే సరికి దాదాపు రెండురోజులు ఎదురు చూసేవాళ్లం. ఇప్పుడు ఈవీఎం మెషీన్లు రావడంతో ఎవరు గెలిచారో తొందరగా తెలిసిపోతోంది. ఎన్నికలు ముగిసిన తరువాత అభివృద్ధి కోసం విజేత, పరాజితులు కృషి చేయాలి.

- చలమయ్య, అన్నారెడ్డిపాళెం, సంగం

అప్పట్లో 21 ఏళ్లకు ఓటు

మీకు తెలుసా..!

దేశంలో మొదటిసారిగా సాధారణ ఎన్నికలు 1952లో జరిగాయి. కేంద్ర ఎన్నికల కమిషనర్‌గా సుకుమార్ సేన్ ఆధ్వర్యంలో 17.90 కోట్ల మందికి ఓటు వేసే అవకాశం కల్పించారు. 1985 వరకు ఓటు హక్కు కనీస వయసు 21 ఏళ్లుగా ఉండేది. 1988 లో 61వ రాజ్యాంగ సవ రణ చట్టం ద్వారా ఓటు హక్కు వయసు 18 ఏళ్లకు తగ్గించారు. ఎన్నికల నిర్వహణలో సమూల సంస్కరణలు అమలు చేసిన ఘనత 1990 దశకంలో ఎన్నికల కమిషనర్‌గా పనిచేసిన టీఎన్ శేషన్‌కు దక్కు తుంది. మొదటిసారి జరిగిన ఎన్నికల్లో 55 పార్టీలు బరిలో నిలవగా, 2014 నాటికి ఆసంఖ్య 370కి చేరింది. నాడు బ్యాలెట్ పేపర్‌తో ఎన్నికల నిర్వహించే విధానం నుంచి నేడు ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ (ఈవీఎం) అమల్లో వచ్చింది. 2019 ఎన్నికల నుంచి ఓటు ఎవరికి వేశారో తెలుసుకునేందుకు ఓటర్ వెరిఫైడ్ పేపర్ ట్రయిల్ (వీవీ ప్యాడ్) యంత్రాలను వినియోగిస్తున్నారు.

- అనంతసాగరం/ ఉదయగిరి



నామినేషన్ దాఖలు చేసిన పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా అభ్యర్థి రాజేశ్వరి (ఫైల్)

ఆత్మకూరు బరిలో తొలిసారిగా నారీ

ఇప్పటి వరకు జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఆత్మకూరు నుంచి ఎందరో ఉద్ధండులు పోటీ చేసి, తమ రాజకీయ భవితకు బాటలు వేసుకున్నారు. అయితే మహిళలకు మాత్రం ఇక్కడ నుంచి పోటీ చేసే అవకాశం ఏపార్టీ కూడా ఇవ్వలేదు. తాజా ఎన్నికల్లో మాత్రం పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా అభ్యర్థిగా బీ రాజేశ్వరి బరిలో నిలిచారు. ప్రస్తుత ఎన్నికల్లో టీడీపీ నుంచి ఆనం రామనారా యణరెడ్డి, వైసీపీ నుంచి మేకపాటి విక్రమ్ రెడ్డి, కాంగ్రెస్ నుంచి చేవూరు శ్రీధర్‌రెడ్డి బరిలో ఉన్నారు. నియోజకవర్గంలో 2,14,582 మంది ఓట్లు ఉండగా, వారిలో 1,05,444 మంది పురుషులు కాగా, 1,09,130 మంది స్త్రీలు ఉన్నారు. పురుషుల కంటే స్త్రీల ఓట్లే అధిక్యత ఉన్నా ఏ రాజకీయ పార్టీ మహిళలకు అసెంబ్లీ సీటు కేటాయించలేదు.

- ఏళ్ల తరబడి నిరాశే..

1955 నుంచి 2019 వరకు జరుగుతున్న అసెంబ్లీ ఎన్నికల తీరుతెన్నులను పరిశీలిస్తే ఒక్కసారి కూడా ఏ పార్టీ తన అభ్యర్థిగా మహిళలను నిలబెట్టిన దాఖలాలు కనిపించడం లేదు. ముఖ్యంగా 12 సార్లు గెలిచిన కాంగ్రెస్ పార్టీ గానీ, ఐదు సార్లు పోటీ చేసిన టీడీపీ నుంచి గానీ, మూడుసార్లు పోటీ చేసిన వైసీపీ నుంచి గాని, నాలుగు సార్లు పోటీ చేసిన బీజేపీ నుంచి గానీ, సీపీఎం, సీపీఐ నుంచి గానీ ఇంతవరకు ఆత్మకూరులో మహిళకు అసెంబ్లీ టికెట్ కేటాయించిన దాఖలాలు లేవు. కాగా ప్రస్తుత ఎన్నికల్లో పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా అభ్యర్థిగా బీ రాజేశ్వరి పోటీలో ఉండడం గమనార్హం. అసెంబ్లీలో ఆత్మకూరు మగువ వాణి ఎప్పుడు వినిపిస్తుందో వేచిచూడాల్సిందే.

ఎవరు ఏ పార్టీయో..?

- రోజుకో జెండా, పూటకో కండువా మార్చుతున్న నేతలు
- అధినేతల బాటలోనే ద్వితీయశ్రేణి నేతలు

జంపింగ్ జపాంగ్



ఎమ్మెల్యేగా పోటీచేసే నేతలే పార్టీలు మారుతున్నారు. వారిని ఆదర్శంగా తీసుకుని కావలి నియోజకవర్గంలో దిగువ స్థాయి నాయకులు కూడా జెండాలు మార్చేస్తున్నారు. దీంతో ఏ నాయకుడు ఏరోజు ఏ పార్టీలో ఉంటారో అంతు బట్టడంలేదు. 2009లో కావలి నుంచి ఎమ్మెల్యే అభ్యర్థులుగా టీడీపీ నుంచి బీద మస్తాన్ రావు, కాంగ్రెస్ నుంచి కాటం రెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి, ప్రజారాజ్యం పార్టీ నుంచి రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డిలు పోటీ చేశారు. అయితే ఇప్పుడు ఈ ముగ్గురు ఒకటై వైసీపీలో కొనసాగుతున్నారు. వైసీపీ అభ్యర్థి ప్రతాప్‌కుమార్ రెడ్డి గెలుపునకు కృషిచేస్తున్నారు. 2014లో టీడీపీ నుంచి బీద మస్తాన్ రావు, వైసీపీ నుంచి రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి పోటీ పడ్డారు. వారిద్దరి గెలుపు కోసం ఇరుపార్టీల కేడర్ ద్వేషాలు పెంచుకుని పోరాడారు. ఇప్పుడు వారిద్దరూ ఒకటయ్యారు.2019లో టీడీపీ తరుపున కాటం రెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి, వైసీపీ తరపున రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అసెంబ్లీకి పోటీపడగా, టీడీపీ నెల్లూరు ఎంపీ అభ్యర్థిగా బీద మస్తాన్‌రావు పోటీ చేశారు. ప్రస్తుతం ఈ ముగ్గురు ఒకటై వైసీపీలో పనిచేస్తున్నారు. ఇలా వివిధ పార్టీల తరుపున పోటీ చేసిన నేతలే ఒకటి అవుతుండటంతో వారిని ద్వితీయ, తృతీయశ్రేణి నేతలు ఫాలో అవుతున్నారు. ప్రస్తుతం కావలిలో టీడీపీ తరపున దగుమాటి వెంకట(కావ్య) క్రిష్టారెడ్డి, వైసీపీ తరపున రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి పోటీ చేస్తున్నారు.ఈ ఇద్దరు ఆర్థికంగా పరిపుష్టి కలవారు. అలాగే స్వతంత్ర అభ్యర్థి పసుపులేటి సుధాకర్ కూడా ఆర్థికంగా బలంగా ఉండటంతో అన్ని పార్టీలలోని నేతలు, కార్యకర్తలు ప్యాకేజీలు తీసుకుని పార్టీలు మారుతున్నారు. దీంతో వివిధ పార్టీలకు చెందిన నేతలు ఎప్పుడు ఏ పార్టీలో ఉంటారో అర్థం కాక రాజకీయ పరిశీలకులు సైతం తలలు పట్టుకుంటున్నారు. సహజంగా ఓటర్లు ఏ పార్టీకి ఓటు వేస్తారో వారి నాడి అంతుపట్టక అయోమయంలో ఉంటే, వారి కన్నా ముందు నేతలు నాడి అంతుపట్టక పలువురు గందరగోళంలో పడ్డారు.

- కావలి

నీడలా వెన్నాడుతున్న నిఘా !

స్పెషల్

- అభ్యర్థుల ఖర్చులపై ఆరా



సార్వత్రిక ఎన్నికల నామినేషన్ల పర్వం పూర్తయింది. ఏ పార్టీ తరుపున ఎవరు పోటీలో ఉంటారనేది కూడా తేలింది. నామినేషన్లకు సుమారు నెల ముందు నుంచే అభ్యర్థులు విస్తృతంగా ప్రచారం చేపట్టారు. ఇక రెండోరౌండ్ సాదాసీగా ప్రచారం చేస్తే చాలదు. పోలింగ్ రోజు వరకు భారీ ఖర్చు తప్పదు. ఖర్చుల విషయంలో ఎన్నికల సంఘం అధికారులు అభ్యర్థులను నీడలా వెంటాడుతారు. ఎన్నికల సంఘం మార్గదర్శక సూత్రాల మేరకు ఖర్చు చేస్తున్నారా? అని పరిశీలించేందుకు వాళ్ల బృందాలు పరిశీలిస్తున్నాయి. గెలుపు కోసం అభ్యర్థులు ఎన్ని కోట్ల ఖర్చుకైనా వెనుకాడరు. ఫ్లయింగ్‌స్క్వాడ్, ఎస్ఎస్‌టీ బృందాలు, కోడ్ ఆఫ్ కాంటాక్ట్ బృందం, వీడియో వీక్షక బృందం, అకౌంటింగ్ బృందం వీడియో సర్వేలియన్స్ బృందం పోటీలో ఉన్న అభ్యర్థుల కదలికలను గమనిస్తూ ఉంటాయి. ప్రచార ఖర్చును అంచానవేయడంతోపాటు అభ్యర్థులు ఎన్నికల నియమావళిని పాటిస్తున్నా.. లేదా ? నిఘా వేస్తారు. వాహనాల తనిఖీలు నిర్వహించి పరిమితికి మించి డబ్బు మద్యం, ఇతర విలువైన వస్తువులు రవాణా చేస్తుంటే స్వాధీనం చేసుకుంటారు. నీడలా వెంటాడే ఈ బృందాలు మధ్య అభ్యర్థులు పోలింగ్ ముగిసే చాలా జాగ్రత్తగా ఉండాలి.

-ఉదయగిరి



మిరియాల నారాయణ

రాజకీయాలు నీతిగా ఉండేవి

నా వయసిపుడు 90 ఏళ్లు. మా నాయిన మిరియాల గోవిందయ్య స్వాతంత్ర్య సమరయోధుడు. ఓ దఫా జైలుకెళ్లాడు. నాయుడుపేట చావిడికి నెహ్రూ వస్తే ఆయనతో సమావేశం ఏర్పాటు చేశాడు. ఎన్టీరామారావు తెలుగుదేశం పార్టీ పెడితే నన్ను పెద్దలంతా నాయుడుపేట పట్టణ అధ్యక్షుడిగా చేశారు. 20 ఏళ్ల పాటు టీడీపీ పట్టణ అధ్యక్షుడుగా, పంచాయతీ బోర్డు మెంబరుగా, ఎంపీటీసీగా పనిచేశాను. అప్పట్లో ఎన్నికలకు డబ్బులిచ్చే వారు కారు. డబ్బుకు ఆశపడే నాయకులూ లేరు. ఓట్లు కొనడాలు లాంటివి మాకు తెలీదు. ఓట్లకోసం ఇంటింటికీ తిరిగేవాళ్లం కాదు. పార్టీ జెండా పట్టుకుని వీధుల్లో తిరిగేవాళ్లం. 10 మంది సైకిళ్లమీదో, బస్సుల్లోనో వెళ్లి నామినేషన్లు వేసేవాళ్లం. 20 యేళ్లుగా చూస్తున్నా.. రాజకీయాలు యాపారంగా మారిపోయినాయి. గందరగోళంగా, గొడవలుగా ఉన్నాయి.

- మిరియాల నారాయణ, నాయుడుపేట

-నాయుడుపేట

ఓటేయాలంటే 4.5 కి.మీ నడవాల్సిందే!



కోట మండలం కొత్తపట్నం పంచాయతీలో గోవిందపల్లిపాళెం సముద్రపు ఒడ్డున ఉంది. ఈ గ్రామంలో సుమారు 420 కుటుంబాలున్నాయి. 475 మంది ఓటర్లున్నారు. ఎలక్షన్లు వస్తే 4.5 కిలోమీటర్లు నడిచి గోవిందపల్లిలోని పోలింగ్ స్టేషన్‌లో ఓటువేసి వస్తుంటారు. తమ గ్రామంలో పోలింగ్ బూత్ పెట్టాలనే కోరిక నెరవేరడం లేదు. గ్రామానికి మధ్యలో ఉన్న బకింగ్‌హామ్ కెనాల్ కొన్నిసార్లు అటుపోట్లు ఎదురై కన్నెర్రచేస్తే వీరి కష్టాలు అన్నీ ఇన్నీ కావు. ఆ కెనాల్‌ను దాటుకొని అవతలి ఒడ్డుకు వచ్చి ఓటు వేయాల్సిందే. ఐదేళ్లకోసారి నాయకులు వచ్చి హామీ ఇవ్వడం, తర్వాత అమలు చేయకపోవడం తమకు అలవాటైపోయిందని ఇక్కడి మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

-కోట

ట్రెండ్ మారింది

గాడ్‌ఫాదర్లు పోయె!



సూళ్లూరుపేట రిజర్వుడు నియోజకవర్గంలో ఒకప్పుడు గాడ్‌ఫాదర్‌ల హవా నడిచేది. పార్టీ ఏదైనా స్థానిక భూస్వాముల మాటే నడిచేది. అట్లా రెండు కుటుంబాలు సూళ్లూరుపేట శాసనసభ్యులుగా ఎవరు ఉండాలో నిర్ణయించేవి. వారు చెప్పినవారికే టికెట్లు కేటాయించేవారు. 1960ల్లో కోట పోలూరుకి చెందిన బద్దెపూడి పేరారెడ్డి మాటే శాసనంగా నడిచేది. ఆయన చెప్పినవారికే కాంగ్రెస్ పార్టీ టికెట్ కేటాయించేది. అయితే 1967లో పిట్ల వెంకటసుబ్బయ్య పేరును కాంగ్రెస్ అధిష్ఠానానికి పేరారెడ్డి సూచించారు. ఎందుకనో కాంగ్రెస్ ఆమోదించలేదు. పార్టీ అభ్యర్థిగా మేర్లపాక మునస్వామిని పోటీకి నిలిపింది. దీంతో తిరగబడ్డ బద్దెపూడి పేరారెడ్డి అదే పిట్ల వెంకటసుబ్బయ్య చేత ఇండిపెండెంట్‌గా నామినేషన్ దాఖలు చేయించారు. ఆ ఎన్నికల్లో అన్నీ తానై కాంగ్రెస్ అభ్యర్థిని ఓడించి తన పంతం నెగ్గించుకున్నారు. ఖంగుతిన్న కాంగ్రెస్, ఆ తర్వాత పేరారెడ్డి దారిలోకి వచ్చింది. పిట్ల వెంకటసుబ్బయ్యను కాంగ్రెస్ పార్టీలో చేర్చుకుంది. టీడీపీ ఆవిర్భావం తర్వాత సీను మారింది. వేనాటి కుటుంబం నిరయాత్మక పాత్ర పోషించింది. వేనాటి మునిరెడ్డి, ఆయన మరణం తర్వాత ఆయన సోదరుడు వేనాటి రామచంద్రారెడ్డిల మాటే టీడీపీ అధిష్ఠానం వినేది. వారు సూచించినవారికే టీడీపీ టికెట్ లభించేది. 2019 తర్వాత పరిస్థితి మారిపోయింది. గాడ్‌ఫాదర్‌ల మీద పార్టీలు ఆధారపడడం లేదు. ఒకరిద్దరు నాయకులు అటువంటి పాత్ర పోషించే ప్రయత్నాలు చేసినా పార్టీలు పెద్దగా ప్రాధాన్యం ఇవ్వలేదు. సొంత సర్వేలు నిర్వహించుకుని దాని ప్రకారం అభ్యర్థులను ఎంపిక చేసుకుంటున్నారు. గెలిచిన తర్వాత ఎమ్మెల్యేలుగా గెలిచినవారు కూడా గాడ్‌ఫాదర్‌ల చెప్పుచేతల్లో ఉండడానికి ఇష్టపడడం లేదు. స్వతంత్రంగా వ్యవహరించడంతో గాడ్‌ఫాదర్‌లకు ఆగ్రహం కలిగినా ఏమీ చేయలేని అసహాయతలో పడిపోయారు. ఈ పరిణామాలు గాడ్‌ఫాదర్‌లను కనుమరుగు చేసేశాయి.

- తడ


జన కేతనం


ఆదివారం 28 ఏప్రిల్ 2024

మూలిగే నక్కపై తాటి కాయ పడ్డట్లు ఉంది వైసీపీ వర్గాల పరిస్థితి. ఇప్పటికే ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉండగా, శనివారం సీఎం జగన్ విడుదల చేసిన మేనిఫెస్టో మరింత నిరాశ పర్చింది. టీడీపీ అధినేత చంద్రబాబు కొన్ని నెలల కిందట ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలతో పోల్చుకుని వైసీపీ వర్గాలే పెదవి విరుస్తున్నాయి. సంక్షేమ పథకాల లబ్ధి జగన్ కన్నా చంద్రబాబు అధికారంలోకి వస్తేనే ఎక్కువగా ఉంటుందన్న అభిప్రాయం ఏర్పడుతోంది. గత ఐదేళ్ల కన్నా అధికంగా ప్రయోజనం ఉంటుందని పెన్షనర్లు, రైతులు, మహిళలు ఆశపడ్డారు. జగన్ వారి ఆశలు భగ్నం చేశారు. జగన్ మేనిఫెస్టోను టీడీపీ మేనిఫెస్టోతో పోల్చి చూస్తే.. చంద్రబాబు అధికారంలోకి వస్తే జిల్లాలో సంక్షేమ పథకాల లబ్ధిదారులకు ఐదేళ్లలో రూ.4 వేల కోట్లకు పైగా లబ్ధి చేకూరనుంది. వైసీపీ ఎన్నికల మేనిఫెస్టో, టీడీపీ సూపర్ సిక్స్ పథకాలతో జిల్లా ప్రజలకు కలిగే లాభనష్టాల వివరాలిలా ఉన్నాయి. - తిరుపతి, ఆంధ్రజ్యోతి

జగన్ మేనిఫెస్టో తుస్సే!

ఆందోళనలో వైసీపీ వర్గాలు





పెన్షనర్లు

చంద్రబాబు హామీ: అధికారంలోకి రాగానే అన్ని వర్గాలకూ పెన్షన్ రూ. 4000లు చేస్తాం. ప్రస్తుతం రూ. 3000లు పెన్షన్ పొందుతున్నవారికి ఏప్రిల్ నుంచే పెంచిన రూ. 1000లు కూడా చెల్లిస్తాం.

జగన్ మేనిఫెస్టో: పెన్షన్‌లు 2028లో రూ. 250లు , 2029లో మరో రూ. 250లు పెంచుతాం.

జగన్ వల్ల రూ.1628 కోట్ల నష్టం



చంద్రబాబు ఇస్తానన్న నాలుగువేల పెన్షన్‌తో పోలిస్తే జగన్ అధికారంలోకి వస్తే జిల్లాలోని 2,71,477 మంది పెన్షన్‌దారులు నెలకు రూ.వెయ్యి చొప్పున రూ. 27.41 కోట్లు నష్టపోనున్నారు. అదే ఏడాదిలో అయితే రూ. 325.77 కోట్లు.. ఐదేళ్లకు ఏకంగా రూ. 1628.86 కోట్ల అదనపు లబ్ధిని పోగొట్టుకోనున్నారు. వ్యక్తిగతంగా చూస్తే ఒక్కో పెన్షనర్ ఏడాదికి రూ. 12 వేలు, ఐదేళ్లలో రూ. 60 వేలు చొప్పున నష్టపోనున్నారు.

గతంలో : జగన్ అధికారంలోకి వచ్చేప్పటికి పెన్షన్ రూ.2000 ఉంది. అంతకుముందు టీడీపీ అధికారం చేపట్టినపుడు కేవలం రూ. 200 మాత్రమే ఉండేది. దానిని చంద్రబాబు రూ. 2000లకు పెంచారు. జగన్, అధికారంలోకి వచ్చాక అవ్వాతాతలకు రూ.3000 లు చేస్తానని చెప్పి అంచలంచెలుగా రూ. 250 వంతున పెంచి రూ. 3000లు చేశారు.

సిలిండర్లు

చంద్రబాబు హామీ: టీడీపీ అధికారంలోకి వస్తే ఏడాదికి 3 గ్యాస్ సిలిండర్లను ప్రతి ఇంటికీ ఉచితంగా ఇస్తాం.

జగన్ మేనిఫెస్టో: ఉచితంగా సిలిండర్లు ఇచ్చే ఆలోచనే లేదు.



టీడీపీ వస్తే గ్యాస్ రూపేణా రూ.883.59 కోట్ల లబ్ధి

జిల్లాలో తెల్ల రేషన్ కార్డు కలిగిన 5.89 లక్షల వంట గ్యాస్ వినియోగించే కుటుంబాలున్నాయి. ఈ ఎన్నికల్లో టీడీపీ అధికారంలోకి వస్తే వీరికి ఏడాదికి రూ.176.71 కోట్లు.. ఐదేళ్లలో రూ.883.59 కోట్ల లబ్ధి చేకూరనుంది. వ్యక్తిగతంగా ఒక్కో కుటుంబం ఏడాదికి రూ.3 వేలు, ఐదేళ్లలో రూ.15 వేలు ప్రయోజనం పొందనుంది. వైసీపీ అధికారంలోకి వస్తే ఈ మొత్తాన్ని నష్టపోవాల్సిందే.

రైతులకు

చంద్రబాబు హామీ: అధికారంలోకి రాగానే అన్నదాత పథకం కింద ఒక్కొక్కరికీ రూ. 20 వేలు వంతున ఇస్తాం.

జగన్ మేనిఫెస్టో: రైతు భరోసాను రూ. 16 వేలుకి పెంచుతాం.

361 కోట్ల నష్టం



జిల్లాలో 1,80,654 మంది రైతులున్నారు. జగన్ తిరిగి సీఎం అయితే వీరు ఏడాదికి రూ.72.76 కోట్లు.. ఐదేళ్లలో రూ.361.30 కోట్లు కోల్పోనున్నారు. వ్యక్తిగతంగా లెక్కిస్తే ప్రతి రైతూ ఏడాదికి రూ.4 వేలు, ఐదేళ్లలో రూ. 20 వేలు వంతున నష్టపోనున్నారు. ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి గెలిచి చంద్రబాబు సీఎం అయితే అదే మొత్తం రైతులకు అదనపు లబ్ధికానుంది. **గతంలో:** రైతులకు రూ.14 వేలు ఇస్తానని గతంలో చెప్పిన జగన్.. రూ.13500 ఇస్తున్నారు. అందులో రూ.6 వేలు కేంద్ర ప్రభుత్వం అందించే పీఎం కిసాన్ యోజన నిధులే. అంటే జగన్ ఇచ్చేది రూ.7500 మాత్రమే.

ఆర్టీసీలో ఉచితం



చంద్రబాబు హామీ: అధికారంలోకి రాగానే ప్రతి మహిళకు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణం

జగన్ మేనిఫెస్టో: ప్రస్తావనే లేదు

టీడీపీ వస్తేనే మహిళలకు బస్సుల్లో ఉచితం

జిల్లాలో సుమారు 11 లక్షల మంది మహిళలున్నారు. వీరిలో ఉద్యోగ, ఉపాధి వంటి ఇతర పనుల కోసం నిత్యం ప్రయాణించేవారు లక్ష మంది ఉంటారు. టీడీపీ అధికారంలోకి వస్తే మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణమంటూ సూపర్‌సిక్స్ పథకాల్లో ప్రకటించేసింది. వైసీపీ ఈ విషయాన్ని పట్టించుకోలేదు. ఇప్పటికే కర్ణాటక, తమిళనాడు తాజాగా తెలంగాణ రాష్ట్రాల్లో ఈ ఉచిత ప్రయాణ పథకం విజయవంతంగా అమలవుతోంది.

చదువుకు భరోసా

చంద్రబాబు హామీ: టీడీపీ అధికారంలోకి వస్తే అమ్మకు వందనం పేరుతో ఇంట్లో ఎందరు పిల్లలున్నా ప్రతి పిల్లాడికీ రూ.15 వేలు చొప్పున అందిస్తాం.

జగన్ మేనిఫెస్టో: అమ్మఒడిని రూ.17లు వేలకు పెంచుతాం.

చంద్రబాబు గెలిస్తే రూ.1296 కోట్ల లాభం



ఈ ఎన్నికల్లో చంద్రబాబు అధికారంలోకి వస్తే తల్లులకు సుమారు రూ.1296 కోట్ల మేరకు ప్రయోజనం కలగనుంది. ఇంట్లో అందరు పిల్లలకు అమ్మఒడి కింద రూ.15 వేలు ఇస్తామని ఎన్నికల ముందు చెప్పిన జగన్.. ఆ తర్వాత ఒకరికే పరిమితం చేశారు. రూ.15 వేలలోనూ నిర్వహణ ఖర్చులంటూ కత్తిరించి రూ.13 వేలే ఖాతాల్లో వేస్తున్నారు. అదీ మధ్యలో ఒక సంవత్సరం ఎగ్గొట్టి.. నాలుగేళ్లే చెల్లించారు. ఇప్పుడు ఆ మొత్తాన్ని రూ.17 వేలు చేస్తామని చెబుతున్నా అధికారంలోకి వచ్చాక అంతే ఇస్తారన్న నమ్మకం జనంలో లేదు. ఒకవేళ ఇచ్చినా ఆ మొత్తం కత్తిరింపులు పోనూ ఖాతాలో జమయ్యేది రూ. 15 వేలే కావచ్చు. కానీ చంద్రబాబు ఎంతమంది పిల్లలుంటే అంతమందికీ రూ.15 వేలు చొప్పున ఇస్తామని మాటిచ్చారు. సగటున ఇద్దరు పిల్లలు ఉంటున్న నేపథ్యంలో ప్రతి కుటుంబానికి రూ.15 వేలు అదనపు లబ్ధి కలగనుంది. ఈ రకంగా చూస్తే జిల్లాలో సుమారుగా 1.72 లక్షల మంది తల్లులు ఇప్పుడు అమ్మఒడి పొందుతున్నారు. ఇదే సంఖ్యను తీసుకున్నా వీరికి ఏటా రూ.259 కోట్లు.. ఐదేళ్లలో ఏకంగా రూ.1296 కోట్ల లబ్ధి కలగనుంది. వ్యక్తిగతంగా లెక్కిస్తే ఒక్కో తల్లికి ఏటా రూ. 15 వేలు, ఐదేళ్లలో రూ. 75 వేలు ప్రయోజనం పొందనున్నారు. జగన్ గెలిస్తే ఈ మొత్తాన్ని నష్టపోవాల్సిందే.



ఎన్నికల ప్రచారంలో భాగంగా తిరుపతి నెహ్రూ నగర్‌లో శనివారం జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు సరదాగా కాస్సేపు ఇస్త్రీ చేశారిలా..

ప్రచార శంఖారావం రావిళ్లవారిపల్లె

● ఎవరైనా ఇక్కడి నుంచే ఎన్నికల ప్రచారం

చంద్రగిరి నియోజకవర్గంలో ఏ పార్టీ నాయకుడైనా రావిళ్లవారిపల్లె నుంచే ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించడం శుభసూచకంగా నమ్ముతున్నారు. ఆర్‌సీపురం మండలానికి రావిళ్లవారిపల్లె ఈశన్యంలో ఉండటమే ఇందుకు కారణమట. సర్పంచ్ ఎన్నికలు మినహా మిగిలిన అన్ని ఎన్నికల ప్రచారానికి టీడీపీ, వైసీపీ పార్టీల నాయకులు రావిళ్లవారిపల్లె నుంచి ప్రచారం ప్రారంభించడం ఆనవాయితీగా మారింది. టీడీపీ ఆవిర్భావం తరువాత ముద్దు కృష్ణమనాయుడు ఇక్కడ నుంచే ప్రచారం ప్రారంభించేవారు. ఒకసారి మినహా ఐదు సార్లు ఆయన ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఈ ఆనవాయితీని ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి కూడా కొనసాగించారు. ప్రస్తుత అసెంబ్లీ ఎన్నికల్లో పులివర్తి నాని తనయుడు వినీల్ తన తండ్రిపక్షాన, వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి తమ్ముడు హర్షిత్‌రెడ్డి కూడా నెల క్రితం రావిళ్లవారిపల్లె నుంచే ఎన్నికల ప్రచారం ప్రారంభించారు.

- రామచంద్రాపురం

రావిళ్లవారిపల్లెలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న పులివర్తి వినీల్(ఫైల్)

సెంటిమెంట్



పోస్టల్ బ్యాలెట్ కోసం ఫెసిలిటేషన్ సెంటర్

ఇతర జిల్లాలో ఓటు హక్కు కలిగి ఈ జిల్లాలో ఎన్నికల విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు తిరుపతిలో పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకునే సౌకర్యం కల్పించనున్నారు. ఇందుకోసం ఇందుకోసం ఫెసిలిటేషన్ సెంటర్ పెడుతున్నామని జిల్లా కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లో పోస్టల్ బ్యాలెట్ దరఖాస్తులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోస్టల్ బ్యాలెట్ దరఖాస్తులను జిల్లాలు, నియోజకవర్గాల వారీగా విభజించి ఆదివారం వెలగపూడిలోని సీఈవో కార్యాలయానికి సమర్పించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. భద్రత నడుమ ఉద్యోగుల బ్యాలెట్‌ను జిల్లాకు తీసుకురావాల్సి ఉంటుందని సంబంధిత అధికారులకు సూచించారు. ఎన్నికల విధిలో ఉన్న ఇతర జిల్లాల ఉద్యోగులు మే 5, 6 తేదీల్లో బాలాజీకాలనీలోని ఎస్వీయూ క్యాంపస్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ సెంటర్‌లో వినియోగించుకోవాలని కోరారు.

- తిరుపతి(కలెక్టరేట్)

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

సీఎం గారూ... ఈసారైనా అవ్వాతాతలకు 1వ తారీఖు పింఛను ఇస్తారా?

కురుగొండ్ల లక్ష్మీసాయిప్రియ



వెంకటగిరి/డక్కిలి, ఏప్రిల్ 27: సీఎం గారు వచ్చే నెలలోనైనా అవ్వాతాతలకు 1వ తారీఖున పింఛను ఇస్తారా లేదా మళ్లీ టీడీపీపై నిందలు మోపేందుకు ఏదైనా కొత్త డ్రామాకు తెరతీస్తారా అని మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల కుమార్తె కురుగొండ్ల లక్ష్మీసాయి ప్రియ అన్నారు. శనివారం ఆమె తన నివాసంలో మీడియాతో మాట్లాడారు. ఈనెల 28న సీఎం జగన్ వెంకటగిరి పర్యటనకు వస్తున్నారని పింఛను పంపిణీపై ఆయన ఇక్కడి నుంచే అవ్వాతాలకు స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. గత నెల ఫించను ఆలస్యంగా పంపిణీ చేసి టీడీపీ అడ్డుకోవడం వల్లే సకాలంలో ఇవ్వలేక పోతున్నామంటూ ప్రచా రం చేయించారన్నారు. వడదెబ్బతో చనిపోయిన వృద్ధులపై వైసీపీ నాయకులు శవ రాజకీయాలు నడిపారన్నారు. ఆ విషయం బట్టబయలు కావడంతో తేలు కుట్టిన దొంగల్లా ఉండిపోయారన్నారు. 2023 జూన్‌లో నేతన్న నేస్తం డబ్బులు వేసేందుకు వెంకటగిరికి వచ్చి బటన్ నొక్కిన ఆయన వెంటనే ఆల్తూరుపాడు రిజర్వాయరు నిర్మాణానికి రూ.550 కోట్లు విడుదల చేస్తున్నామని ప్రకటించడమేకాకుండా టెండర్లు పిలిచి పనుల మొదలు పెట్టమని గొప్పగా చెప్పారని, అయితే ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదన్నారు. ఇప్పుడు ఏ మొహం పెట్టుకుని వెంకటగిరికి వస్తున్నారన్నారు. సీఎం హామీలకే దిక్కు లేకపోతే ఇక ఆ పార్టీ మంత్రులు, ఎమ్మెల్యేలు చెప్పే మాటలు ఎవరు నమ్ముతారని ప్రశ్నించారు.

పనబాక నియామకంపై హర్షం

సూళ్లూరుపేట, ఏప్రిల్ 27: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా కేంద్ర మాజీ మంత్రి పనబాక లక్ష్మిని నియమించడంపై తిరుపతి జిల్లా తెలుగు యువత అధికార ప్రతినిధి శివశంకర నాప మునిరాజా హర్షం వ్యక్తం చేశారు. పార్టీకి పనబాక దంపతులు చేసిన సేవలను గుర్తించి టీడీపీ అధినేత చంద్రబాబు ఆమెకు సముచిత స్థానం కల్పించారన్నారు. అలాగే తిరుపతి పార్లమెంట్ ఎన్నికల కో-ఆర్డినేటర్ బాధ్యతలు కూడా అప్పగించడం సముచితం అన్నారు.

చంద్రబాబుతోనే సుపరిపాలన: పరసా



ప్రచారంలో పరసా, విజయశ్రీ తదితరులు

నాయుడుపేట టౌన్, ఏప్రిల్ 27: రాష్ట్రంలో చంద్రబాబుతోనే సుపరిపాలన సాధ్యమని మాజీ మంత్రి డాక్టర్ పరసారత్నం అన్నారు. నాయుడుపేట పట్టణ పరిధిలోని జువ్వలపాళెంలో శనివారం టీడీపీ నాయకులు బి.నారాయణ, ఎం.రవి ఆధ్వర్యంలో ప్రచారం జరిగింది. ఈ సందర్భంగా విజయశ్రీ మాట్లాడుతూ... తనపై నమ్మకంతో చంద్రబాబు సూళ్లూరుపేట నియోజకవర్గ అభ్యర్థిగా ఎంపిక చేశారని, ఆయన నమ్మకాన్ని ఒమ్ము చేయకుండా తనకు ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. టీడీపీ సీనియర్ నేత ఎస్.విజయభాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ... ఓటు అనే వజ్రాయుధంతో వైసీపీకి గుణపాఠం చెప్పాలన్నారు. బీజేపీ సీనియర్ నాయకులు ఆర్.కృష్ణయ్య, ఏ.రామయ్య, జె.మాల్యాద్రినాయుడు, చంద్రారెడ్డి, కె.సుబ్రహ్మణ్యం, టీడీపీ నాయకులు పసల గంగాప్రసాద్, రఫీ, సతీష్ చంద్ర, సుధీర్‌రెడ్డి, చక్రపాణి, పృథ్వీ, పసల చెంగయ్య, బాబు తదితరులు పాల్గొన్నారు.

మరోసారి బీజేపీ వస్తే ప్రజాస్వామ్యం కనుమరుగే

తిరుపతి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి చింతా మోహన్



సూళ్లూరుపేట, ఏప్రిల్ 27: మరోసారి బీజేపీ అధికారంలోకి వస్తే దేశంలో ప్రజాస్వామ్యం కనుమరుగవుతుందని కాంగ్రెస్ పార్టీ తిరుపతి ఎంపీ అభ్యర్థి చింతా మోహన్ అన్నారు. శనివారం ఆయన సూళ్లూరుపేట ఎమ్మెల్యే అభ్యర్థి చందనమూడి శివతో కలిసి పట్టణంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా చింతా మాట్లాడుతూ.. కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే అన్ని వర్గాల ప్రజలకు ప్రయోజనం ఉంటుందన్నారు. బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని రద్దు చేస్తుందన్నారు. ఆయన వెంట చిరంజీవి, కన్నంబాకం హరికృష్ణ, తేజోవతి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడు సుబ్బారావుకు మాతృవియోగం

నాయుడుపేట, ఏప్రిల్ 27: నాయుడుపేట పట్టణ టీడీపీ ప్రధాన కార్యదర్శి ఎన్.సుబ్బారావుకు శనివారం మాతృవియోగం జరిగింది. సుబ్బారావు తల్లి భూదేవి (85) అనారోగ్యంతో మృతి చెందారు. భూదేవి భౌతిక కాయానికి టీడీపీ పట్టణ అధ్యక్షుడు కందల కృష్ణారెడ్డి, తిరుపతి పార్లమెంట్ తెలుగుయువత ఉపాధ్యక్షుడు అవధానం సుధీర్, తెలుగుయువత అధ్యక్షుడు గాలి రాజేష్‌నాయుడు, కార్యదర్శి బి.నారాయణ, రవి తదితరులు నివాళి అర్పించారు. కుటుంబీకులకు ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు.

అగ్ని ప్రమాదంలో గడ్డి దగ్ధం

కోట, ఏప్రిల్ 27: మండలంలోని నెల్లూరుపల్లి కొత్తపాళెంలో శనివారం షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్ని ప్రమాదం జరిగి మినీ లారీలోని గడ్డి అగ్నికి ఆహుతైంది. గడ్డి వ్యాపారి నెల్లూరుపల్లి కొత్తపాళెం వద్ద పలువురు రైతుల నుంచి గడ్డి కొనుగోలు చేసి మినీ లారీలో లోడ్ చేసుకుని తరలిస్తుండగా జరుగుమల్లి వద్ద విద్యుత్ మెయిన్ లైన్ గడ్డికి తగలడంతో ఒక్క సారిగా మంటలు చెలరేగాయి. సమాచారం అందుకున్న కోట అగ్నిమాపక సిబ్బందికి సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు.

ఎన్‌బీకేఆర్‌లో సాంకేతిక సదస్సు



విద్యార్థులకు సూచనలిస్తున్న సదస్సు నిర్వాహకులు

కోట, ఏప్రిల్ 27: మండల పరిధిలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం నెక్సుస్పైర్స్ జాతీయ సాంకేతిక సదస్సు జరిగింది. ఈ సదస్సును కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయ్‌కుమార్‌డ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సదస్సుకు పలు ఇంజనీరింగ్ కళాశాలల నుంచి విద్యార్థులు హాజరయ్యారు. ఈ సదస్సులో కోడ్ డీబగ్గింగ్, మినీ హ్యాకథాన్, టెక్ డిబేట్ అండ్ స్పాట్ ఈవెంట్లు జరిగాయి. ఈ సందర్భంగా విద్యార్థులు పలు సాంకేతిక నైపుణ్యాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో స్టూడెంట్ బ్రాంచ్ కౌన్సిలర్ సురేష్‌బాబు, సీఎస్ఇ విభాగాదిపతి రాజశేఖర్‌రెడ్డి, హరనాధ్‌రెడ్డి, కళాశాల లెక్చరర్లు తదితరులు పాల్గొన్నారు.

రాపూరు బాలకృష్ణ పర్యటన సక్సెస్... టీడీపీ క్యాడర్‌లో జోష్

మద్దెలమడుగు నుంచి రాపూరు వరకు కిక్కిరిసిన జనం ● బాలయ్యను చూడగానే ఈలలు, కేకలు
● సభ విజయవంతంతో కురుగొండ్ల రామకృష్ణలో రెట్టింపు ఉత్సాహం




అభ్యర్థులను పరిచయం చేస్తున్న బాలకృష్ణ - ఆల్తూరుపాడు రిజర్వాయర్ గురించి వివరాలను కురుగొండ్లను అడిగి తెలుసుకుంటున్న బాలకృష్ణ

వెంకటగిరి/డక్కిలి, ఏప్రిల్ 27: సినీనటుడు, హిందూపురం ఎమ్మెల్యే నంద మూరి బాలకృష్ణ శనివారం రాపూరు పర్యటన విజయవంతం కావడంతో టీడీపీ క్యాడర్‌లో జోష్ పెరిగింది. బాలకృష్ణను చూసేందుకు జనం స్వచ్ఛందంగా సా యంత్రం 5 గంటలకే పెద్దఎత్తున రాపూరుకు చేరుకోవడంతో వీధులన్నీ కిక్కిరిసి పోయాయి. బాలయ్యని చూసేందుకు మహిళలు, యువత సభా ప్రాంగణానికి చేరుకుని జై బాలయ్య.. జైజై బాలయ్య అంటూ చేసిన నినాదాలతో ఆ ప్రాంతం హోరెత్తింది. సభాప్రాంగణం పసుపు జెండాలతో రెపరెపలాడింది. బాలకృష్ణ ప్రసంగం ముగిసేవరకు జనం సభాప్రాంగణంలో కదలకుండా ఉండిపోయారు. బానిస బతుకులు వీడి ఒక్క రోజైనా రౌడీ పోలీసులా, నరసింహ నాయుడిలా డ్యూటీ చేయాలన్న బాలయ్య మాటలు యువతలో ఉత్సాహన్ని నింపాయి. జగన్‌కు పిచ్చి ముదిరింది... సైకో జగన్ అంటూ పంచ్ డైలాగులు వేసినప్పుడల్లా జనం ఈలలు వేస్తూ చప్పట్లు కొట్టారు. వెంకటగిరి నియోజకవర్గంలోని సమస్యలు, ఇక్కడి పరిస్థితులను మాజీ ఎమ్మెల్యే, టీడీపీ అభ్యర్థి కురుగొండ్ల రామకృష్ణ బాలకృష్ణకు వివరించారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే నేతన్నలను అన్ని విధాలా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ఆల్తూరుపాడు రిజర్వాయరును పట్టించుకోకుండా రైతులకు వైసీపీ ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేసిందని, పార్టీ అధికారంలో వచ్చిన తరువాత రిజర్వాయరు పూర్తియించే బాధ్యతను తాను తీసు కుంటానని బాలకృష్ణ హామీ ఇచ్చారు. బాలకృష్ణ ప్రసంగం ముగిశాక కురుగొండ్ల రామకృష్ణ చైతన్యరథం నుంచి ప్రసంగించారు.



సభను విజయవంతం చేసి నందుకు కృతజ్ఞతలు తెలిపారు.టీడీపీ నాయకులు నరసింహయాదవ్, కేవికే ప్రసాదనాయుడు, దందవోలు వెంకటేశ్వర్లు రెడ్డి, భాస్కరరెడ్డి, రాఘవరెడ్డి, ఎదోటి కోటేశ్వర నాయుడు, చెన్ను తిరుపాల్ రెడ్డి, మదురెడ్డి, పులికొల్లు రాజేశ్వరరావు, పప్పు చంద్రమౌళి రెడ్డి, అవ్వారు సత్యనారాయణ, పునుగోటి విశ్వనాథ నాయుడు, ఏలేశ్వరం రామచంద్రయ్య నాయుడు, వేపమాను యువరాజు, రాములు, వెంకటపతి, కాపా శ్రీనివాసులు నాయుడు, సిసి నాయుడు, కాపా ప్రవీణ్ నాయుడు, మల్లారపు బాబు తదితరులు పాల్గొన్నారు.

కోట మండల సర్వసభ్య సమావేశం వాయిదా

కోట, ఏప్రిల్ 27 : కోట మండల సర్వసభ్య సమావేశం శనివారం వాయిదా పడింది. ఈ సమావేశానికి ఎంపీపీ, ఎంపీటీసీ సభ్యులు హాజరు కాకపోవడంతో కోరం లేక సమావేశాన్ని వాయిదా వేసినట్లు ఎంపీడీవో శంకరయ్య తెలిపారు.

వలంటీర్ల రాజీనామా

కోట, ఏప్రిల్ 27: మండల పరిధిలోని చెందోడు సచివాలయానికి చెందిన 11 మంది వలంటీర్లు శనివారం రాజీనామ చేశారు. ఎంపీడీవో శంకరయ్యకు రాజీనామా పత్రాలను అందజేశారు. రాజీనామాలను ఆయన ఆమోదించారు.

బాలకృష్ణ రోడ్‌షోను విజయవంతం చేద్దాం

సూళ్లూరుపేట, ఏప్రిల్ 27: సూళ్లూరుపేట పట్టణంలో ఆదివారం జరిగే నందమూరి బాలకృష్ణ రోడ్‌షోను విజయవంతం చేయాలని నియోజకవర్గ ఇన్‌చార్జి నెలవల సుబ్రమణ్యం పిలుపునిచ్చారు. శనివారం రాత్రి ఆయన టీడీపీ కార్యాలయంలో మాట్లాడుతూ... ఆదివారం సాయంత్రం 4 గంటలకు బాలకృష్ణ సూళ్లూరుపేటకు చేరుకుంటారన్నారు. హోలిక్రాస్ కూడలి నుంచి ప్రచారరథంపై వినాయకుడి గుడి వద్దకు చేరుకుంటారు. అక్కడినుంచి పాండురంగస్వామి ఆలయం మీదుగా బాపూజీ వీధిలో రోడ్‌షో జరుగుతుందన్నారు. బాపూజీ వీధిలో రోడ్‌షోలో వెళ్తూ ఆర్టీసీ సెంటర్ వద్ద బాలకృష్ణ ప్రసంగి స్తారన్నారు. బాలకృష్ణ పర్యటనను టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అందరూ పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

చంద్రబాబుతోనే సుపరిపాలన

పెళ్లకూరు, ఏప్రిల్ 27: టీడీపీ అధినేత చంద్రబాబుతోనే సుపరిపాలన సాధ్యమని, అధికారంలోకి రాగానే సూపర్ సిక్స్ పథకాలతో అన్ని వర్గాల ప్రజలకు లబ్ధి చేకూరుతుందని ఆ పార్టీ సీనియర్ నాయకులు పేరం రమేష్‌నాయుడు, మధుసూదన్‌నాయుడు అన్నారు. పెళ్లకూరు పట్టణంలో శనివారం స్థానిక నేతలతో కలసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి సైకిల్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యే అభ్యర్థిగా డాక్టర్ నెలవల విజయశ్రీని, ఎంపీగా వెలగపల్లి వరప్రసాదరావును గెలిపించాలని అభ్యర్థించారు. క్లస్టర్ ఇన్‌చార్జి దేవారెడ్డి నాగేంద్రప్రసాదరెడ్డి, రాధానాయుడు, సుబ్రహ్మణ్యంరెడ్డి, కన్నలి హరినాయుడు, మురళీనాయుడు పాల్గొన్నారు.



సూపర్ సిక్స్ పథకాలను వివరిస్తున్న టీడీపీ నాయకులు

అభ్యర్థి విజయానికి బూత్ కన్వీనర్లే కీలకం: నెలవల



బూత్ కన్వీనర్లకు దిశానిర్దేశం చేస్తున్న నెలవల

సూళ్లూరుపేట, ఏప్రిల్ 27: రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి నెలవల విజయశ్రీ విజయం సాధించాలంటే బూత్ కన్వీనర్ల పాత్ర ఎంతో కీలకమని మాజీ ఎంపీ, నియోజకవర్గ ఇన్‌చార్జి నెలవల సుబ్ర మణ్యం అన్నారు. శనివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో పట్టణ కమిటీ ఆధ్వర్యంలో బూత్ కన్వీనర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... బూత్ కన్వీనర్లు తమ పరిధిలో ఉన్న ప్రతి ఓటరును కలిసి టీడీపీ అధికారంలోకి వస్తే చేపట్టే పథకాలను వివరించి మెజార్టీ వచ్చేలా పనిచేయాలన్నారు. టీడీపీ ప్రజలకు అందించే పథకాలను ప్రజల్లోకి విరివిగా తీసుకెళ్లాలని దిశానిర్దేశం చేశారు. తిరుపతి జిల్లా కార్యదర్శి వేనాటి సతీష్‌రెడ్డి, అధికార ప్రతినిధి టి.సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ...విజయశ్రీ విజయానికి సమన్వయంతో పనిచేద్దామని పిలుపునిచ్చారు. పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు ఆకుతోట రమేష్, ఏజీకిషోర్, తెలుగుయువత నాయకులు మాధవనాయుడు, లోకేష్ నాయుడు, సురేష్‌నాయుడు, ఏ.శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు

వేసవిలో కూలీలు జాగ్రత్తలు పాటించాలి

తిరుపతి(ఆటోనగర్), ఏప్రిల్ 27: జిల్లాలో ఉష్ణోగ్రతలు పెరిగి వడగాల్పులు వీస్తున్నాయని, బహిరంగ ప్రదేశాల్లో పనులు చేసే కూలీలు జాగ్రత్తలు పాటించాలని డీసీఎల్ (డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్) బాలునాయక్ శనివారం ఒక ప్రకటనలో సూచించారు. కాంట్రాక్టర్లు, యజమానులు కూడా కూలీలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని కోరారు. నీడపాటున పనులు చేయించాలని, మధ్యాహ్నం సమయంలో పనులు చేయించొద్దని కోరారు. కూలీలు వడదెబ్బకు గురికాకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. ఈ మేరకు కలెక్టర్ కూడా ఆదేశించారని పేర్కొన్నారు.

సీతారాములకు స్నపన తిరుమంజనం



గూడూరు, ఏప్రిల్ 27: పట్టణంలోని కోనేటిమిట్ట కోదండ రామాంజనేయస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం సీతారాముల ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. మాడ వీధుల్లో గ్రామోత్సవం అనంతరం ఆలయానికి వేంచేపు చేసిన స్వామిఅమ్మవార్లకు వేద పండితుల మంత్రోచ్ఛరణల నడుమ వసంతోత్సవం, స్నపన తిరుమంజనం శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాద వినియోగం జరిగింది.

వడదెబ్బతో ఇద్దరి మృతి




చెంగయ్య, కృష్ణయ్య (ఫైల్‌ఫొటోలు)

వరదయ్యపాళెం/పిచ్చాటూరు, ఏప్రిల్ 27: వరదయ్యపాళెం మండలంలోని సంతవేలూరుకు చెందిన తొట్టంబేడు చెంగయ్య గత సోమవారం ఉపాధి పనులకు వెళ్లాడు. ఎండ వేడిమికి భరించలేక స్పృహ తప్పిపడిపోయాడు. సూళ్లూరుపేట ప్రైవేటు ఆస్పత్రికి, అక్కడి నుంచి తిరుపతి రుయాకు తరలించారు. చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. అలాగే పిచ్చాటూరు మండలంలో రామాపురం దళితవాడకు చెందిన కృష్ణయ్య(75) రెండు రోజుల క్రితం వడదెబ్బకు మృతి చెందాడు. వేలూరు నుంచి రామాపురం వెళ్లే నడకదారిలో కృష్ణయ్య మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు.

అరాచక ప్రభుత్వానికి బుద్ధి చెప్పండి

తిరుపతి బీజేపీ ఎంపీ అభ్యర్థి వరప్రసాద్




గూడూరు రోడ్డు షోలో బాలకృష్ణతో వరప్రసాద్ - తిరుపతిలో ప్రచారం నిర్వహిస్తున్న డాక్టర్ స్ఫూర్తి

రాపూరు/గూడూరు, ఏప్రిల్ 27: జగన్ ప్రభుత్వ అరాచకం మితిమీరిపోయిందని ఆ ప్రభుత్వానికి ఓటు ద్వారా బుద్ధి చెప్పాలని తిరుపతి బీజేపీ ఎంపీ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాదరావు పిలుపునిచ్చారు. శనివారం రాపూరు, గూడూరులలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రజల్లో తనకు వస్తున్న ఆదరణను చూసి వైసీపీ భయపడుతోందన్నారు. తాను వైసీపీలో ఉన్నంత కాలం తనను ప్రజలనుంచి దూరం చేయాలని చూశారన్నారు. అలాగే ఎన్నో అవమానాలకు గురి చేశారన్నారు. తాను చేసిన అభివృద్ధే నేటికీ కనబడుతోందని తనను మరోసారి గెలిపిస్తే అన్ని విధాలా ప్రజలకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు.

బాలకృష్ణ ర్యాలీలో... టీడీపీ నాయకుడు, సినీనటుడు నందమూరి బాలకృష్ణ గూడూరు, రాపూరులలో నిర్వహించిన ర్యాలీలు, బహిరంగ సభల్లో ఆయనతో కలసి తిరుపతి బీజేపీ ఎంపీ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాదరావు పాల్గొన్నారు. ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకు సాగారు. బాలకృష్ణ తిరుపతి బీజేపీ ఎంపీ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాద రావుతోపాటు గూడూరు, వెంకటగిరి టీడీపీ అభ్యర్థులు పాశం సునీల్‌కుమార్, కురుగొండ రామకృష్ణలతో కలసి ప్రజలకు పరిచయం చేయగా ప్రజల నుంచి భారీ స్పందన లభించింది. రెండు చోట్లా రోడ్‌షోలో బీజేపీ, టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. కాగా వరప్రసాద్ కుమార్తె డాక్టర్ స్ఫూర్తి తన తండ్రి తరపున తిరుపతి నగరంలో ప్రచారం నిర్వహించారు. తన తండ్రిని గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు.

'మెకానికల్'లో నూతన ఆవిష్కరణలు జరగాలి



సదస్సులో పాల్గొన్న ప్రొఫెసర్ సోమశేఖర్ ఎస్.హిరేమత్

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఏప్రిల్ 27: మెకానికల్ ఇంజనీరింగ్ రంగంలో నూతన ఆవిష్కరణలు జరగాలని మద్రాసు ఐఐటీ ప్రొఫెసర్ సోమశేఖర్ ఎస్ హిరేమత్ సూచించారు. ఎమర్జింగ్ ట్రెండ్స్ అండ్ చాలెంజెస్ ఇన్ ఫ్లూయిడ్ పవర్ సిస్టమ్స్ అంశంపై ఎస్వీయూలో మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం చేపట్టిన ఒక్కరోజు సదస్సుకు సోమశేఖర్ ముఖ్య అతిథిగా ప్రసంగించారు. తిరుపతి ఐఐటీ ప్రొఫెసర్ రవిశంకర్ మాట్లాడుతూ.. ఐఐటీలతో అవగాహన ఒప్పందాలు చేసుకుంటే జ్ఞాన మార్పిడికి అవకాశం కలుగుతుందన్నారు. డీఆర్‌డీవో శాస్త్రవేత్త కరుణానిధి మాట్లాడుతూ.. సామాజిక ప్రయోజనంతో కూడిన పరిశోధనలు చేపట్టాలన్నారు.

మద్యం అక్రమ రవాణా, అమ్మకాలపై నిఘా పెట్టాలి



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రవీణ్‌కుమార్

తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 27: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మద్యం అక్రమ రవాణా, నిల్వ, అమ్మకాల ఉల్లంఘనలు జరగకుండా కఠినంగా వ్యవహరించాలని ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారులను కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ఆదేశించారు. కలెక్టరేట్‌లో శనివారం అధికారులతో సమీక్షించారు. జిల్లాలోని డిస్టలరీ, ఔట్‌లెట్‌లలో సీసీ కెమెరాల పర్యవేక్షణ ఉండాలని, అక్కడినుంచి వెళ్లే మద్యం రవాణా వాహనాలకు జీపీఎస్ ఏర్పాటు చేయాలన్నారు. జిల్లా ఎక్సైజ్ అధికారి జానకిరాములు మాట్లాడుతూ 24 వాహనాల ద్వారా రవాణా చేస్తున్నామని, వాటికి జీపీఎస్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మద్యం అక్రమ నిల్వలు, అమ్మకాల ఉల్లంఘనపై 91771 19097 జిల్లా ఎక్సైజ్ కంట్రోల్ రూం నెంబర్లకు ఫోన్ ద్వారా ఫిర్యాదు చేయాలని సూచించారు. జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌బ్యూరో అధికారి రాజేంద్ర మాట్లాడుతూ మార్చి 16నుంచి ఏప్రిల్ 26వ తేదీ వరకు 349 కేసులు నమోదు చేసి, 20 వాహనాలు సీజ్ చేశామని, సీజ్ చేసిన మద్యం విలువ రూ.29.86 లక్షలు ఉందని తెలిపారు. అదనపు ఎస్పీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

తిరుమలేశుడి సేవలో ప్రముఖులు

తిరుమల, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): తమిళనాడులోని నాంగునేరి వానమామలై మఠాధిపతి మధురకవి జీయర్‌స్వామి శనివారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం నైవేద్య విరామ సమయంలో అఖిలాండం వద్దకు చేరుకున్న జీయర్‌స్వామికి ఆలయ అర్చకబృందం, ఈవో ధర్మారెడ్డి ఇస్తికఫాల్(పెద్దమర్యాద)తో స్వాగతం పలికారు. అలాగే తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ సతీమణి దుర్గా స్టాలిన్ శనివారం ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో శ్రీవారిని దర్శించుకున్నారు.

శ్రీసిటీలో శ్రీవాణి ఉగాది పురస్కారాల ప్రదానం



పురస్కార గ్రహీతలతో శ్రీసిటీ ఎండీ

శ్రీసిటీ, ఏప్రిల్ 27: శ్రీసిటీలో ఉగాది పురస్కారాల ప్రదానోత్సవం శనివారం వేడుకగా నిర్వహించారు. శ్రీసిటీ అధ్యాత్మిక సాహిత్య వేదిక శ్రీవాణి ఆధ్వర్యంలో స్థానిక బిజినెస్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో వివిధ రంగాలకు చెందిన నలుగురు ప్రముఖులకు ఉగాది పురస్కారాలను అందజేశారు. శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి చేతుల మీదుగా శ్రీవాణి ప్రతిష్టాత్మక ఉగాది సంగీత పురస్కారాన్ని టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్టు ప్రసిద్ధ గాయకులు కె.సరస్వతీప్రసాద్, సాహిత్య పురస్కారాన్ని కవి, సాహితీవేత్త బుచ్చినాయుడు కండ్రిగకు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు యువశ్రీ మురళి, ఆధ్యాత్మిక పురస్కారాన్ని ప్రముఖ ఆధ్యాత్మిక వక్త, అన్నమయ్య, మాతృశ్రీ తరిగొండ వెంగమాంబల ఆధ్యాత్మిక రచనల పరిశోధకులు గంధం బసవ శంకరరావు, పాత్రికేయ పురస్కారాన్ని తిరుపతికి చెందిన మాజీ హిందూ విలేకరి ఏ.దేవరాజన్ అందుకున్నారు. శ్రీసిటీ డీఎస్పీ పైడేశ్వరరావు, సీఐ భాస్కర్, సాహిత్య ప్రియులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

నాయుడుపేట టౌన్, ఏప్రిల్ 27 : చికిత్స పొందుతూ వెంకటయ్య (60) మృతి చెందినట్లు అర్బన్ సీఐ శ్రీనివాసులురెడ్డి తెలిపారు. ఈ నెల 26వ తేదీ మండలంలోని మర్లపల్లిలో అనారోగ్యకారణాలవల్ల వెంకటయ్య పురుగులమందు తాగాడు. నాయుడుపేటలో ప్రాథమిక చికిత్సల అనంతరం నెల్లూరుకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు.